ఆంధ్ర సచిత్ర వారపత్రిక

12-4-68



40 పైసల

తలనొప్పి?



అవేదన్



తీసుకొని చిటికిలో పోగొట్టండి


SQUIBB
SARABHAI CHEMICALS


® ఇ. ఆర్. స్క్విబ్ అండ్ సన్స్ ఇన్‌కార్పొరేటెడ్ వారి రిజిష్టర్డ్ ట్రేడ్‌మార్కుకు చిహ్నం. దీని క్రిందను ఉపయోగదారులు సారాభాయ్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్.



ఆశ్చర్యకరమైన "ఎపెప్" కం అవేదన్ తలనొప్పి, జలుబు, యితర శరీర నొప్పులను త్వరగా, సురక్షితముగా, నిశ్చయముగా నివారణచేస్తుంది.

Shilpi SC 51 A/67 Tel


మేలిరకం "డస్ట్"
టీలలో సాటిలేనిది
HIMALAYAN
FINEST
GOLDEN DUST TEA
LIPTON'S
FINEST
GOLDEN DUST TEA
లిప్టన్స
హిమాలయన్
గోల్డెన్
డస్ట్ టీ
ఈ టీతో మీరు కమ్మని, చిక్కని బంగారు ఛాయగల టీ కప్పుల వెంబడి కప్పులు అతి త్వరలో తయారు చేయగలుగుదురు. ఈ పానీయమును మీరే త్రాగి చూడండి. అతిథులకు కూడా ఇవ్వండి. మీరు తప్పక సంతోషముతో వికసిస్తారు. అవును-మీ ఆనందభరితులైన అతిథులు కూడాను. లిప్టన్స్ హిమాలయన్ గోల్డెన్ డస్ట్ టీ మేలిరకం టీలలో నిజంగా అద్వితీయమైనది.
LIPTON
లిప్టన్స్ అంటే మంచి టీ


సుందర్‌లాల్ నహతా సమర్పించు
రాజ్యం ప్రొడక్షన్స్ వారి
గోవుల గోపన్న
పద్మశ్రీ ఏ.నాగేశ్వరరావు
(ద్విపాత్రాభినయం)
దర్శకత్వం. సి.యస్.రావ్. సంగీతం. ఘంటసాల
నిర్మాతలు. శ్రీధరరావు * లక్ష్మీరాజ్యం
ఏప్రిల్
19
విడుదల
MOULIS

గమనిక

5—4—68 సంచికలోని 'గుండెల మీద కుంపటి' కథా రచయిత పేరు అప్పాజీ అని పాఠకులు గమనించ కోరుతున్నాము.

—సం॥

క థ లు

మా, ఉగాది ప్రత్యేకసంచికలో (29 3 1968) వేసిన 'నిరీక్షణ' కథ వ్రాసిన రచయిత్రి పేరు జి. ఉషారాణి అని వేశారు రచయిత్రి ఇంటి పేరు పూర్తిగా మార్చేశారు ఆమె పేరు వై ఉషారాణి అనగా కుమారి యర్నాగుల ఉషారాణి దయచేసి సంపాదకులు, ఈ చిన్నతప్పును సవరించ గోరుచున్నాము.

కుమారి వై ఉషారాణి

*　　*　　*

పరిమళాసోమేశ్వర్‌గారి, 'తప్పెవరిది' చాలా బాగుంది కాని సుజాతకు చాలా అన్యాయము జరిగింది. ఇందిర పాత్ర విచిత్రమైనది. ఏమైనప్పటికి కథ నా హృదయానికి హత్తుకుపోయింది

ఆర్ స్వర్ణలత (పెద్దకొండ)

ఫిలిం బాలట్

ఈ బాలెట్ ఫలితాలు ఎంతో సమంజసంగా ఉన్నాయి. వరుసగా మూడు సంవత్సరాల ఉత్తమ నటుడిగా ఎన్నికై 'హేట్రిక్' కొట్టిన పద్మశ్రీ ఎన్ టి రామారావుకి నా అభినందనలు

సి హెచ్ నరేంద్రనాథ్, కాకినాడ

ఉత్తరాలు

మెదడుకి మేత

2—2—68 తేది పత్రికలోని 'మెదడుకి మేత' లోని సమస్యలపై నేను వ్రాసిన ఉత్తరానికి డా. నళినీమోహన్‌గారి జవాబు జాగ్రత్తగా చదివాను సీసాలు—బొద్దింకలూ సమస్యలో 'కొన్ని' అన్న మాటలో గుప్తమైన మెలిక ఉన్నదని, అందుచేత '3 సీసాలు+5 బొద్దింకలూ' మాత్రమే సరియైన సమాధానం అని డాక్టరుగారి వాదం. ఈ మెలిక ఎంతగట్టిదో చూద్దాం. మాటవరుసకి సరియైన సమాధానం '6 సీసాలు+1 బొద్దింక' అనుకుందాం—అప్పుడు సమస్య ఏరూపంలో ఉండేది? 'ఒక జాడీలో కొన్ని సీసాలు, కొన్ని బొద్దింకలూ' అనక తప్పేదా? అందుచేత 'కొన్ని' అని వాడినంత మాత్రాన '1' అన్న జవాబు తప్పవుతుందనడం న్యాయంగా తోచదు

ఇంక 'అనుమానపు మొగుళ్ళు' సమస్యలో 'ఆ భర్తలు అనుమానంలో ఒకరికొకరు ఎక్కువ చదివా' రని గమనించాలి ఆ సమస్యలో 'ఇతర మొగవాళ్ళు ఉన్నప్పుడు అక్కడ తనభార్య ఉండడం ఏ ఒక్క భర్తకి ఇష్టం లేదు' అని ఉన్నది నేను సూచించిన జవాబులో విమలను అద్దరికి తీసుకు వెళ్ళినప్పుడు విశ్వనాథం పడవలోంచి దిగవలసిన అవసరం కూడా లేదుకదా విమలమాత్రం దిగి ఆ గట్టున, రేవుకి కొంచెం దూరంలో కూర్చున్న కమల దగ్గరకు పోయి కూర్చుంటుంది ఎంత అనుమానమైనా ఈమాత్రం సహించలేడా కామేశ్వరరావు అనుకున్న 'డాక్టరుగారు అట్లాకాదు ఆ మొగుళ్ళు మరీ పిచ్చి అనుమానస్థులు' అంటున్నారు ఈ మొగుళ్ళ సంగతి వారే బాగ ఎరుగుదురు కనుక వారిమాటలే నమ్మి వారితో ఏకీభవించక తప్పటల్లేంది

టి కె ఎన్ మూర్తి, (బొంబాయి)

'దీని భావమేమి తిరుమలేశ?'

ఈముకుటంతో పొడుపుకథల పద్యాలు కొన్ని మన తెలుగుదేశంలో ప్రచారంలో ఉన్నాయి ప్రసిద్ధమైన ఈముకుటాన్ని వినడమేగాని పొడుపుకథల పద్యాలు నాకు దొరకలేదు అవి గ్రంథస్థం అయాయేమో తెలియదు. అటువంటి పద్యాలు ఎవరికైనా తెలిస్తే— ఎన్నితెలిస్తే అన్ని— నాకుపంపవలసిందిగా ఆంధ్రపాఠకలోకాన్ని అర్థిస్తున్నాను.

భవదీయుడు
మహీధరనళినీ మోహన్
C/o ఆంధ్రసచిత్ర వారపత్రిక
7, తంబుచెట్టి వీధి
మద్రాసు.

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 12—4—'68
కీలకనామ సం॥ చైత్ర శు॥ బహుళ చతుర్దశి

సంపుటము : 60 సంచిక : 31

స్థాపితము
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

పోస్టుద్వారా

సంవత్సర చందా	26 00
6 మాసముల చందా	13.00
3 మాసముల చందా	6.50

విషయానుక్రమణిక

ముఖచిత్రం 'తల్లిప్రేమ'లో కాంచన.


బస్సు తప్పి పోయింది
డి.ఎం.కె.
విద్యార్థుల అభిమానాన్ని తిరిగి పొందటానికి
ఖాళీ!
అంక్టాడ్ సమావేశం
అభివృద్ధి చెందుతున్న దేశాలు
నా తిరుగులేని పెద్ద కాలు
వేసే అడుగు కాస్త చూసి వెయ్యి అబ్దుల్లా!
మొగలాయివారి ఆత్మశుద్ధికి తన నిరాహార దీక్ష!
గుజరాత్‌లోని పార్టీ వారి అవకతవకలకి నిరసనగా పార్టీ పదవుల్ని పరిత్యజించారు... మసానీ

ఆర్థికమాంద్యం - ప్రభుత్వ విధానాలు?

కేంద్ర మంత్రివర్గాన్ని ఒక 'భూతం' భయపెడ్తోంది—పార్లమెంటు వారి పాలిట పెనుభూతం అయిపోయింది. పరిపాలన అసలు సాగటంలేదు. ఏ మంత్రి ఏదిచేస్తే పార్లమెంటు ఏమంటుందో అనే భయం ఒకటి వచ్చేసింది. పార్లమెంటులో కాంగ్రెసుకి మెజారిటీ ఉంది, ప్రతిపక్షం వారు కార్యక్రమం యధావిధిగా నడవాలనే కోరుకుంటున్నారు — అయితే ఒక్కొక్క సభలో అయిదారుగురు సభ్యులు అందరినీ బెదిరించేస్తున్నారు. ప్రభుత్వం అసహాయత వీరి సంఖ్యతో బాటు ఎక్కువ అవుతోంది.

మాజీ సభాధ్యక్షులు శ్రీ అయ్యంగారు తను పదవికి ఎన్నికకాగానే ఢిల్లీలోని జమునా బజార్‌ని 'శుభ్రంచేస్తా' నన్నారు ఆపని ఈ మార్చి నెలకికాని పూర్తి కాలేదు. జమునా బజారునిండా కాంగ్రెసు వోటర్లే ఎక్కువమంది వెంటనే ఢిల్లీ కాంగ్రెసువారు ఒకనిరసన ప్రదర్శనచేశారు కొందరు కాంగ్రెసువారిని ఎరెస్టుచెయ్యటం కూడా జరిగింది దీనితర్వాత లోకసభలో కొత్త మురికివాడలోకి మారినవారికి తగిన సదుపాయాలు ఇవ్వలేదనే ఆరోపణ వినపడింది పాత మురికివాడ అయిన జమునా బజారులో వారికి ఏమిసదుపాయాలుండేవి? కేంద్ర పరిపాలనకింద ఉన్న ఢిల్లీలోనే ఈ ఆటంకాలు వస్తే ఇక ఢిల్లీ పరిపాలన సంస్థ పని ఏమి చెయ్యగలుగుతుంది?

పార్లమెంటులో హజారి నివేదికమీద చర్చ జరిగింది. ఈ చర్చలో బిర్లా సంస్థ కొందరి దండయాత్రకి గురి అయింది. ఈ చర్చని ప్రారంభించినవారు పరిశ్రమలమంత్రి శ్రీ ఫక్రుద్దీన్ ఆలీ అహమ్మద్. ఈయన ఎక్కువగా మాట్లాడకపోయినా తన వాలకాన్ని దాచుకొనటానికి ప్రయత్నించలేదు. ఒక ప్రాజెక్టులో బిర్లాసంస్థకి 8 శాతం ఈక్విటీ షేర్లు ఉన్నాయి, అందులోనే ఒక జర్మనుసంస్థకి 45 శాతం, ప్రజలకి 37 శాతం వాటాలు ఉన్నాయి, ఈ చర్చ వెనుకఉండే వైఖరి ప్రాజెక్టు మంజూరు కాకుండా అడ్డుపడ్తోంది. మరొక జర్మన్ సహకార — పరిశ్రమ ఈ రకం కారణం వల్లనే మంజూరు కాకుండా ఆగిపోయింది ఇది బిర్లా వారికి సంబంధించినది కాదు. ప్రస్తుతం భారత దేశంలో ఉన్న జర్మన్ విదేశాంగ మంత్రి ఈ రెండు ప్రాజెక్టుల సంగతినీ ప్రభుత్వానికి గుర్తుచేశారు. అవరోధాలని తగ్గిస్తే విదేశపు ప్రయివేటు పెట్టుబడి అధికం అవుతుందని ఆయన విపులీకరించి చెప్పారు. ఇప్పటికే సహాయం చేసే దేశాలు తమ తమ ఇబ్బందులని ఎదుర్కొంటున్నాయి అమెరికాకి బంగారం సమస్య వచ్చింది ఎన్నో ప్రాజెక్టులు దెబ్బతినవచ్చు ప్రభుత్వాలు సహాయం చెయ్యలేనప్పుడు ప్రయివేటు కంపెనీలే ముందుకు రాగలవు తరుచు బిర్లాలని, అమెరికాని తిడుతూఉంటే అవీ సహాయం చెయ్యటానికి జడుస్తాయి

సుమారు 20 మంది పార్లమెంటు సభ్యులు (కాంగ్రెసువారితో సహా)పరిపాలన మందంగా జరుగుతున్నదని ఒక మెమొరాండమ్ సమర్పించుకున్నారు పరిశ్రమల శాఖలో అసలే ఫయిళ్లు జరగటంలేదని వారు ఫిర్యాదు చేశారు.

ఇది అతి ముఖ్యమయిన విషయం. దైనందిన పరిపాలనలో పార్లమెంటు సభ్యులు కొందరు జోక్యం చేసుకోకుండా ముందే చూసుకుని ఉండాలి వీరిని అరికట్టే బదులు కొందరు కేంద్రమంత్రులు తమ సహచరుల వివాద ద్వేషంతో ఈ రకం జోక్యాన్ని ప్రోత్సహిస్తున్నారు వీరి బాధ పడలేక కొందరు మంత్రులు ముందు వారి వాలకం భోగట్టాచేసి మరీ నిర్ణయాలు తీసుకుంటున్నారు మహాత్మాగాంధీ శిష్యులనబడే కొందరు మంత్రులకి మంచి రక్షణ లభిస్తోంది. పారిశ్రామికాభివృద్ధి శాఖ మంత్రి ఒక ప్రాజెక్టు విషయమయి తాము ఎందుకు నిర్ణయం తీసుకొనలేదో చెప్పారు. ఆ ప్రాజెక్టుకి సంబంధించిన వస్తువు ఒకటి భారతదేశంలోనే దొరుకుతుందో లేదో అని వెతుకుతున్నారుట. ఇంతలో యూరప్ యాత్ర ఒకటి చేసి వస్తారేమో.

ప్రతి వస్తువూ దేశంలోనే తయారు చెయ్యాలనే ఉద్దేశం ప్రమాదకరమయినదని సర్ వార్మన్ కిప్పింగ్ మొన్ననే అన్నారు ఈరకం ధోరణివల్ల కాలవ్యయం అధికంగా అవుతుందన్నారు ఆయన. ఒక కర్మాగారం కొంతకాలం ఆపి పెట్టే బదులు దానికి కావలసిన దిగుమతులని అనుమతిస్తే విదేశద్రవ్య నష్టం రాదని సర్ వార్మన్ విపులీకరించారు.

రష్యా వాగన్లకీ ఇతర ఉక్కు సామగ్రికీ ఆర్డర్లు ఇస్తోంది. ఈ ఆర్డర్ల వల్ల కొత్త ఉత్పత్తి శక్తి ఏర్పరచటం అవసరం దూర్గాపూర్ చక్రాలు తయారు చేసే సదుపాయం ఉంది. కాని, దేశంలోని ప్రస్తుతపు అవసరాలకే ఈ ఉత్పత్తి సరిపోవటం లేదు. ఈ కొత్త వాగన్ల ఉత్పత్తికి కావలసిన చక్రాలు తయారు చేసే ఏర్పాట్లు అదనంగా చెయ్యాలి. మన దేశంలో ఉక్కు అంత శ్రేష్ఠమయినది కాదు ఎన్ని సామానులని అక్కరలేదని (విదేశీ ఖాతాదారులు)తోసేస్తారో చూడాలి.

రష్యా ప్రధాని శ్రీ కోసీజిన్ ఒక ముఖ్యమయిన ప్రశ్న వేశారు. భారత దేశంలో ధరలు అధికం అన్న సంగతిని ఆయన మన నాయకులకి గుర్తుచేశారు. మాంద్యంతో బాధపడుతున్న మన పరిశ్రమలకి సహాయం చెయ్యటానికే రష్యా ఈ ఆర్డరు ఇస్తోంది రాబోయే అయిదేళ్లలో రష్యాకి కావలసిన సామాను గురించి చర్చలు జరపటానికి రష్యన్ బృందం ఒకటి మనదేశానికి రానున్నది. ఇక బాధ్యతలు మనవే! ధర, నాణ్యం, డెలివరీ గడువు తేదీలు—వీటిని గురించి స్పష్టంగా అన్ని వివరాలూ తెల్సుకోవటం మన కర్తవ్యం. ఏమాత్రం అశ్రద్ధచేసినా మన వ్యాపారం దెబ్బతిని పోగలదు.

ఇక ధరల సంగతి. వాగన్ల ఎగుమతి

(రష్యాకి) ఏడాదికి నూరుకోట్ల రూపాయల దాకా ఉంటుంది. భారత–రష్యాల వ్యాపారం వినిమయం సిద్ధాంతంమీద ఆధారపడి ఉంది. దానికి తగిన దిగుమతులు రష్యా నుంచి భారతదేశం చేసుకోవాలి. ఇప్పటికే తగినంత రష్యన్ వస్తువుల దిగుమతి భారతదేశంలోకి, జరగటంలేదని రష్యా అంటున్నది.

సర్ నార్మన్ కిప్పింగ్ సలహాని మరొక దానిని పరిశీలించాలి. ఆయన గ్రామీణ సంపద జోలికి ఏ పరిశ్రమా, ఆర్థిక సంస్థా పోలేదన్నారు. ఇంతదాకా, బ్రూక్ బాండ్ టీ, అగ్గిపెట్టెల తయారీదారులూ, సబ్బులూ, వార్తాపత్రికలు మాత్రమే గ్రామాలని చేరుకుంటున్నాయి. వ్యవసాయదారులని అర్థిస్తే ఇంకా ఎన్నో రకాల సరుకు గ్రామీణ ప్రాంతాలకి పంపించవచ్చు. 'డబ్బు' అనే మాటకి కల ప్రాముఖ్యత మారుతోంది. రయితులచేత ఎరువు ఫాక్టరీలలో వాటాలు కొనిపించవచ్చు. గ్రామాలలో ట్రాక్టర్లని మరమ్మత్తుచేసే సదుపాయాలు ఏర్పరచాలి — ఇది సర్ నార్మన్ సలహా సారాంశం.

బంగారుకి రెండు – ధరల ఏర్పాటు చేశారు. ఇది ఎంతకాలం నిలుస్తుంది? వెనుకబడిన దేశాలలోనే బంగారం అమ్మకం ఎక్కువ అని అందరికీ తెలుసు. బంగారాన్ని నియమితమయిన ధరకికొని స్వేచ్ఛగా అమ్ముకొనటం ఇక్కడ వీలవుతుందికదా! ఇలా కొంతకాలం జరిగితే ప్రభుత్వానికే బంగారం దొరకని పరిస్థితి ఏర్పడవచ్చు. అంతేకాక 'గోల్డ్ పూల్' అనబడేది తన బంగారం నిల్వలని ఎలా అధికం చేసుకుంటుంది? ప్రస్తుతం దక్షిణాఆఫ్రికా మాత్రమే బంగారం ఉత్పత్తి చేస్తోంది. ఔన్సుకి 35 డాలర్ల ధరకి అంగీకరించింది. ఎల్లకాలం అంగీకరిస్తుందా, అన్నది ప్రశ్న.

భారతదేశానికి సంబంధించినంతదాకా 'రెండు ధరల' పద్ధతి దొంగబంగారం రవాణాని అరికట్టవచ్చు. కాని, ప్రమాదం కూడా ఉంది. వియత్నాం, ఎన్నికల సంవత్సరం కాబట్టి కొంత ఆర్థిక ఇబ్బందిలో ఉన్న అమెరికా విదేశ సహాయం పథకాలనీ తగ్గించుకొనవచ్చు, దిగుమతులను తగ్గించుకోవచ్చు జపాన్ అప్పుడే అమెరికాలోకి దిగుమతి అయ్యేవాటిమీద పడిన సుంకాలపట్ల అసంతృప్తి ప్రకటించింది.

చివరిమాట — ఆర్థిక మాంద్యాన్ని తగ్గించాలని చూస్తూనే మన ప్రభుత్వం ఉక్కు గొట్టాల మీద సుంకం విధించింది. ఇక పయిన ఉక్కు ఫర్నిచర్ ధరలు పెరిగి అమ్మకాలు తగ్గవచ్చు. ఒకపయిపు రష్యా మన ఆర్థిక మాంద్యాన్ని తగ్గించాలని చూస్తూ ఉంటే మన ఆర్థిక మంత్రి బండిని వెనక్కు తోస్తున్నారన్నమాట!

ఉక్కు సామాను విరివిగా కొంటే కలప అమ్మకం తగ్గి, ఆ కారణంగా మన అడవుల నాశనం తగ్గవచ్చు. నేటి ధోరణి చూస్తే భారతదేశం త్వరలో దుమ్ము దేశంగా మారిపోవచ్చు, అడవుల నష్టం ద్వారా. ●



క్షేమేంద్రుని బృహత్కథామంజరి కథలు

ఉదయన జననోదంతం

అనువాదం: తిరుమల రామచంద్ర

కౌశాంబి అనే నగరం వుంది. అది శుభకరుడైన శివుని పురితో పోటీ పడుతూవుంటుంది. శివునిపురి త్రిపురాలను జయిస్తే, అది ప్రపంచంలోని పురాలనే జయించింది. అక్కడి మహా సౌధాలు ఇంద్రనీల మణులతో నిర్మించబడ్డవి. ఆకాశాన్ని అంటుతున్న ఆ సౌధాల నల్లనికాంతులు తీగలలాగా పైకి ప్రాకి చాందినీవలె అల్లుకోగా, — రాత్రులలో నక్షత్రాలు పూవులనే భ్రాంతికలిగిస్తుంటాయి.

ఆ పట్టణాన్ని శతానీకుడనే రాజా ఏలేవాడు. అతడు అర్జునుని వంశం వాడయిన జనమేజయుని కుమారుడు, రాజేంద్రశేఖరుడు. అతడు చందనం అలదిన భుజంతో గంగానదితో ఉజ్జ్వలమైన భూమిని వహించాడు. చందనం అలదిన వక్షంతో గంగాధారవలె తెల్లని ముత్యాల పేరును ధరించాడు. అతనికీర్తి అతని సంపదవలె, అతని సంపద అతనికీర్తివలె కన్నులపండువుగా వుండేవి. ఒకటేమో సంపూర్ణ చంద్రునిలాగ, ముత్యాల రాశిలాగా, మరొకటి సంపూర్ణ చంద్రునితో (బంగారుతో), ముత్యాలరాశితో మనస్సును దూరగానేవి. అలాగే అతనిశ్వేతచ్ఛత్రమూ తెల్లని యశస్సుతోను, అతని యశస్సు ఛత్రంతోను స్పర్ధించేవి. అతనిచేతి

కరవాలం లక్ష్మీకరమైనది. వసంతుడు తాకగానే చెట్లన్నీ చిగిర్చి, మొగ్గదొడిగి అశోకాలలాగా ఎర్రవారినట్టు, ఆ కరవాలం తాకగానే శత్రువులు ఎరుపెక్కి శోక రహితులు అయ్యేవారు.

అతని మంత్రి పేరు యుగంధరుడు. అతడు ఇంద్రునికి బృహస్పతి లాంటివాడు. అతడు శతానీకుని రాజ్యానికి కర్ణధారుడు. మహామతిమంతుడు. అతని సేనాపతి సుప్రతీకుడు. వల్లభుడనేవాడు శాస్త్రార్థ వేది; మహారాజుకు నర్మసచివుడుగా వుంటూ స్వేచ్ఛగా మాటలతో సంతోషపెడుతూ ఇష్టుడుగా వుండేవాడు.

శతానీకుని భార్య విష్ణుమతి, ఆమె విష్ణువుకు లక్ష్మిలాగ రాజుకు ప్రియురాలు. ఆమె మహాసుందరి, ప్రపంచ విజయానికి తలపెట్టిన మన్మథుని విజయాస్త్రం లాగ వుండేది.

శతానీకుడు ఒకమారు వేటకోసం అడవికి వెళ్ళాడు. అడవిలో తిరుగుతూ, శాండిల్య మహాముని ఆశ్రమం చేరాడు. ఆ ఆశ్రమంలో తేజోరాశి అయిన శాండిల్యమునిని దర్శించాడు. రాజు తన పేరు, వంశం తెలుపుకొంటూ మునికి నమస్కరించాడు. ఆ ముని చాల ప్రీతుడై ఏమి కోరుకుంటావో కోరుకోమన్నాడు. 'తమరు మా నగరానికి దయచేసి పుత్రకామేష్టియాగం చేయించి, నాకు పుత్రభిక్ష పెట్టవలె,' అని కోరుకున్నాడు రాజు. శాండిల్యుడు దానికి ఒప్పుకొని, ఆదరంతో కౌశాంబికి వచ్చి, యాజకుడై రాజుచేత పుత్రకామేష్టి చేయించాడు.

శాండిల్యముని ప్రసాదం వల్ల శతానీకునికి దశరథునికి రామునిలాగ సహస్రానీకుడు జనించాడు. కుమారుడు పెరిగి పెద్దవాడైనాడు. యౌవనం నిండారి, పూర్ణచంద్రునిలాగ కళాపూర్ణుడయి, చిరునవ్వుల అమృతం కురిపించే అతనినిచూచి తండ్రి సముద్రునిలాగ పొంగిపోయాడు, శతానీకుడు. తన కుమారుడు యుక్తవయస్సు వచ్చినవాడని గ్రహించి అతనిని యథావిధిగా యువరాజును చేశాడు. అది అమృత కిరణునికి మరొక పీయూష ప్రతిబింబం ఏర్పడే వట్లయింది.

శతానీకుని మంత్రికి సేనాపతికి, నర్మసఖునికి కూడా పుత్రులు ఉదయించారు. యుగంధరుని కుమారునిపేరు యౌగంధరాయణుడు. సుప్రతీకుని తనయుడు రుమణ్వంతుడు, నర్మసచివుని పుత్రుడు వసంతుడు.

ఇలా వుండగా స్వర్గలోకంలో ఒకమారు మహా సంక్షోభం ఏర్పడింది. యమదంష్ట్రుడనే మహాసురుడు పోతరించి తన తమ్ముడైన స్తబ్ధశిరుడనే వాడితో పాటు స్వర్గంపై దండెత్తి వచ్చాడు. సురులకు అసురలకు ఘోరమైన యుద్ధం జరిగింది. స్వర్గాధిపతి అయిన ఇంద్రుడు ఏమీతోచక, కౌశాంబికి మాతలిని పంపి, శతానీకుని సహాయంగా రమ్మనికోరాడు. శతానీకుడు ధనుర్ధారియై స్వర్గానికి వెళ్ళి రణరంగంలో ఇంద్రునికి బాసటగానిలిచి, పోరాడి, పలువురురాక్షసులను హతమార్చాడు. అతని పరాక్రమానికి దేవతలు అనిమిషులై చూస్తూవుండిపోయారు. చివరకు శతానీకుడు దైత్యరాజయినయమదంష్ట్రునికూడా పడవేశాడు; కాని, అతడు మరణించాడు. మృత్యువన్నది లేని అమరలోకంలో తాను మరణించడం అనేది విడ్డూరం. యుద్ధసమయంలో ఆకాశంలోని మేఘాలలో తళతళమెరుస్తూ కనిపించే అతని కరవాలానికి ఎరలయిన ఏనుగుల కుంభస్థలాలు పగిలి వెలువడిన ముత్యాలను చూడగా, ఆ విడ్డూరానికి అయన నవ్వినట్టు తోచింది.

ఇంద్రుని ఆజ్ఞపై మాతలి శతానీకుని దేహాన్ని కౌశాంబికి తీసుకొనివెళ్ళి అప్పగించాడు. శతానీకుని కుమారుడు సహస్రానీకుడు, మరణించిన తన తండ్రికి చేయవలసిన విధులు చేశాడు. మహారాణి విష్ణుమతి శతానీకునితోపాటు సహగమనం చేసి, కీర్తిశేషురాలయింది. మంత్రుల మాటతో సహస్రానీకుడు రాజ్యభారం వహించాడు.

కొంతకాలం జరిగింది. ఇంద్రు డొకమారు నందనవనంలో ఉత్సవం జరిపాడు. ఆ ఉత్సవానికి సహస్రానీకునికూడ ఆహ్వానించాడు. ఆ సమయంలో ఇంద్రుడు సహస్రానీకునికి అతని పూర్వజన్మగాథ, భావి కథ తెలిపాడు: 'రాజా, నీవు విధూముడనే వసువువు. ఒకమారు నీవు బ్రహ్మను దర్శించడానికి బ్రహ్మలోకానికి వెళ్ళావు. అక్కడికి అలంబుష అనే స్వర్గలోక లలన వచ్చింది. అప్పుడు గాలికి ఆమె చెరగు కొంచెం తొలగింది. నీ మనస్సు వికారం పొందింది. ఆమెను నీ రూపలావణ్యాదులు లోగొన్నవి. మీ యిద్దరి వికారాలు బ్రహ్మ దృష్టిలో పడ్డాయి. ఆయన కోపించి మీరిద్దరూ మనుష్యలోకంలో పుట్టి భార్యాభర్తలు కండని శపించాడు. ఆ శాపంవల్ల అలంబుష అయోధ్యాధిపతి అయిన కృతవర్మకు పుత్రికగా జన్మించింది. ఆమె పేరు మృగావతి. నీవు శతానీకుని కుమారుడుగా పుట్టావు. నీకు మృగావతి త్వరలో భార్య అవుతుంది.'

సహస్రానీకునికి ఇంద్రుని మాటలు చాల ఉత్సుకత కలిగించాయి. అతనివద్దనుంచి సెలవు తీసుకుని సంతోషంతో, మృగావతినే మనస్సులో మననం చేసుకుంటూ రథమెక్కి కౌశాంబికి బయలుదేరాడు. అతనిని భూలోకం చేర్చడానికి మాతలి వెంట వెళ్ళాడు. దారిలో శతానీకునికి తిలోత్తమ అనే అప్సరస ఎదురయింది. ఆమె అతని సౌందర్యానికి ముగ్ధురాలై అతనితో సంభాషిద్దామని ఏదో మాట్లాడబోయింది. కాని, సహస్రానీకునికి సహపాఠుని మాటలే మనస్సులో మెదలుతున్నాయి గనుక తిలోత్తమ మాటలు వినిపించలేదు; అతని చూపులు ఆమెపై పడలేదు. రాజు అనాదరానికి తిలోత్తమ కుపితురాలయింది. తను దేవలోక లలన. మానవమాత్రుడు తనను అలక్ష్యం చేయడమా? సౌభాగ్యమత్తలయిన మానినులు, అవధీరణను సహించరు. ఆమె సహస్రానీకుని శపించింది:— 'రాజా, ప్రపంచమే తెలియనంతగా నీ హృదయంలో ఎవతె తిష్టవేసిందో, దానితో నీకు పద్నాలుగు ఏళ్ళు వియోగం సంభవించని!' అని శపించింది. ఆ శాపవచనాలుకూడా రాజు చెవిని పడలేదు. మృగావతీమనస్కుడుగానే

కొత్త శీర్షిక ప్రారంభం

...బృహత్కథా మంజరి

కౌశాంబి చేరాడు.

కొంత కాలానికి సహస్రానీకునికి, మృగావతికి వివాహమహోత్సవం జరిగింది. కృతవర్మ మహా వైభవంతో తన కుమార్తెను సహస్రానీకునికిచ్చి పరిణయోత్సవం చేశాడు పుష్పధన్వుని సర్వస్వము, విలాస తరువల్లరి, విభ్రమాంభోధి లహరి వంటి మృగావతిని అర్ధాంగిగా పడసి రాజు చాల సంతోషించాడు వారిద్దరూ భవానీ ఇందుశేఖరులవలె జనానికి ఆనందం కలిగించారు

కొంత కాలానికి ఆమె గర్భిణి అయింది ఆమె సుకుమార శరీరలత తెల్లనై అమృత క్షాళితమైన చంద్రరేఖలాగ అందం పొందింది దౌహృద లక్షణాలు వ్యక్తమైన ఆ సుందరి అయిన రాజమహిషి చంద్రోదయానికి ముందు, పాండురారుణకాంతితో ప్రకాశించే పూర్వదిక్కులాగ కనిపించింది మహారాజు ఆమెకు వేవిళ్లలో కోరినవన్నీ సమకూరుస్తుండగా, ఆమెకొక వింత కోరిక కలిగింది, ఎర్రని నీటిలో స్నానం చేయాలని. రాజు ఆమె కోరికను తీర్చడానికి, తన క్రీడాసరస్సును, కుంకుమపూవు, కుసుమపూవులు మొదలయిన వానితో రక్త జలమయంగా మార్చాడు ఆమె, ఆ సరస్సులో జలకమాడింది. స్నానం చేసేటప్పుడు కుసుమపూవులు ఆమె పచ్చని శరీరానికి అంటుకొని, విచిత్రమైన కాంతిని కలిగించాయి రాజు ఆమె జలక్రీడలు సురక్షితంగా జరుగడానికి కట్టుదిట్టాలు చేశాడు.

మానవుడు ఎంత బుద్ధిబలగల వాడయితే నేమి? దైవం పరాఙ్ముఖమైనప్పుడు అతని తెలివితేటలేమీ పారవు. రక్తజలసరోవరంలో జలక్రీడ చేస్తున్న మృగావతిని మాంసంముద్ద అనుకొని దగ్గర విధివశాన గరుత్మంతుని వంశంవాడైన ఒక మహా పక్షిరాజు ఎత్తుకొనిపోయాడు. పర్వతాకారుడైన ఆ పక్షిరాజును చూడగానే, ఆమె మూర్ఛపోయింది. ఆ స్థితిలో ఆమెను ఆ పక్షి చాలదూరం తీసుకొనిపోయి ఉదయాచల గుహలో పడవేసింది. తిందామని చూడగా, ప్రాణాలున్న మనిషిగా కనిపించిందేమో, ఆమెను వదలిపెట్టి ఎక్కడికో రెక్కలల్లార్చుకుంటూ ఎగిరిపోయింది.

మృగావతికి కొంత సేపటికి తెలివి వచ్చింది పరిసరాలు పరికించింది రక్తజల సరోవరం, కౌశంబీనగరం కానరాలేదు. ఎక్కడో మిన్నులు పడ్డచోట వున్నట్లు తెలుసుకొన్నది. భయంతో దేహవల్లరి కంపించిపోయింది కలువరేకులవంటి కనులతో దిక్కులు చూడగానే, దిక్కులన్నీ కలువరేకులు వెదజల్లినట్లయింది. శోకంతో పయోధరాలు ఎగిరిపడుతున్నాయి. కన్నులనుంచి ధారగా కురుస్తున్న కన్నీరు దారంలేని ముత్యాలదండలాగ పాలిండ్లపై పడుతూంది. 'అయ్యో, మహారాజా, నేను ఎంత పుణ్యంలేనిదానిని! నీ ముఖం ఇక ఎక్కడ చూడగలను?' అని విలపిస్తూ ఆమె అక్కడినుంచి బయలుదేరుతూ చావ గోరుతూ ఏనుగుల ముందుకు, సింహాల ముందుకు పోసాగింది. కాని, ఆమెను ఏనుగులు, సింహాలు చూడనైనా చూడకుండా తొలగిపోయాయి. ఆపదలు ముంచుకొని వచ్చి, సంకటస్థితి ఏర్పడినప్పుడు చావు ఎక్కడ వస్తుంది? ఎందుకు వస్తుంది? ఆమె దీనంగా ఏడుస్తూ దిక్కుతెలియక అడవిలో తిరిగింది ఆ కరుణాక్రందనం విని జింకలు నెమరువేయడంకూడా మాని, నిలబడిపోయాయి.

అది జమదగ్ని ఆశ్రమ సమీపం. ఒక మునికుమారుడు సమిధలకోసం కాకతాళీయంగా అక్కడికి వచ్చాడు. ఆమెనుచూచి అతనికి మనస్సు కరిగింది. ఆమెను జమదగ్ని ఆశ్రమం చేర్చాడు. జమదగ్ని ముని ఆమెను ఊరడించి, తన కుమార్తెవలె చూచుకుంటూ, ఆమె నిండు నెలలు కావడంవల్ల ఆమెకు తగిన సేవలన్నీ చేయించాడు. మృగావతి సకాలానికి పార్వతిదేవి కుమారస్వామిని ప్రసవించినట్లు మహాతేజస్వి అయిన కుమారుని ప్రసవించింది ఆ సమయంలో 'ఇతడు మహా కీర్తిమంతుడు. తన వంశానికి శశాంకుని వంటివాడు చక్రవర్తి అవుతాడు ఇతని పేరు ఉదయనుడు అని పెట్టండి' అని ఆకాశంనుంచి దివ్యవాణి వినిపించింది. ఆవిధంగానే అతనికి జమదగ్ని ముని ఉదయనుడు అని నామకరణం చేశాడు. కాలానుసారం కులానుసారం చౌలోపనయనాదులు కూడ నిర్వర్తించాడు.

ఉదయనకుమారుడు బాలచంద్రుడివలె,

తన తల్లి మహారథాలతో పాటు పెరిగాడు. సకలవిద్యలు, సకల కళలు నేర్చాడు. యువకుడై సకల నయనానందనుడు అయ్యాడు మృగావతి అతనికి సహస్రానీక నామాంకితమైన మణికంకణం తొడిగి, మరికొన్ని నగలువేసి ఆనందించేది.

కౌశాంబీ నగరంలో సహస్రానీకుని శోకానికి మేరలేదు దైవం అంతగా తనపై ఎందుకు ఆగ్రహించాడో తెలియక చాల దుఃఖించాడు. మంత్రి, సేనాపతి, ధర్మసచివులు ఊరట కలిగించగా ఊరడిల్లి మంచి సమయంకోసం ప్రియాసమాగమం కోసం నిరీక్షిస్తూ, దైవంచేతి కీలుబొమ్మ వలె కాలం గడుపుతూ వున్నాడు.

ఇక్కడ జమదగ్న్యాశ్రమంలో వున్న ఉదయన కుమారుడు ఒకనాడు వేటకోసం అడవికి పోయాడు. అక్కడ ఒక వ్యాధుడు పామును పట్టుకోడం చూచాడు ఉదయనుడు. అతనిచేతిలో చిక్కుకున్న పాము గిలగిల కొట్టుకొంటూ తనను తప్పించమన్నట్టు ఉదయనుని వైపు దీనంగా చూచింది. ఉదయనుడు ఆ వ్యాధుణ్నిచూచి, దానిని వదిలి పెట్టమని కోరాడు. ఆ వ్యాధుడు, 'తాపస కుమారా! ఇది నా వృత్తి నేను పామును పట్టుకొని, అమ్మి, ఆడించి జీవించే వాడిని దీనిని వదలి పెడితే నా జీవిక ఏమిటి?'అని అన్నాడు. రాజకుమారుడు 'అహితుండికుడా, నీకు కావలసింది ధనం కదా! ఇదిగో నా మణికంకణం తీసుకో ఎక్కడయినా దీనిని అమ్ము. నీకు జీవితమంతా పాములు పట్టుకుని, అవి కాటువేస్తే, మణి మంత్రౌషధాలు వాడి ఆపదలు నివారించుకొని పాటుపడే పని వుండదు' అంటూ తనచేతి మణికంకణం అతనికి దానం చేశాడు. వ్యాధుడు సంతోషించి, ఆపామును వదలి పెట్టి వెళ్లిపోయాడు.

వ్యాధ విముక్తమయిన ఆ పాము సాధారణమైన పాముకాదు, శాపగ్రస్తమైన నాగ కుమారుడు ఉదయనుని కరస్పర్శతో దానికి శాపం విముక్తమైంది వెంటనే నాగ కుమార రూపం ధరించి, అతనికి అంజలి ఘటించి 'రాజకుమారా నీవలన శాపమోక్షం పొందాను నీకు నేను సదా సర్వకాలం మిత్రుణ్ని నేను నాగకుమారుణ్ని. పేరు కిన్నరుడు నా తండ్రి ధృతరాష్ట్రుడనే నాగరాజు నా నివాసం పాతాళలోకం. నాతో పాటు మాదేశానికివచ్చి నా ఆతిథ్యం స్వీకరించు' అని కోరాడు

ఉదయనునికి నూతనలోకాలు చూడాలనే కుతూహలం ఇనుమడించి, అతనిమాటకు అంగీకరించి, అతనితోపాటు పాతాళలోకానికి వెళ్లాడు. కిన్నరనాగుడు ఉదయనునికి ప్రేమ వినయాలతో సత్కారం చేశాడు అతనికొక సోదరి ఉంది, లలిత అనే పేరు గలది. ఆమె మహా సౌందర్యవతి. ఆమె ముఖచంద్రుని వెన్నెలలకు పాతాళం పట్టపగలయ్యేది ఆ కన్యను కిన్నరుడు ఉదయనునికిచ్చి వివాహం చేశాడు. ఆమె కూడా శాపగ్రస్త అయిన విద్యాధరి. ఉదయనుని చెట్టపట్టగానే, తనశాపం తీరి విద్యాధరత్వం పొందింది. ఆమె ఉదయనునికి కృతజ్ఞత తెలిపి, సెలవు పుచ్చుకొని, విద్యాధర లోకానికి వెళ్లిపోయింది.

ఉదయన కుమారుడు ఈ అద్భుతాలకు ఆనందాశ్చర్యాలు పొందుతూ పాతాళలోకంలో కొన్నాళ్ళు గడిపాడు. కిన్నర నాగుడు ఉదయనునికి, ఎన్నడూ వాడని తాంబూలీ మాలను, ఘోషవతి అనే వీణను కానుకలుగా సమర్పించాడు అతడు వాటిని స్వీకరించి జమదగ్ని మున్యాశ్రమం చేరాడు పుత్రుని జాడలు తెలియక వగస్తూ కృశించి పోయిన తల్లికి, ఆమెను సమాధాన పరుస్తున్న మునికి ఆనందం కలిగించాడు

ఉదయనునినుంచి రత్నకంకణం తీసుకున్న వ్యాధుడు దానిని విక్రయించడానికి కౌశాంబీనగరం చేరి ఒక వైశ్యుని ఇంటికి వెళ్లి అమ్మజూపాడు. వైశ్యుడు రత్న ఖచిత కంకణం చూచి మొదట్లో నేమో ఆశ్చర్యపడ్డాడు. కాని, దానిపైవున్న సహస్రానీక మహారాజు పేరుచూచి భయపడిపోయాడు అది కొంటే తనకేమి మువ్వు వస్తుందో అని ఆ వ్యాధునితోపాటే రాజాస్థానానికి వెళ్ళి వృత్తాంతమంతా నివేదించాడు.

మృగావతి వియోగాగ్నితో కాలిపోతున్న సహస్రానీకుడు మృగావతి బాహువల్లరీ సంబంధ సుధతో ఆర్ద్రమైన ఆ రత్న కంకణాన్ని చూచి, దానిని తాకి ఆమెను స్వయంగా పరిష్వంగం చేసుకున్నంత గాఢ, నవాంబుదాన్ని చూచిన నీలకంఠం వలెను సంతోషించాడు. ఏమీ అనక, వారికి బహుమానా లిచ్చి వణిక్కును పంపివేసి, ఆ వలయం ఎలా వచ్చిందని వ్యాధుణ్ని ప్రశ్నించాడు వ్యాధుడు పూసగుచ్చినట్టు వలయ ప్రాప్త్యదంతాన్ని వివరించాడు రాజా చాల ఆనందించి, 'ఆ ప్రాంతం చూపుతావా మాకు ?!'అని ప్రశ్నించాడు. వ్యాధుడు సరే నన్నాడు.

పిదప సహస్రానీకుడు వ్యాధుడు ముందు దారిచూపగా, మంత్రులు, సామంతులు మొదలయిన పరివారమంతా వెంటరాగా, వ్యాధునివెంట ఇందు భాస్కరులు ఏ దిక్కులో ఉదయిస్తారో ఆ దిక్కువైపు బయలదేరాడు ఆయన వెళ్తుంటే, పరివారంలోని ఏనుగుల గండస్థలాలకు అలదిన సిందూరంతో దిక్కులు సంధ్యారుణాలయినట్టు కనిపించింది. ఇలా కొంత దూరం వెళ్లిన తర్వాత రాజా తను ఒకచోట విడిసి, సైన్యాన్ని విశ్రాంతి తీసుకోమని ఆజ్ఞాపించాడు.

చీకటిపడింది. సహస్రానీకుడు భోజనాదులు నిర్వర్తించిన తర్వాత శయనపట కుటీరానికి వెళ్లాడు. కాని, నిద్ర పట్టలేదు. మృగావతే అతని మనస్సులో నిండింది. దయిత సమాగమం ఎప్పుడెప్పుడా అని ధ్యాన తత్పరుడయ్యాడు. అప్పుడు ఆస్థాన కథకుడు, సంగమకుడు అనేవాడు రాజుకు మహా వినోదం కలిగించి, చింతను పోగొట్టే తలంపుతో ఒక కథ చెప్పాడు.

(సశేషం)



ఇంటిలో నిప్పేరు...

[?]బాద్ పాతబస్తీలో ఖమ్మంపేట్లో అనే ఓ భార్యాపిల్లలను కొట్టి, ఆ యింటికి నిప్పంటించిన నేరానికి ఐదుగుర్ని అరెస్టు చేశారు. రామచంద్రన్ అనే అతనికి, అతని తండ్రికి వచ్చిన తగవు ఫలితంగా ఆ తండ్రి గారు మిత్రా పిల్లల్ని రామచంద్రన్ మీద (17 వ తేదీ) వుసికొల్పాడట వారు రామచంద్రన్ని, అతని భార్యను కొట్టి, వారి మీద సామానులన్నీ వేసి, దానికి నిప్పంటించారట

* * *

"నా భార్య ప్రవర్తన సరిగా లేదు నాకు జీవితేచ్ఛ లేదు. క్షమించండి" అని రాసిన చీటి జేబులో పెట్టుకుని విషం (నల్లుల మందట) త్రాగి, రాయపేట ప్రాంతంలో నడి రోడ్డుమీద ఒక వ్యక్తి పడిపోయాడట ఆసుపత్రిలో చేర్పించాక కాస్సేపటికి అతను చనిపోయాడట— మనో దౌర్బల్యం ఎంతకైనా దారి తీస్తుంది.



ట్రాక్టరుమీద దాడి!

తిరువెళ్లి (కేరళ) సమీపంలో ట్రాక్టరుతో పొలం దున్నుతుంటున్న ఒక ఆసామీ మీదకు కొందరు లంఘించి, ట్రాక్టరును సర్వనాశనం చేసి, అతన్ని చావదన్ని (చావతన్ని) పారిపోయారట. "వ్యవసాయాన్ని యంత్రాంగం చేయడానికి వీరు వ్యతిరేకులట—" అనగా రైతు కమ్యూనిస్టులని తెల్పారు ఇంకా అరెస్టు ప్రారంభం కాలేదు

* * *

కొట్టాయంలో (మార్చి 21 న) కొట్లాట జరిగింది రెండు వర్గాల వారికి వచ్చిన ఘర్షణ కొట్లాటగా మారిన ఫలితంగా ఒక వ్యక్తి అమానుషంగా చంపబడ్డాడట చాలా మంది గాయాలయ్యాయంటా యని వేరె చెప్పక్కరలేదు ఈ కొట్లాటకు రాజకీయాలే కారణమట!

చేపల తగవు...

అయ్యంపేట వద్ద పేరమాపట్నాన్ అనే చోట ఓ నాయకుని గుడికి చెందిన చెరువులో చేపలు పడుతున్న యిద్దర్ని మరో యిద్దరు అభ్యంతరపెట్టారట, ఆ పోట్లాట పెరిగి కర్రలతోనూ కొడవళ్లతోనూ సమాధానాలు చెప్పుకున్నారు ఈ సంఘర్షణలో ఇద్దరు దారుణంగా చనిపోవడం, ఎనిమండుగురు గాయపడటం జరిగింది.

* * *

నాగోలి రైల్వే స్టేషను ప్రాంతంలో ఒక స్త్రీ శవం దొరికిందట. శవం కుళ్ళిపోయి వుండటాన, కళేబరంలో చాలా భాగాలు లేవనీ, అవన్నీ దుమ్ములపక్షుల వల్ల కొరికాయని తేలింది అయితే ఆ స్త్రీ ఎవరో అన్నవిషయం కూడా యింకా తేల్లేదు

ఆత్మహత్యలు


యునైటెడ్ స్టేట్స్‌లో ప్రతి ఇరవై నిముషాలకు ఒకసారి ఒక ఆత్మహత్యయినా జరుగుతోందనీ, ఈ ఆత్మహత్యల్లో మూడు వంతులు ఆదాయం సన్నగిల్లి భరించలేనివారివేననీ—మార్చి 15 నుంచి ఏప్రిల్ 15 వరకూ ప్రతియేడాయీ ఆత్మహత్యలు ముమ్మరంగా జరుగుతున్నాయని



నిఘంటు శాఖ తెలియజేసింది 1965 సంవత్సరంలో 21,507 ఆత్మహత్యలని, అప్పటినుంచీ యీ సంఖ్య దినదినాభివృద్ధి చెందుతోందని తెలియ వచ్చింది.

దారుణ హత్య

ఫిబ్రవరి 24 న జరిగిన దమనాతి దారుణమైన ఓ సంఘటనకు రాజ్యసభలో మొన్న బట్టబయలుదేరింది కృష్ణా జిల్లాలో కంచికచర్ల అనే గ్రామంలో హరిజన బాలుడు దొంగతనం చేశాడని, అతన్ని యథాశక్తి తన్ని ఒక గుంజకు కట్టి, నిప్పు అంటించారట— ఆ వూరి ప్రజలు ఈ హరిజన బాలుడు ఇత్తడి పాత్రలు ఎత్తుకుపోయి, ఒక హోటల్లో అమ్మాడట పాత్రలు దొరికాయి కాని అతని ప్రాణం మాత్రం దక్కలేదు. కాలిపోతున్న ఆ బాలుడు దగ్గరలో వున్న పోలీసు స్టేషనుకు వెళ్ళి, రిపోర్టు యిచ్చాడట పోలీసులు అతన్ని నందిగామ ఆసుపత్రిలో చేర్చాక అక్కడ చనిపోయాడట. ఈ విషయం రాజ్యసభలో సవిస్తరంగా చర్చించి, అమానుషమనీ, దారుణమనీ తేల్చారు — ఈనెపద్ధతిగా దారుణమేనా!



ధాష్టం!!

నాన్సీ (ఫ్రాన్స్)లో ఒకగజదొంగ ఆక్సిఎసిటలేను గ్యాసుతో పచ్చివెడి ఇనపపెట్టె నొకదాన్ని తెరిస్తే అందులో 150 ప్రేలుడు సామానులు, 1800 ఫ్రాంకులు (2700 రూపాయలు) వున్నాయట అంతశ్రమకు అదేనా ఫలితం—పూర్ క్రేజర్!

*　*　*

చాలుంతస్థుల భవనాలో రెండువస్త్రే పాకల వారికందరికి ఆభవనాలు యివ్వ సంకల్పించి నట్లు మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ అన్నాదురై అన్నారు అనగా మద్రాసులో ఒక అయిదేళ్ళకాలంలో వీలైనంతవరకు పాక నివాసు లందరికి భవనవాసం కల్పించుతామని హామీ యిచ్చారు— ఆశయం మంచిదే!

ఉప్పూ కారం తినేవారు..

31 లక్షలు ఖరీదు చేసే వూరగాయలు (ఆవకాయ వగైరా) మనదేశంనుంచి ఇంగ్లండ్ పొయి నేడు కొనుక్కుందట పనసచ్చాళ్ళా, వూరగాయలు అంటేవిదేశాలు పడి చస్తున్నాయట కువైట్ 26 లక్షల ఖరీదుచేసే సామగ్రి, నెదర్లాండ్స్ 9 లక్షలు, బ్రిటన్ 5 లక్షలు ఖరీదు చేసేసామగ్రి కొంటోందట ఇండియా బిస్కట్లు, వెన్న అంటే నేపాల్లో నెత్తిన పెట్టుకుంటారట (అంతేఇష్టంగా తింటారని భావం) రష్యా మన ఇన్ స్టంట్ కాఫీ (నెస్కేఫ్ వంటి) తెగ కొంటుందని పిస్తుంది



మంటు స్టోరులో ఈ కఫీ రెండులక్షల ఏడు చేసేసరుకు వుందని లెక్కతేలింది—మరిమనకా!! పొరుగింటి పుల్లకూర రుచి అని సామెత ప్రతిదానికి చెల్లుతుందిగా!

—శంభాషణ

రంగులరాట్నం.



డింగో

ఆస్ట్రేలియా ఖండం గ్రుడ్లు పెట్టే స్తన్య జీవులకు, సంచులుండే స్తన్య జీవులకు ప్రసిద్ధి. ఇక్కడ సామర్థ్యాలు ఎక్కువగా ఉన్న స్తన్యజీవులు (ప్లాసంటేలియా) అక్కడ లేకపోవడం వల్ల, సంచుల స్తన్యజీవులే ఎంతో వైవిధ్యం పొందాయి మన ఖండాల్లో నున్నవాటితో సరి సమానం కాకపోయినా, అలాటి ఆకారాన్నే కొన్ని పొందాయి. ఉదాహరణగా కొన్ని అనుకరించిన ఆకారాలు, ఎలుగుబంటి, ఉడత, పంది కొక్కు, తోడేలు, పిల్లి, ఎలుక, ఇంకా అలాగే చీమలహారి, మోల్ మొదలైనవి. వీటికీ, అవే పేర్లు కల మనవాటికీ సంబంధం లేదని గ్రహించాలి.

అయితే వీటికి తోడుగా కొన్ని ఎలుకలు, గబ్బిలాలు, ఒక కుక్క కూడా ఉన్నాయి, ఇవి మాత్రం మన ఖండాల్లోలాటి స్తన్యజీవులే ఇక్కడి కుక్కను డింగో అంటారు. వన్యమృగాలు కుక్కే. అయితే పిల్లగా మనం పెంచినా, పెద్దయితే మాత్రం దీన్ని నమ్మలేం. ఏదయినా చేస్తుంది, మన పశువుల్ని. మొదట్లో, ఏవేవో జంతువులతో సర్దిపెట్టుకొన్నా, ఇప్పుడు గొర్రెల మీద కూడ పడుతోంది. సాధారణంగా డింగో కుక్కలు రెండేసి కలసి వేటాడతాయి. వాసనబట్టి జంతువు ఎక్కడుందో పసికడతాయి. ఈ కుక్కతోక కుచ్చుగా ఉంటుంది. చెవులు కోసుగా ఉంటాయి. జూలు ఎక్కువగా ఒత్తుగా ఉంటుంది.

—జమ్మి కోనేటిరావు

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

టి ఎమ్. జి. చెన్నూరు

మేడమ్! మీరు శ్రీమతి అయిన తరువాత రచనలు మొదలుపెట్టారా? లేక అంతకు ముందేనా?

నేను రచయిత్రి నని ఆరుద్రగారికి పరిచయం అయ్యాను సార్

ఎస్. ఎ. సలామ్, కలికిరి

ఫలించని ఆశలు ఆశయాలు ఎదలో దాచుకోనడం అసమర్థత అంటారు మీరేమంటారు?

ఎదలో దాచుకోవడం కాక లోకానికి కూయడం సమర్థత అంటారా ఏమిటి?

ఎమ్. డి ఇ, రాయవరం

మేము కథలు రాయడం ఇష్టం లేదా?

ఎవరికి?

ఎమ్. ఎస్ జి, రాయవరం

ప్రజలకు చైతన్యం కలిగించే రచనలు యిప్పటి కాలంలో వెలువడడం లేదని నా అభిప్రాయం మరి మీ అభిప్రాయం?

అలాంటివి చదువుదామనుకునేవాళ్ళకి అలాంటి రచనలు అడపా తడపా కనబడుతూనే ఉన్నాయి

బి ఎస్. ఆర్, హిందూపురం

ఉత్తములపై అకారణంగా నిందలు వేసే దుండగుల సేమనాలి

మీరే అంటున్నారుగా — దుండగులని!

ఎమ్. వి. ఆర్. బి, ఉరవకొండ

భర్త అంటే ఏమిటో తెలియని దశలో విధవైన స్త్రీ తిరిగి పెళ్లి చేసుకుంటే తప్పేమిటి?

వీరేశలింగంపంతులుగారి ధర్మమా అని వితంతు వివాహం ఏమంత సమస్య కాదీ రోజుల్లో నిరాఘాటంగా ఆమె తిరిగి వివాహం చేసుకోవచ్చు

సి కె. ఆర్, భవాని పాట్నా (ఒరిస్సా)

పురుషునికి మోక్షం పొందాలంటే కాంతా కనకాలు అడ్డం అని కదా? మరి స్త్రీకి ఏమిటి అడ్డం?

ఆమెకీ అలాంటివే ఏవో ఆటంకాలుంటాయి కాబోలు!

ఎం ఎం, కరీంనగరు

ఎన్నాళ్ళు మట్టిబొమ్మగా బ్రతకడం?

అటుకట్టేవరకు!

ఎ పి. కె, ధార్వా (మధ్యప్రదేశ్)

లోకంలో వానకి తడువనిది ఎండకు ఎండనిది ఏమిటో?

మానవుని వూహలు

జె ఎస్ కె, బరంపురం

ఆడవాళ్ళు జవాబిస్తేనే కోపగిస్తారు యింకా చూస్తే అలుగుతారు ఇక కొడితే ఊరుకుంటారా? ఎందుకలా వేస్తారు కార్టూనులు?

బహుశా తీరని కోరికల కవి రూపకల్పనలేమో సోదరీ

యస్. పి, జగిత్యాల

స్త్రీలందరూ చదువుకొని ఉద్యోగాలు చేయడం ప్రారంభించుతే ఇంట్లో వంట వార్పు ఏతేం కానండీ?

మీ కెందుకా బెంగ? పాపం గృహిణులైన ఉద్యోగినులు కష్టమో సుఖమో—రెండు పనులూ చేస్తూనే ఉన్నారు కదా!

జి ఎమ్. ఎల్, హైదరాబాదు

ఇరుగుపొరుగు వ్యాసంలో ఇరుగుపొరుగులతో ఉండే ఇబ్బందులు లవసరాలు, తక్కువ మాటల్లో చాలా చక్కగా చెప్పారు...

థ్యాంక్యూ!

పి డి డి పాండ (గోవా)

ఏ పుస్తకాలైనా ఆసక్తితో చదివే నాకు క్లాసు పుస్తకాలు తెరిచేసరికి నిద్ర ముంచుకొస్తుంది.

మీకే కాదు ఏ విద్యార్థికైనా అంతే బ్రదర్

పి ఏ. ఎస్. పి. హైదరాబాదు

ప్రశ్నలు కొందరు సినిమా పాటలలోని వాక్యాలు వేస్తున్నారు గమనించారా?

కొంపతీసి నా సమాధానాలకి వరసలుకట్టి పాడడం లేదుకదా!

కె వి ఎల్, పాలకొల్లు

ఎనిమిదివేలు యిస్తే చేసుకుంటాను. కాని పిల్ల నచ్చలేదు అన్నాడట పెళ్లికొడుకు అంటే ఎనిమిదివేలు ఉన్నంత వరకు ఏలుకుని తరవాత వదిలేస్తాడా?

డబ్బు అవసరానికి పెళ్లి చేసుకుందుకు సిద్ధపడే ప్రబుద్ధులు అది అయిపోతే వదిలేస్తారంటే మనం ఆశ్చర్యపడ్డం దేనికి సోదరీ

కె. డి ఎన్, నిజామాబాదు

ఇప్పుడు వచ్చే కార్టూనులలో ఎప్పుడూ ఆడవాళ్ళు మగవారిని అవమానిస్తున్నట్టు వేస్తారు ఇలా జరుగుతుందా?

వాస్తవాన్ని తారుమారుచేసి ఆనందిస్తున్నారంతే

కె. ఆర్ ఆర్, ఉరవకొండ

నే పెద్దయ్యాక మా ఊరు పూర్తిగా మార్చేస్తాను

బొత్తిగా వూర ఉత్సాహయంత సిద్ధాంతం తాటిచాయంత ఉంటే ఎలాగ ఛంపా!

బి. ఆర్, కొత్తగూడెం

పురుషుడు లేనిది స్త్రీ ఉండలేదా?

ఉం ఎవరన్నారు?

జి కె కె, మెడ్చల్

ఆడవాళ్లను మగవాళ్ళు నమ్మకూడదంటారు. మగవాళ్ళని నమ్మకూడదని ఆడవాళ్లంటారు. మరి ఎవరిని నమ్మకూడదో.

ఎవరి జాగ్రత్తలో వారుండడం కోసం అలా పైకి అంటారేగాని ఒకరి నొకరు నమ్ముతూనే ఉన్నారు

ఎస్. ఎన్. కె, చిట్వేలి

కథకు మానవజీవితానికి అంతం ఏది?

రెండింటికి 'సమాప్తం' అంటూ వస్తుంది. పరికించి చూస్తూ ఉండు తమ్ముడూ.

ఎల్. డి, సామర్లకోట

చాలా మంచివారుగా కన్పించారు. మరి ఆ మంచితనం అప్పుడే ఎలా పోయిందో అర్థం కావటంలేదు

ఆవు రంగు పాలలో తెలియదంటారు—అందుకే.

పి. డి ఆర్, ధవళేశ్వరం

నాకు పెద్దలు సంపాదించిన ఆస్తి మూడుతరాలకు సరిపడ ఉంది మరి నేనేం ఉద్యోగం చేయను చెప్పండి?

ఈరోజుల్లో మూడు తరాల ఆస్తి మూడు పూటలలో కర్చు పెట్టవచ్చు— ఏ సత్పుత్రులు పెద్దవాళ్ళు కానివ్వండి!!



జరిగిన కథ

వారిజ ఆ ఫ్లాటుకి కొత్తగా వచ్చింది. రామచంద్రని ఆకర్షించింది. అతనిని ఇంటికి ఆహ్వానించింది ఆమె వివరాలు సేకరిద్దామనుకున్న రామచంద్ర ప్రయత్నం ఫలించదు. వారిజ అతనిమీద అనురాగాన్ని ప్రకటించినా అర్థం చేసుకోలేకపోతాడు అతనికి తెలిసిందల్లా ఒకటి. ఆమె మెడలో నల్లపూసలున్నాయి ఆమెకి పెళ్ళయింది. తను దూరంగా వుందాం అని. అనుకోకుండా ఆమెకు దగ్గరవుతాడు. ఆమెతో పొలాలమధ్య తిరుగుతాడు నల్లపూసలు సరదాకి కట్టుకొన్నవని తెలిసినతర్వాత ఆమె గత చరిత్ర ఏమిటో అప్పుడే తెలుసుకోవాలనుకుంటాడు. పార్వతి సత్యన్నారాయణ దంపతులకి నాలుగో సంతానం వారిజ. ఆమె మాధవితో కలిసి మద్రాసు వెళ్తుంది. సినిమాతారగా విసిగిపోయి ఆ ఫ్లాటుకి వస్తుంది. పార్వతి అహంకారాన్ని సహించుదామని [illegible] కల్యాణి ఆమెమీద జాలిపడి తిరిగి వస్తుంది.

6

కొంచెం సేపట్లోనే లత కాఫీతయారు చేసి యిచ్చింది—కాఫీతాగి కల్యాణి పార్వతితో చెప్పి వెళ్ళిపోయింది—.

'ఎంతలో ఉంది ఆవిడ అహంకారం—ఇంకా అలాగే ఉందా?'

వడిలిపోయిన కల్యాణి ముఖం చూస్తూ అన్నాడు శంకరం నవ్వుతో—

కల్యాణి కళ్ళనిండా నీళ్ళు నిండాయి—

తెల్లబోయి చూసాడు శంకరం—

'ఏమిటి? ఆవిడ ఇప్పుడు కూడా నిన్ను అవమానించిందా?' కోపంగా అన్నాడు—

'లేదు — లేదు—' కంగారుగా అంది కల్యాణి—

'మరి. ఎందుగా కన్నీళ్ళు?'

'సాయంత్రం మీరు వెళ్తున్నారుగా! మీకే తెలుస్తుంది'—

వింతగా చూసాడు భార్య వంక శంకరం—

ఆ సాయంత్రం శంకరం సత్యన్నారాయణ గారింటికి వెళ్ళేసరికి సత్యన్నారాయణ భార్యతో గట్టిగా దెబ్బలాడు తున్నాడు—

'ఎలాగో చస్తాను—నన్నెవరూ బ్రతికించ లేరు — కాస్త బ్రాందీ ఇయ్యి — ఒక్కడోస్ చాలు—'

'వీల్లేదు—మీరు చస్తారు మహారాజులా! ఆ తరువాత మేం చావాలి బ్రతకలేక! మిమ్మల్ని చావ నివ్వను — మీరు బ్రతికి తీరాలి—ఈ క్షోభంతా మనం భరించి తీరాలి—'

ఏడుస్తూ అంటోంది పార్వతి—

శంకరాన్ని చూసి గబుక్కున లోపలికి వెళ్ళిపోయింది పార్వతి—

అస్థి పంజరంలా ముంచాన కతుక్కుపోయిన సత్యన్నారాయణను చూసి కళ్ళలో నీళ్ళు తిరిగాయి శంకరానికి—

'ఎవరూ — శంకరమా! రావోయ్‌రా! ఎన్నాళ్ళ కొచ్చావ్? ఇంకా నీకు గుర్తున్నా నన్నమాట!—'

'ఎంత మాటండీ!' వినయంగా అన్నాడు శంకరం—

'అండీ! ఇంకా నన్ను అండీ అంటు న్నావా? ఓ పార్వతీ విను—ఇంకా గొప్పవాణ్ని నేను—'

లోపలి నుంచి ఏ సమాధాన మూ రాలేదు—

'బాగున్నావటోయ్! ఎలా ఉంది ఉద్యోగం? నా దగ్గర్నుంచి వెళ్ళిపోవటం మంచిదని చేసావులే! మన్వాళ్ళం దగ్గర్నుంచి నాకు మరీ కసి పట్టుకుంది—ఆ! పిల్లలున్నారా? ఆరోగ్యం బాగుందా? తెలుస్తోందిలే! నన్ను చూసావా? బ్రతక లేను—చావ నివ్వరు—హాయిగా ఇంకో నాలుగు రోజులు కరువుతీరా తాగావంటే విరగడయి పోతాను—కానీ తాగనివ్వటం లేదు—ఎన్నాళ్ళు బ్రతికిస్తారో నేనూ చూస్తాగా!'

శంకరం జాలిగా చూస్తూ కూర్చున్నాడు. అతనికి గొంతు పెగిలి మాటలు రావటం లేదు—ఇంతలో కాఫీ కప్పు తీసుకుని లత వచ్చి శంకరంగారి కిచ్చింది—

'అన్నట్లు నేను బ్రతకాలోయ్!' బెంగగా అన్నాడు సత్యన్నారాయణ—

'మా లతకి పెళ్ళి చెయ్యాలి — ఎక్కడన్నా సంబంధం చూడవోయ్! చిన్న వాడిని చూడు—ముసలాడిని చూడకు—మా వారిజకు నాబుద్ధి గడ్డితిని, ముసలాడిని

కుదిర్చానుగాతది —'

'చచ్చిపోయింది—' లోపలినుంచి అరిచింది పార్వతి. గతుక్కుమన్నాడు సత్యన్నారాయణ—

'అవును—చచ్చి—పోయింది—' దిండులో తలపెట్టుకుని కుళ్లి కుళ్లి ఏడ్చాడు సత్యన్నారాయణ—

'ఊరుకోండి—ఎంత ఏడ్చినా చచ్చిన వాళ్లు బ్రతికొస్తారా?' అన్నాడు శంకరం ఉదార్పుగా—

'వచ్చినా మనం రానిస్తామా? దెయ్యాలనుకుని తరి మెయ్యమూ!'

సత్యనారాయణ అసందర్భంగా మాట్లాడటం బాగా అలవాటయిపోయింది శంకరానికి-అంచేత అతని మాటలు పట్టించుకోకుండా కొంచెంసేపు కూర్చుని తను తెచ్చిన కమలాలు సత్యన్నారాయణ చేతుల్లో పెట్టి వెళ్లిపోయాడు—

'నువ్వేమీ అనుకోనంటె ఒక మాట చెప్తాను—' కళ్యాణి ముఖంలోకి చూస్తూ అన్నాడు శంకరం—

'ఏం అనుకుంటాను? చెప్పండి-నేనూ ఒకటి చెప్పాలనుకుంటున్నాను—'

'ఏవిటీ?'

'ముందు మీరు చెప్పండి—'

'పోనీ, వాళ్ల లతను మన రామచంద్రకు చేసుకుంటె? లక్షణమైన పిల్ల!'

'సరిగ్గా నేనూ ఇదే చెప్పాలనుకుంటున్నాను—'

'అవునా ఎంత మంచిదానివి కల్యాణీ!' కల్యాణిని ఆప్యాయంగా దగ్గిరకు తీసుకోబోయాడు—

'ఉండండి—చిన్న పిల్లలా!—' ముసిముసి నవ్వులతో విడిపించుకొంది కల్యాణి—


* * *

తల్లి రమ్మని రాయగానే బయల్దేరి వచ్చాడు రామచంద్ర-విషయం విని చికాకు పడ్డాడు—

'నా. కిప్పుడు పెళ్లొద్దమ్మా! అసలు చేసుకోవాలనిలేదు—' అన్నాడు—

'ఇన్నాళ్లూ సుశీల పెళ్లయితేనే కాని చేసుకోనన్నావు-సుశీలకు పెళ్లయి అప్పుడే ఏడాది నిండుతోంది-ఇంకా ఏవిటి అభ్యంతరం రామూ?'

'అబ్బ! నా కింకా చేసుకోవాలనిలేదు—అంతే!' కొద్దిగా విసుక్కున్నాడు రామ



శం క—

—వ్రభుచ్చుకుంది కల్యాణి — ఏం మాట్లాడకుండా వెళ్ళిపోయింది—

రామచంద్ర కలవరపడ్డాడు — తల్లిని సమీపించాడు—'నన్ను క్షమించమ్మా! నీ పిదే విసుక్కున్నాను—' అన్నాడు జాలిగా—

కల్యాణి నవ్వేసింది—

'విసుక్కున్నా సహించగలను — కానీ నువ్విలా పెళ్ళి లేకుండా ఉంటానంటే సహించను—పోనీ ఎవరినైనా ప్రేమించావా చెప్పు—నువ్వెవరిని ప్రేమిస్తే వాళ్ళనే చేసుకో! నాదికానీ, మీ నాన్నగారిదికానీ అభ్యంతరం ఏం ఉండదు—'

'లేదు!- లేదు!' తీక్షణంగా అన్నాడు—

'అంత గాబరాపడతావేరా? మరి అసలు పెళ్ళి వద్దనటం దేనికి? నామాట విను—ఒక్కసారివచ్చి అతని చూడు — ఇష్టమయితేనే చేసుకో! —లేకపోతే నిన్ను బలవంతం చేసేదెవరు? పిల్లనే ఎంచుకోవటం ప్రేమించినవాళ్ళు అనుకునేమాట! నువ్వు ఎవరినీ ప్రేమించలేదని నేను నమ్మాలనుకుంటే నువ్విలా మాట్లాడకూడదు—'

తల వంచుకున్నాడు రామచంద్ర—అంటే అంగీకరించినట్టే 'లెక్క' వేసుకుంది కల్యాణి—

ముందుగా చూసుకోవడానికి వస్తున్నట్లు ఉత్తరం వ్రాసి వెళ్ళారు, కల్యాణి రామచంద్రా—ముగ్గురు వెళ్ళకూడదని ఆగి

చీకటి కడుపున...

పోయాడు శంకరం—

ఎంత సర్దినా ఇంట్లో దర్రిద్రం ఓడుతూ వేస్తుంది—

ఎక్కణ్ణుంచో కుర్చీలు తెప్పించి వేసాడు—

కల్యాణిని కన్నీళ్ళతో కౌగలించుకుంది పార్వతి—

'నువ్వు దేవివి కల్యాణీ! ఇంతకన్నా ఏం చెప్పాలో తెలియటం లేదు—' అంది—

కల్యాణి పార్వతి కన్నీళ్ళు తుడిచి 'ఏం చెప్పక్కర్లేదు—రత్నంలాంటి పిల్లని నా కొడుకు సుఖం కోసం నే నాసపడితే నన్ను పొగుడుతావేమిటి? సరే! ముందు అతను తయారుచేసి తీసుకురా! వెంటనే అలంకరించేవు సుమీ! మా వాడికి ఎంత నిరాడంబరంగా వుంటే అంత ఇష్టం—'

'పక్కింటివారిదగ్గర నగలు ఎరువు తెచ్చాను—పెట్టద్దా?'

'మంచిదానివి, ముందుగానే చెప్పావు—ఇలాంటి దర్జాలు వాడి కసలు పనికిరావు—బొట్టూ, కాటుకా, పువ్వులూ పెట్టి శుభమైన చీర కట్టుకురమ్మను—చాలు—అయినా దీనికి నగలెందుకు?'

'సరే! సరే!' అంటూ లోపలికి వెళ్ళిపోయింది -

సత్యన్నారాయణ రామచంద్ర రెండు చేతులూ పట్టుకుని ఎవరో అపూర్వ వ్యక్తిని చూస్తున్నట్లు చూసాడు—'ఎంత బాగున్నాయ్యా! చదువుకున్నవాడివి—నిజంగా మా అమ్మాయిని చేసుకుంటున్నావా? మీ నాన్న నీకు పూర్తిగా చెప్పాడో? లేదో? నేను కట్నాలియ్యలేను సరే! నీకు మోటారు సైకిలూ, వాచీ, ఇలాంటివిగూడా కొనియ్యలేను—పండుగలూ అవీ వస్తే కొత్త బట్టలూ అవీ కుట్టించలేను—చేసుకుంటావా? నిజంగా ఏమీ అక్కర్లేకుండా మా అమ్మాయిని చేసుకుంటావా?'

'ఏవండీ, ఇలారండి-'

లోపలి నుండి అరిచింది పార్వతి—

'వస్తా! వస్తా!' అంటూ లోపలి కెళ్ళాడు సత్యన్నారాయణ—

అస్థిపంజరంలాటి ఆ వృద్ధుడిని, అతని కళ్ళలో చెమరుపీ, అతడిమాటలలో ఆర్తినీ గమనించిన రామచంద్ర హృదయం కదిలి పోయింది—

ఆపిల్ల బాగున్నా బాగు లేకపోయినా తప్పక చేసుకు తీరాలనే నిర్ణయానికి వచ్చేసాడు—

ఈలోగా సత్యన్నారాయణ మళ్ళీ వచ్చాడు—

ఏమీ ఇవ్వనంటే ఏమి ఇవ్వననికాదు—ఇస్తాను—ఎప్పుడైనా నా దగ్గర డబ్బున్నప్పుడు—ఎప్పుడో ఒకప్పుడు ఉండదా?—అప్పుడు—నేను తాగకుండా—ఉండ గలనులే! తాగకుండా కూడ ఉండగలను— ఆ డబ్బు పెట్టే నీకు—'

'ఏవండీ! కాస్త బజారు కెళ్ళి అరటి పళ్ళు తీసుకు రండి—'

అంటూ పార్వతి భర్తను కోపంగా చూస్తూ డబ్బిచ్చి చేతి కిచ్చింది-


'డబ్బిచ్చావు—డబ్బిస్తే అరటి-పళ్ళిస్తారా?'

రామచంద్ర ఆ వృద్ధుణ్ణి ఆదరంగా చూస్తూ 'ఎక్కడికీ వెళ్ళద్దు — ఇప్పుడేమీ అక్కర్లేదు—' అన్నాడు.

సత్యన్నారాయణ వెంటనే కూర్చున్నాడు,—

'నువ్వు నిజంగా మంచివాడివే! నాదగ్గర డబ్బున్నప్పుడు నీకు ఉంగరం చైనూ, ఉంగరం—'

'ఆయన మర్యాదకి వద్దంటే కూర్చోడమేనా?' కోపంగా అంది పార్వతి






Blue
Seal
TALC

చీకటి కడుపున...

లేచాడు సత్యన్నారాయణ

చెయ్యిపట్టుకు కూర్చోబెట్టాడు రామచంద్ర—

'నిజంగా వద్దండీ! అత్తయ్యగారూ! మీ రాయనని అనవసరంగా కష్టపెట్టకండి—'

కాబోయే అల్లుడిని గౌరవంతో చూసి లోపలికి వెళ్ళిపోయింది పార్వతి— 'అత్తగారూ' అన్న అతని సంబోధన ఆమె చెవులలో అమృతం నింపింది—

తీరుబడిగా ఎరుపు నగలు అద్దంలో చూసుకుంటూ అలంకరించుకొంటోన్న లతను చూసి, 'ఆ నగలన్నీ తీసెయ్యి' అంది పార్వతి.

తాత్కాలికంగానే అయినా అన్ని నగలు అలంకరించుకోగలుగుతున్నందుకు మురిసిపోతున్న లత బెంగగా 'ఏం?' అంది.

'అతని కిలాంటివన్నీ ఇష్టంలేదుట! తీసెయ్యి—ఆ పట్టుచీర కూడా వద్దు—వెంకటగిరి జరీచీర కట్టుకో!'

ఉసూరుమంది లత ప్రాణం.

'నగలంటె ఇష్టంలేదుట! ఇకముందు కూడా తనకు 'నగలేం చేయించడు కాబోలు' అనుకుంటూ దిగులుగా నగలన్నీ తీసేసి వెంకటగిరి చీరెతో వచ్చి కూచుంది లత.

ఒక్కసారి ఉలికిపడ్డాడు రామచంద్ర

ఇదెలా సాధ్యం? ఈ అమ్మాయిలో వారిజ పోలికలెలా వచ్చాయి?

వారిజ ముఖంలో ఉన్న సౌమ్యరేఖలేదు వారిజకన్న ఒక ఛాయ తక్కువ.

వారిజ కళ్ళలో ఏదో చిలిపితనం, చైతన్యం, వీటిలో లీనమయి ఒక ఆర్ద్రత కనిపించేవి.

ఈ అమ్మాయి కళ్ళు కొంచెం బెదురుతున్నాయి — పెళ్ళికూతురు కావటంవల్ల కావచ్చు.

కళ్ళు ఏవో కలలు కంటున్నట్లు ఉన్నాయి—బరువుగా మెత్తగా

ఈ స్వల్పభేదాలు తప్పిస్తే వారిజే ఎదురుగా కూర్చున్నట్లుంది

లత కూడా అతనిని చూసి ఉలికిపడింది.

ఇదేవిటి? బి. ఎస్. సి. పాసయ్యాడంటే సూటూబూటూతో దర్జాగా ఉంటాడను కొంది—కాని, ఇలా పంచె, లాల్చీతో పల్లెటూరి భైతులా ఉన్నాడేమిటి?

అన్నట్లు ఇతనుండేది పల్లెటూళ్ళోనే కదూ? స్వంత వ్యవసాయం కూడాను... లోలోపల చాలా నిరుత్సాహపడింది లత.

తదేకంగా లతను చూస్తోన్న రామచంద్రను చూసి నవ్వుకొంది కల్యాణి.

'చాలు చాలు! రామూ! దృష్టి తగిలేను, మూడుముళ్ళూ పడ్డాక తనివితీరా చూసుకుందువుగానిలే!' అంటూ నవ్వింది—అందరూ నవ్వారు—రామచంద్ర సిగ్గుపడ్డాడు — లత కూడా సిగ్గుపడి అక్కడినుంచి లేచివెళ్ళిపోయింది

'మా అమ్మాయి నచ్చినట్లేనా?'

ఇంకా తన అదృష్టంలో తనకు నమ్మకం కుదరక బెంగగా అడిగాడు సత్యన్నారాయణ.

చిరునవ్వుతో తలఊపాడు రామచంద్ర.

'ఇంకా అడగాలిటండీ! ఆ చూపులు తెలియటంలా?' నవ్వింది కళ్యాణి.

ఆ సాయంత్రమే వెళ్ళిపోయారు రామచంద్రా, కల్యాణి — అందరూ సంతోషించారు—ఒక్క లత తప్ప—లత ఆశలు వేరుగా ఉండేవి ఇన్నాళ్ళూ — అక్కయ్యే వేలకివేలు సంపాదిస్తోంది — ఒక ఆరేడు వేలు తనకు కట్నంగా ఇయ్యలేకపోతుందా? ఒక ఇంజనీరో, డాక్టరో తనకు భర్తగా రాకపోతాడా? హాయిగా పట్టుచీరలు కట్టుకుని బోలెడు నగలు పెట్టుకుని, ఇంటి పనంతా దాసీలు చేస్తోంటె, తనూ తన భర్తా కార్లలో తిరుగుతోంటే — ఎంత కమ్మగా ఉంటుంది జీవితం?

అలా ఉండవలసిన జీవితాన్ని వారిజక్కయ్యే పాడుచేసింది.. మధ్యలో అమాంతంగా మంచివానిలా మారిపోయింది— అయినా ఒకసారి చెడిపోయాక మళ్ళీ మంచివాళ్ళెలా అవుతారు? వెంటికే చెడ్డ పేరు రాకపోతే—

వారిజమీద కోపంతో ఉడికిపోయింది లత మనసు—తన సినిమా హీరోల్లాలేని రామచంద్ర, లతమనసునంతగా ముగ్ధపించలేక పోయాడు—

* * *

కట్నమయితే ఇవ్వక్కర్లేదు కాని పెళ్ళి ఖర్చులో? పార్వతి సత్యన్నారాయణలకిదొక సమస్య అయిపోయింది—సత్యన్నారాయణ లేని ఓపిక తెచ్చుకు తిరుగుతున్నాడు—వాని,

డబ్బెలా పుట్టించగలదు? చివరకు వారిజ తప్ప గత్యంతరం కనిపించలేదు పార్వతికి— బాధపడుతోనే రవిని పంపింది—రవి విసుక్కున్నాడు—

'దాని దగ్గరే ముందమ్మా! మహా ఇస్తే ఒకవంద ఇచ్చేను—రెండు వందలిచ్చేను—అంతే!'

'అయినా అడిగి చూడు'

వారిజ ఏదో ఒక విధంగా సర్దుతుందన్న నమ్మకం పార్వతికుంది

రవిద్వారా సంగతివిన్న వారిజ పొంగిపోయింది—ఆఏడే వారిజ బి. ఎ. కూడా ప్రయివేట్‌గా పాసయింది—ఆ బి ఏ! ఫలితం తెలిసిననాడు కూడా ఇంతగా ఆనందించలేదు

'డబ్బు కేవిట్రా! నాఇల్లు తాకట్టు పెట్టి అయిదువేలు తెస్తాను—తరువాత మెల్లిగా తీర్చుకుంటాను'

వారిజనుండి అంత సహాయం ఆశించని రవి ఆశ్చర్యపోయాడు.

వారిజ ఇల్లు తాకట్టుపెట్టి డబ్బు తీసుకుని 'పద! నేనూ వస్తాను—'అంది.

అంతడబ్బు రవి సవ్యంగా ఇంట్లో ఇస్తాడా ఇవ్వడా అని ఒకటి:

లతను చూడాలని ఒకటి

వారిజను చూస్తూనే పాలిపోయింది పార్వతి ముఖం

'నువ్వా వచ్చావా?' అంది,

తల్లి పాలిపోయిన ముఖమూ ఆమాటలూ, ఆ మాట్లాడిన కంఠస్వరమూ వారిజ పొంగిపార్లే ఉత్సాహం మీద చన్నీళ్ళు జల్లాయి

'మళ్ళీ వెంటనే వెళ్ళిపోతానమ్మా!' అంది.

పార్వతి ఇంకేం మాట్లాడలేదు— పాపం పార్వతికి బాధగానేఉంది—కానీ ఏం చెయ్యగలదు? ఒక కన్ను పోయిందని రెండోకన్ను పొడుచుకోగలదా?

వారిజ అయిదువేలూ తల్లిచేతిలో పెట్టింది.

'రెండువేలు పెళ్ళిఖర్చుకుంచు— ఒక వెయ్యి పెళ్ళికొడుక్కు బట్టలూ, పెళ్ళివాళ్ళకి బట్టలూ మొదలైనవి కొను— మిగిలిన రెండువేలూపెట్టి లతకి నగలు చేయించు—దానికి నగలంటే ఇష్టం.'

పార్వతి కన్నీళ్ళతో అందుకుంది.

'ఇల్లు తాకట్టుపెట్టి అయిదువేలు లేకపోతే, అమ్మేసి ఏ యాభైవేలో తేకపోయావా? పాతికవేలు నువ్వుంచుకున్నా, ఏపదివేలో కట్నమిస్తే నాకింతకన్న మంచి సంబంధం వచ్చేదిగా!' అంది లత రుసరుసలాడుతో.

నిర్ఘాంతపోయింది వారిజ.

'సంబంధం పూర్తిగా నిశ్చయమయిపోయాక ఇంకో సంబంధమంటా వేమిటి లతా!'

'అయితే మాత్రం! ఇంకో మంచి సంబంధం దొరుకుతే, ఇది వదులుకో కూడదని ఉందా ఏం?'

'ఒసేయ్ లతా! ఇంతకన్న మంచి సంబంధం నీకు కోట్లుపోసినా రాదే! నయాపైసకి ఆశపడకుండా గొప్ప మనసుతో నిన్ను చేసుకోడానికి సిద్ధపడ్డారు— అలాంటి మనుష్యులుంటారుటే!' కటకటలాడుతో అన్నాడు సత్యన్నారాయణ

'గొప్పమనసు! అతనేం' బాపుంటాడని? నా అందాన్నిచూసి ఒప్పుకున్నాడు'

'నోరుమూసుకో' చిరాగ్గా అన్నాడు సత్యన్నారాయణ

'అంతే! కొంతమంది మనుష్యులకు సుఖపడడం కూడా చేతకాదు'

లత మూతి తిప్పింది వెటకారంగా.

'అమ్మా! నేను పెళ్ళికి రానా?'

భయం భయంగా అడిగింది వారిజ.

కన్నీళ్ళతో చూసింది పార్వతి.

'ఎలా అమ్మా! నిన్ను తెలియనివాళ్ళెవరు? పెళ్ళి పందిట్లో ఎవరైనా నిన్ను గుర్తుపడితే.—'

ఆగిపోయింది పార్వతి మాట పూర్తి చెయ్యలేక.

'పరవాలేదు, ఉండనియ్యమ్మా! వారిజక్కా! నాపెళ్ళికి రిసెప్షన్‌నాడు నువ్వు డాన్స్ చేస్తావా?' ఉత్సాహంగా అడిగింది లత.

పాలిపోయిన ముఖంతో లేచి నిలబడింది వారిజ

పిచ్చిదానిలా లతకేసి చూడసాగింది.

వణుకుతోన్న శరీరాన్ని అదుపులో పెట్టుకొంటూ గబగబవచ్చి వారిజచెయ్యి పట్టుకున్నాడు సత్యన్నారాయణ.


'పదమ్మా! నిన్ను రైలెక్కించి వస్తాను— ఇక్కడుండకు—నడు—'

మతిపోయిన దానిలా నిల్చున్న వారిజను చెయ్యి పట్టుకుని గబగబ లాక్కుపోయాడు.

లత పెళ్ళి వైభవంగా ముగిసింది— పెళ్ళి ఖర్చులూ, అందరికీ పెట్టిన బట్టలూ అవన్నీ చూసి ఆశ్చర్యపోయారు శంకరం కళ్యాణి

'పాపం! ఎక్కడైనా అప్పుచేసారేమో!' అంది కళ్యాణి

'వద్దంటే చిన్న బుచ్చుకుంటారు—



చీకటి కడుపున ...

"అయినా చెప్పిచూడు—' అన్నాడు శంకరం.

'మనలోమనకి ఇవన్నీ ఎందుకు పార్వతీ! ఏదో మామూలు బట్టలు పెడితే సరిపోలేదా?' అంది కల్యాణి.

'మా కింక ఎవరున్నారు కల్యాణీ! అత నైనా సుఖపడనీ! పెట్టడానికైనా ఎవరున్నారు? నా సంతోషంకోసం మీరు తీసుకోండి ' అంది పార్వతి.

కల్యాణి ఇంకేం మాట్లాడలేదు

తనకు పెట్టిన సూట్ తీసుకోలేదు రామచంద్ర.

'పల్లెటూళ్ళో పొలాల మధ్య తిరిగే వాడిని నాకు సూట్ ఎందుకు?' అన్నాడు.

ఎవరెంత బలవంతపెట్టినా ప్రయోజనం లేకపోయింది—అతకు ఎంతో కోప మొచ్చింది—చివరకు ఆ సూట్ రవి తొడుక్కున్నాడు దర్జాగా.

వంటినిండా నగలతో మెరిసిపోతున్న కూతురునీ కూతురు పక్కన కూర్చున్న రామచంద్రనీ కళ్లపండువుగా చూసుకుంది పార్వతి

తృప్తిగా ఆశీర్వదించాడు సత్యన్నారాయణ—కానీ ఆయనకా క్షణంలో పాలిపోయిన ముఖంతో జీవంలేని కళ్లతో గుమ్మం దాటిపోతున్న వారిజ కళ్లలో మెదిలి, కళ్లనిండా నీళ్లు నిండాయి—చెప్పన తుడుచున్నాడు

కోడలిని చూసుకుని మురిసిపోయింది కల్యాణి.

మిగిలిన లాంఛనాలన్నీ ముగిసాక అతను తీసుకునివెళ్లిపోయాడు రామచంద్ర.

లేని ఓపికతో అత పెళ్లిలో తిరిగిన సత్యన్నారాయణ ఆరోగ్యం పూర్తిగా నాశనమయింది. గుండెల్లో నొప్పి తీవ్రమయింది. ఒక్క అడుగువేస్తే తేలిపోతోంది

'నేను వారిజ దగ్గిర కెళ్తున్నాను' ఉన్నట్టుండి అన్నాడు సత్యన్నారాయణ.

తెల్లబోయింది పార్వతి

'దానిదగ్గిర కెందుకూ? '

'చూడాలనుంది—వెళ్తున్నాను '

ఇంకేం వాదించలేదు పార్వతి—పార్వతికీ వంట్లో బాగుండటంలేదు. అయిన దానికి కాని దానికీ సత్యన్నారాయణతో వాదించ గలిగే ఓపిక లేకపోయింది.

తలుపు తట్టిన చప్పుడుకు విసుగ్గా తలుపు తెరిచిన వారిజ తండ్రిని చూసి ఆశ్చర్యపోయింది.

'నాన్నా!' అంది ఇంకేం మాట్లాడలేక.

ఆయాస పడిపోతోన్న సత్యన్నారాయణ వేరుగా వచ్చి మంచంమీద కూర్చున్నాడు. తండ్రికి ముందు గ్లాసుతో మంచినీళ్లిచ్చి 'ఏమిటి నాన్నా!' అంది.

ఆ మంచినీళ్లు తాగి అయిదునిముషాలు అలా సొరిపోయినట్లు కూర్చున్నాడు సత్యన్నారాయణ.

తరువాత వారిజ వంక చూసి వాత్సల్యంగా నవ్వాడు.

'నీ దగ్గరుందామని వచ్చానమ్మా! ఈ ముసలి తండ్రికి గుక్కెడు గంజి పొయ్యలేవా?'

నమ్మలేనట్లు చూసింది వారిజ—కళ్లలో నీళ్లు కాలువలు గట్టాయి—ఎండల్లా ఉన్న తండ్రి చేతులు పట్టుకుని 'అంత అదృష్టమా నాన్నా! నీ కింకా నామీద అమృతం దయ ఉందా?' అంది.

సత్యన్నారాయణ వారిజ శిరస్సు వాత్సల్యంగా నిమిరాడు.

'నాకు తెలుసమ్మా! ఇంక వేనెన్నాళ్లో బతకను—ఒకనాడు నువ్వు నన్ను సంతోష పెట్టడానికి ప్రయత్నించావు—ఇవాళ నిన్ను సంతోష పెట్టడానికి నేను వచ్చాను—నీచేతుల్లో చచ్చిపోదామని—మనం ఒకరి నొకరం ఇంకెలా సంతోష పెట్టుకోగలమమ్మా!'

తండ్రి వళ్లో వాలి ఆవురుమంది వారిజ— సత్యన్నారాయణ శోకమూ గట్టు తెగింది—కన్నీళ్లతోనే ఒకరినొకరు అనునయించుకొంటూ ఆతండ్రీ కూతుళ్లు అలా ఎంతసేపో ఉండిపోయారు—ఆ మరునాటినుంచి సత్యన్నాయణ గుండెజబ్బు బాగా ఎక్కువయింది—వారిజ ఆయనను బతికించుకోవటానికి సమస్త శక్తులూ ఉపయోగించింది —కానీ, మూడురోజులు యమయాతనపడి చివరకు వారిజచేతుల్లో కళ్లుమూసాడు సత్యన్నారాయణ.

(ఇంకా వుంది)

వారఫలం

12.4.68 శుక్రవారం మొదలు
18.4.68 గురువారం వరకు

మేషం: వృత్తిలో ప్రయోజనం లేని శ్రమకు గురికాగలరు ఇతరుల మీద ఆధారపడి యేవ్యవహారమూ ప్రారంభించడం తగదు రావలసిన డబ్బు సమయానికి అందుతుంది వారంమధ్యలో అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడతాయి

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉండదు పాటివారిలో గౌరవం లభిస్తుంది

వృషభం కొన్నిపనులు సులువుగా నెరవేరినా మరికొన్నింటిలో శ్రమ కలుగుతుంది వృత్తిలో ఆదాయం బాగా ఉంటుంది రాజకీయవ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం పెరుగుతుంది ప్రయాణాలు శ్రమమీద ఫలిస్తాయి నూతన విషయాలను తెల్సుకొంటారు

స్త్రీలకు —కుటుంబ వ్యవహారాలో అధికవ్యయం జరుగుతుంది వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు

మిథునం: మీకు ముమ్ముందు లాభించగల వ్యవహారాల్లో అభివృద్ధిని సాధించ గలరు సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి పాటివారితో మాట పట్టింపులు తగవు విద్యా వైజ్ఞాని రంగాలో మీకృషి ప్రోత్సాహకరంగా ఉంటుంది

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి

కర్కాటకం వృత్తిలో అనుకూల వార్తలను వింటారు ఉద్యోగంలో అధికారుల ఆదరాభిమానాలను పొందగలరు రాజకీయ వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి ●

స్త్రీలకు—బంధువులకు సహాయం చేస్తారు. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

సింహం వృత్తివ్యాపారాల్లో మీ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి నూతన వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి సమయానికి యేదోఒక విధంగా డబ్బే చేతికి వస్తుంది సజ్జన సాంగత్యం లభిస్తుంది

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు శ్రమమీద నెరవేరతాయి పుణ్యకార్యాలు చేస్తారు

కన్య. కొన్ని వ్యవహారాల్లో మీరు మొగమాటాలకు లొంగిపోయే ప్రమాదం ఉంది వ్యాపారరీత్యా చేసే ప్రయాణాలు శ్రమమీద ఫలిస్తాయి సాహసముతో కూడిన వ్యవహారాలు స్వల్పంగా లాభిస్తాయి మిత్రులకు సహాయం చేస్తారు

స్త్రీలకు— అధికవ్యయం జరుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు

తుల: మీరు స్వంతంగాచేసే వ్యాపారాలకంటే భాగస్వాములతో కలసిచేసే వ్యాపారాలు బాగా ఉంటాయి ఉద్యోగంలో మీ కృషిని అధికారులు గుర్తించగలరు. పాటివారిలో గౌరవం లభిస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది.

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి ప్రయాణాలోచనలు చేస్తారు.

వృశ్చికం వారం ప్రారంభంలో అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి వృత్తిలో మీరు యిదివరకు చేసిన ప్రయత్నాలు యిప్పుడు ఫలిస్తాయి ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది అధిక వ్యయం జరుగతుంది

స్త్రీలకు — ఆరోగ్యం బాగా ఉంటుంది దైవ కార్యాలు నెరవేరుతాయి

ధనుస్సు వ్యాపార విస్తరణ ప్రయత్నాలు అనుకూలంగా ఉంటాయి ఉద్యోగంలో మిత్రులకు ఉపకారం చేయగలరు వారం మధ్యలో అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడతాయి మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది

స్త్రీలకు— శుభకార్యాల విషయంలో అభివృద్ధిని సాధించగలరు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు

మకరం వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు శ్రమమీద నెరవేరుతాయి ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు — ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. సంతోషకరమైన వార్తలను వింటారు


కుంభం వృత్తిలో పాటివారి పోటీని యెదుర్కొని అనుకూలతను సాధించగలరు మీ కంటే పెద్దవారు కూడా మీ సహకారాన్ని కోరవలసి వస్తుంది స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి. పాటివారిలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు యిదివరకటికంటే బాగా ఉంటాయి. దైవకార్యాలు నెరవేరుతాయి

మీనం రావలసిన డబ్బుమీద ఆధారపడి యే వ్యవహారమూ ప్రారంభించడం తగదు ఉద్యోగంలో యితరుల నిమిత్తం శ్రమకు గురికాగలరు. వారం మధ్యలో వృత్తిలో ఆదాయం బాగాఉంటుంది. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి.

స్త్రీలకు — ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు

—మహేష్ ●





కలబారి హరివిల్లు

టి. విజయలక్ష్మీవిద్యాసాగర్

నన్ను పిలుస్తూ తలుపు దబదబా బాదేడు వెంకయ్య.

'ఏమిటి వెంకయ్య, కాస్తాగు, వస్తున్నా' అని కళ్ళు నులుముకుంటూ లేచాను నా మాటల మధ్య వెంకయ్య మరో రెండుసార్లు కేకేశాడు. నేను గడియ తీసిందాకా కూడ ఆగక అవర్జెంటే 'అమ్మా, టెలిగ్రాం వొచ్చింది' అన్నాడు.

తెల్లటి ఆ కవరులోని రంగుకాగితాన్ని చూస్తే భయమేసింది వెంకయ్యను వెళ్ళమన్నాను వణికే చేతుల్తో కవరు చించాను నా స్వార్థానికి ఫలితం అనుకున్నంతా అయింది

'మదర్ సీరియస్—స్టార్ట్' జయకరం బాబాయి.

అమ్మ! మూడురోజుల్కితమే అమ్మ దగ్గర్నించి వుత్తరం వచ్చింది తనకు వొళ్ళు బావుండలేదని ఐనా నేను వెళ్ళలేదు అమ్మకు ఎవరు చేస్తున్నారు? ఇన్నాళ్ళూ ఎవరు చేశారు? ఆ అంకంత యింట్లో వంటివాడితో అమ్మ ఒంటరిగా, అనారోగ్యంగా నా కేమీ కాని వాళ్ళకు సేవ చేస్తూ నే నిక్కడ

నాలుగున్నరైంది ఏడింటికి ట్రైనుంది. రెండ్రోజుల క్రితమే బదులు పెద్దమ్మకు డబ్బు పంపేసి ఏం చేయాలో తెలియక అడిగాను. అదెప్పుడు చేరుతుందో భారతిదగ్గరా, వనజాదగ్గరా అడిగి కొంచెం డబ్బు అప్పు తెచ్చాను. భారతి యింటిపెద్ద టిఫినూ, కాఫీ ఎంది. పొద్దున్న వండుకున్న అన్నం అలాగే వుంది. పనిమనిషిని పిలిచి అదిచ్చేశాను. గుడ్డలు సర్దుకుని పెట్టెలో పెట్టుకున్నాను. సెలవుకోసం మాథుర్‌గారి దగ్గరకెళ్ళాను.

'మీ అమ్మకు ఏమాత్రం క్రిటికల్‌గా వున్నా యిక్కడకు తీసుకొచ్చెయ్. మనమే ట్రీట్ చేద్దాం. పల్లెటూళ్ళలో వాళ్ళు ప్రతిదానికీ భయపడతారు మనం గాభరా పడి అంతదూరం వెళితే అది ఏ మైల్డ్ న్యుమోనియావో ఐవుంటుంది' అన్నారు నాకు ధైర్యం చెబుతూ డాక్టరుగారు. ఆమాటలే నిజం కావాలని మనసులోనే మొక్కుకున్నాను

ఇంత బాధలోనూ ఇంకెప్పుడూ చూడకూడదని నేను నిశ్చయించుకున్న ఆనంద ప్రసాద్‌ను చూడాలనిపించింది నన్ను

వే [illegible] అతని గదికి నడిచాను.

అతను మంచి నిద్రలో వున్నాడు. తట్టి లేపాను, మాట్లాడే అవకాశం యివ్వకుండా 'మా అమ్మకు సీరియస్‌గా వుందని టెలిగ్రాం వచ్చింది. వెళుతున్నాను' అన్నాను.

అతను షాక్ తిన్నట్లుగా 'మై లార్డ్! వెళ్ళండి, వెళ్ళండి' అన్నాడు అతని సానుభూతిచూస్తే జాలేసింది

'మళ్లీ తొందర్లోనే వస్తాను. ఈ మధ్య మీకు బాగౌతుంది. డిస్చార్జి కూడా చేసేలారు' అన్నాను

'మీకు డబ్బు అవసరమౌతుంది తీసి కెళ్ళండి' అంటూ పక్కనున్న టేబుల్ డ్రాయర్ లాగబోయాడు

'ఒద్దు అవసరంలేదు వెళుతున్నాను' అంటూ లేచాను

అతను దీనంగా తలొంచుకున్నాడు

'నన్ను క్షమించాలి నిన్న మీ డ్యూటీ అవర్సులో ఓ పొరపాటు చేశాను పొరపాటు చేసినందుకు కాదుగాని డక్టరుగారు మిమ్మల్ని కోప్పడ్డందుకు బాధపడు తున్నాను మీకు తెలియకుండా నిన్న మా తమ్ముడికి పిల్లల్ని గురించి ఓ ఉత్తరం రాశాను నిన్న నా టెంపరేచర్ పెరగ టానికి అదే కారణమని డాక్టర్‌గారి అనుమానం.'

నేను మాట్లాడలేదు.

అతను కళ్ళద్దాలుతీసి కళ్లు తుడుచు కున్నాడు బాగా పీక్కుపోయి, గడ్డం పెరిగిన మొహం కొత్తగా కనిపించింది

నేను నిశ్శబ్దంగా యివతలికొచ్చేస్తుంటే తనలోతాను గొణుక్కుంటున్నట్టుగా 'నేను అందర్నీ యిబ్బంది పెడుతున్నాను' అను కున్నాడు

గదికి తాళంవేసి, తాళంచెవి నసీమా కిచ్చి, సంచితో నర్సింగ్‌హోం దాటేను, వస్తానని తీసుకుని తను స్టేషన్‌దాకా వస్తానంది భారతి ఒద్దన్నాను నా ఏడుపు వాళ్ళుకూడా చూడటం నాకిష్టం లేదు

రైలు అరగంట ఆలస్యంగా బయల్దేరింది. రెండు స్టేషన్లు గడిచేటప్పటికి కంపార్టుమెంటు యింకా లొక్కిడి తొక్కిడైంది పన్నెండిటికల్లా జనం పడు కున్నారు. [illegible] వస్తుందని కిటికీలు కూడా మూసేశారు. గాజుపలకల వెనకాల చీకటిలో టెలిగ్రాఫ్‌తీగలు మసకగా వెనక్కు కదిలి పోతున్నాయి..

మనసు వ్యాకులంగా వున్నది. అమ్మకు బాగోలేదని వుత్తరం రాసినా యిన్నాళ్ళూ వెళ్ళకపోవటం నన్ను నేను క్షమించుకోలేక పోతున్నాను. ఎంత కృతఘ్నురాల్ని నర్సింగ్‌హోంలో పేషంట్ల మధ్య తనూ ఒక్కడుగా, తనకోసం ప్రత్యేకంగా చూసే వాళ్ళెవరూ లేకుండా అతన్నొంటిగా వదలటం యిష్టంలేక పోయింది. అతని బాధ నేను తీసుకోలేను కాని ఆ మూల్యుల మధ్య అతన్ని ఒంటరిగా వుంచలేక పోయాను టైఫాయిడ్‌తో వచ్చాడు అంత దిగులుగా కనిపించే మనిషిని నే నెప్పుడూ చూళ్ళేదు. 'బ్రతుకులో యింకేమీలేదు — ఆశించటానికి' అన్నట్లు చూసేవాడు అతన్నిచూసి జాలిపడకుండా వుండటం నాకు సాధ్యంకలేదు. ఎక్కడో బ్యాంకలో జూనియర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడట పెద్దబ్బాయి స్కూలుఫైనల్లో వున్నాడట అమ్మాయి ఫోర్తుఫారంలో వుందిట ఏదేళ్ళుగా వాళ్లకు తల్లిలేదుట. వంట చేస్తూంటే చీరంటుకుని చనిపోయిందిట ఎంత క్లుప్తంగా, సామాన్యంగా చెప్పాడు ఆ విషయాన్ని!

వెల్లకిలా పడుకుంటే పీడకల లొస్తాయనేవాడు. కాని ఎప్పుడుచూసినా వెల్లకిలా పడుకుని మూలుగుతుండేవాడు నేను లేపి పక్కమీద పడుకోమని చెప్పే దాన్ని భార్య పోయాక పిల్లల్ని తనతమ్ముడి దగ్గరకు పంపించేశాడట ఇక్కడ తనొక్కడూ

'ఈ ఒంటరితనం భరించలేక పోతున్నాను' అన్నాడు ఓనాడు నాతో. ఆ మాట నన్నెందార్చినట్లనిపించింది అతనికి నా విషయం ఎవరు చెప్పారో ? 'నేను ఈ టైఫాయిడ్ నించి బ్రతికి బయటపడితే మీకు ప్రపోజు చెయ్యాలను కుంటున్నాను— కాని నాకా అదృష్టం దొరుకుతుందో లేదో' అన్నాడు

'ప్రభువు కృపవల్ల తొందరగానే తగ్గుతుంది' అన్నాను. అన్నట్టే తగ్గింది డిశ్చార్జి వెళ్లిన మూడోరోజు మళ్లీ వచ్చి చేరాడు మళ్లీ తాగేడట. రిలాప్స్ ఐంది. 'నన్నేం చెయ్యమంటారు ? నా కర్మ ఇంతే ..' అన్నాడు. అతనికేం జవాబు చెప్పాలో తోచలేదు. గదికొచ్చి తనివితీరా ఏడ్చాను.

ఎవరో పసిపిల్లాడు కెవ్వుమన్నాడు. నిద్రపోతున్న తల్లి ఒళ్లోంచి కిందపడ్డాడు. తల్లి గాభరాగా లేచి పిల్లాడిని తీసుకుంది. పిల్లాడు గుక్కపట్టి ఏడ్చాడు. తల్లి పాలిచ్చింది క్షణంలో జనమంతా మేలు కున్నారు – విసుక్కున్నారు. నా మనసులో కలవరం కట్టలు తెంచుకున్నది బాబును విడిచి యిన్నాళ్ళూ ఎలా వుండగలిగానని పించింది నిన్నటి నైట్‌డ్యూటీ తర్వాత కూడా నిద్రరాలేదు. నేనెందరికి ద్రోహం చేశానో, ఎన్ని క్షమించరాని తప్పులు చేశానో

రైలు దిగేప్పటికి స్టేషన్ ముందరి చర్చి గడియారంలో ఏనిమిదైంది. మార్కెట్టుదాటి, ఆ పాతసందుల గుండా కంసాలివాడ దాటి మాయింటి సందు తిరిగాను గుండెదడ ఎక్కువైంది కాళ్ళు తడబడ్డాయి ఆ కాస్త దూరమూ యించుమించు పరిగెత్తాను ఇంటికి తాళం! పక్కింటి కాపు ముసలవ్వ అప్పుడే చెత్త పారవేయటానికి కేకలు వేస్తోంది, నన్ను చూసి.

'ఎవరూ, సుశీలమ్మా ?' అంది

'అవునవ్వా, అమ్మెక్కడ ?' అన్నాను చిక్కిపోయిన ప్రాణం చిక్కబట్టుకుని

'ఇంత ఆలస్యంగా వచ్చావే తల్లీ, మీ బాబాయివాళ్ళింటికెళ్ళి వారంరోజుల నాడు మీ అమ్మ అక్కడికే వెళ్లింది' అంది అవ్వ

'అప్పుడే!'

నడివీధిలో బహిరంగంగా ఏడుస్తూ వాళ్లింటికి నడిచాను ఇంకెలా అమ్మ!

నన్ను చూడగానే జయకరం బాబాయి కంట తడిపెట్టుకున్నాడు. చంటివాడు కాళ్లకు చుట్టుకుపోయాడు. 'అమ్మమ్మ దేవుడిదగ్గర కెళ్లిందంటూ',

బాబాయి చెప్పేడు,

'నెలరోజులుగా వదిన గుండె నొప్పితో బాధపడిందమ్మా రామానుజంగారు ఏదో మూలికరసం తీసిచ్చారు కొంచెం తగ్గినట్లే కనిపించి, పదిరోజులక్రితం మళ్లీ తిరగబెట్టింది. అప్పుడే వదినకూ, చంటి

వాణ్ణి ఇక్కడికి తీసుకొచ్చాము రావూ మునగారే వైద్యం చేశారు. నీకు ఉత్తరం రాశాను. మొన్న మధ్యాహ్నం ఇంట్లో నడుస్తూ పడిపోయింది. స్పృహ తప్పింది నోట్లోంచి నురగలు వచ్చాయి అప్పుడే నీకు టెలిగ్రాం యిచ్చాను సాయంత్రం అయింటికి ఆ సంధివానే ప్రాణం పోయిలింది. పాదరిగారొచ్చారు ఆ కమ్మడే కాని ఒరి మన స్పృహ వే లేదాయె ఆ పొద్దున్నే నీ పెళ్లి విషయంలో శ్రద్ధ తీసుకొని తొందరగా చేయ్యమని చెప్పింది నిన్న సాయంత్రం వాళ్ళింటికి వెళ్ళి చర్చికి తీసికెళ్ళాం. అయినిచి బాబాయి గొంతు రుద్ధమైంది

మా బంధువులందరికీ వుత్తరాలు రాసేడు బాబాయి.

'అమ్మాయ్, ఇప్పుడు మన దే సధరం వాళ్ళూ, డేనియల్ మామయ్యా వస్తారు ఈ ఘాళ్లో మనవా ళ్లింకా ఎవరున్నారని. పాదిరిగారి కూడ బాబుకూడా రమ్మన్నాను ఏదో, ఈ మూడ్రోజు ఇలా గడిచాకి, అంటే వరకు గుంటూరువాళ్ళు కూడా ఒస్తే ఒస్తారు' అన్నాడు బాబాయి

'ఎలాగో, జరగనీ బాబాయి అన్నాను

సాయంత్రం పాదరిగారు సైకిలు మీద మా దే వెళ్ళారు బాబాయి, పిన్ని, చంటి వాణ్ణెత్తుకుని నేనూ నడుస్తూ అమ్మ సమాధి చూడటానికి వెళ్ళాం అమ్మ ఇష్ట ప్రకారమే నాన్న సమాధి ప్రక్కనే అమ్మది త్రవ్వేరు

'తొమ్మిదో రోజు ఆపోగానే సమాధి

కలలో హరివిల్లు

కట్టేద్దాం బాబాయి ఈ ఖర్చుల కెంత వుతుందంటావు? అన్నాను.

'తరువాత చూద్దాం లేమ్మా. ఇప్ప డెందు కవన్నీ' అన్నాడు బాబాయి.

'నువ్వేమనకోకు బాబాయి అమ్మ అంత్యక్రియల ఖర్చులు ఎవరూ భరించటం నా కిష్టంలేదు ఎంత ఖర్చవుతుందో నాకు తెలియాలి' అన్నాను

'నీ ఇష్టప్రకారమే నమ్మా అంతా 'నువ్వే భరిద్దువుగాని' అన్నాడు గాద్గదికంగా

బాబాయి ఎంత ఒద్దన్నా వినక ఆ రాత్రి నేనూ, చంటాడూ మా ఇంట్లోనే పడుకుంటామని పట్టుబట్టాను. బాబాయికూడా వచ్చేడు

బాబాయి వాకిట్లో మంచ మేసుకు న్నాడు నేనూ, బాబూ లోపల పడుకున్నాం నిద్ర పట్టలేదు లేచి ఇల్లంతా తిరిగాను పదిరోజులుగా కదల్చకుండా ఇంట్లోని సామగ్రిమీద దుమ్ము పేరుకుపోయింది ఓ గిన్నెలో పాలువాసన వేస్తున్నాయి. ఆకుపచ్చని వాడిన కొత్తిమీర విశాలమైన అరుగుమీద ఒంటిగా పడుంది బావిలోంచి అమ్మ తోడుకొచ్చిన నీళ్లు ఓ బిందెలో—ఓ బల్లి చచ్చి తేలుతోంది.


కుండపోతగా వర్షం కురిసింది దీపం ముందు పెట్టుకుని బైబిలు చదువుకుంటూ కూర్చున్నాను మంచాని కెదురుగా గోడకు అమ్మ పెళ్ళిఫోటో. రెండు గదులను అమ్మ చాలా రోజులనించి వాడుకోనే లేదుట. వాటి గొళ్ళేలు తియ్యాలంటే ధైర్యం చాల్లేదు.

ప్రతి వుదయం — మధ్యాహ్నం — సాయంత్రం అన్నీ నా దిగులును రెట్టింపు చెయ్యటానికన్నట్టు ఒంటరిగా నిరవంగా కనిపించాయి ఈ అసుర సంధ్యల్లో దూరంగా ఏవో మూల్గులు, దగ్గులు, పొట్లాటలు, గొడవలు నా పశ్చాత్తాపాన్ని పెంచాయి అమ్మ అవారమెక్కడా కనిపించక పోయినా అమ్మ యింటిపనిలో చూపిన శ్రద్ధ, మూడేళ్ళుగా అమ్మ చేతుల్లో పెరిగిన నా బాబు ఆరోగ్యంగా నిద్దరోతో. ఈ సాయంత్రాలు నేను నగరంలో గడిపే సాయంత్రాలు కావు—కాలంలేని కాలంలోని ఓ బిందువు నాముందు నిలిచినట్లుగా బాధగా - బాధ కింది ఆశ - బాబు నా ఒళ్లో. ఓ సాయంత్రం నించి మరో సాయంత్రానికి ఇలాగే గతాన్ని మరచి పోతో, నెమరేసుకుంటో

7తసారి నే నిక్కడకు వచ్చినప్పుడే అమ్మ అంది

'నువ్వక్కడెలా గడుపుతుంటావో నాకు తెలుసే నీకన్నా నాకు బాగా తెలుసు నా తమ్ముడవే స్వార్థంతో నీ ఖర్మ యిలా వాల్చాడని వేనేడవని రోజులేదు నువ్వు మళ్లీ నీ యిష్టమైన వాణ్ణి పెళ్లి చేసుకున్న దాకా నాకు శాంతి వుండదు తల్లీ. ఆ వెధవ యింకెప్పుడూ రాడే. వాడురాడు, రాడని నీకూ తెలుసు నేను చచ్చినా వాడురాడు నీ బతుకిలా నిప్పుల పాల్చేసి వెళ్లిన వాడు యింకే మొస్తాడు. నీ కెలా చెప్పనే, నీ వంటి ఆడది ఒంటిగా వుండ కూడదు.'

తన తమ్ముడు, భాస్కరరావుతో అమ్మ నన్ను పెళ్లి కొప్పించిందే కాని, ఆ తర్వాత తను పశ్చాత్తాప పడని రోజులేదు నిజానికి అతడు నన్నెప్పుడూ ఆదరంగా చూడలేదు అప్పటి దాకా ఎక్కడో మెకానిక్ పని చేస్తున్న అతను నేను నర్సునయాగానే అది కూడా మానేసి పైగా పనీసుగా తిరిగేడు. అతనికి నేనంటె ఒక్క రవ్వంతైనా ఆదరం అభిమానం లేదని మాతో గడిపిన నెల రోజుల్లోనే అమ్మ కూడా తెలుసు కుంది నన్ను డబ్బుకోసం అడగటం, యివ్వకపో




కలలో హరివిల్లు

పౌడలు మొహ మాలూంతో ప్రారంభమై విష్కారాలకు దిగి చివరికి బలవంతంగా తాళం విరగ్గొట్టి రేషన్ కోసం వుంచిన డబ్బులు కూడా తీసికెళ్ళి అన కోసం ఖర్చు పెట్టుకోవటం దాకా పోయింది. మందలిస్తే అమ్మను కూడా ఖాతరు చెయ్యలేదు. అప్పుడే అమ్మ ఏడుపు మొదలైంది. అతనికి నేను కాకపోతే మరో ఆడది దొరికింది. బాబు కడుపులో వుండగా ఓనాడు తాగి వచ్చేడు—నా దగ్గిర చిల్లి గవ్వకూడా లేదు—సిగ్గు లేకుండా అప్పటికే నాకు తెలిసిన వాళ్ళందరి దగ్గిరా అప్పు చేశాను—నాతో మాట్లాడకుండా వెళ్ళి పెట్టె తీసిచూశాడు. కనిపించలేదు. నన్నడిగాడు. నాకు వళ్ళు మరిచే కోపం వచ్చింది—నిజానికి అతణ్ణి నేనెన్నడూ హృదయ పూర్వకంగా ప్రేమించలేదు. కాని భార్యగా నా విధి నిర్వహణలో ఎన్నడూ లోపం రానివ్వలేదు! అతను అది కూడా చూపించక పోవటం ఆనాడు నా జుగుప్సను పరాకాష్ఠకు తెచ్చింది. నోటి కొచ్చి నట్లల్లా దూషించాను. మామూలుగా నన్ను బూతులు తిట్టవలసిన అతను ఆనాడు ఏమీ జవాబివ్వలేదు. కాసేపు అలాగె నించుని 'తలుపు దగ్గిరేసుకో' అని వెళ్ళి పోయాడు. అంతే! ఈనాటి వరకూ మళ్ళీ అజ తెలియదు.

ప్రసవానికి నర్సింగ్‌హోంలోనే వుండ మన్నారు మాథుర్‌గారు. కాని నాకు నగర మంటేనే భయం పుట్టింది. అమ్మతో పాటు యిక్కడికొచ్చాను. ఇదే వరండాలో కూర్చుని తీరికగా ఏడ్చేదాన్ని. ప్రసవమైందాకా వూరుకున్నది అమ్మ. బాబుపుట్టి సంవత్సరం తిరక్కుండానే 'అమ్మాయ్, ఎన్నాళ్ళిలా వుంటావు?' అని మొదలెట్టింది...మళ్ళీ ఆ మాటెత్తితే వురి పోసుకు చస్తానన్నాను. కాని అమ్మ మాన లేదు నేను వురిపోసుకోనూ లేదు. చాల విచిత్రంగా నేను పడుకున్నప్పుడు భాస్కర రావు నా మనసులో కొచ్చేవాడు. అసలు ఆ జ్ఞాపకమే బాధగా వుండాల్సింది. కాని అదేమీలేదు. ఫోటో చూస్తే తప్ప ఆయన మొహం ఎలావుండేదో జ్ఞాపకం రాక పొయ్యేది. ఏవేవో ఆకారాలు వచ్చేవి. కాని ఏవీ ఆయనలా తోచేవి కావు. ఆ కంఠం మాత్రం యింకా విన్పిస్తున్నట్టుగా వుండేది. మా ఎకరం పొలంమీది ఆదాయం ఎక్కువరోజులు రాలేదు. నేను మళ్ళీ ఉద్యోగం చేయాల్సిందే అంది అమ్మ దూర మాలోచించి. చంటివాణ్ణి దగ్గిరేసుకుని తను ఇక్కడే వుంటానన్నది.

తొమ్మిదోరోజు గడిచింది. సమాధి కూడా నిర్మించారు. సమాధిమీది శిలువ నే నెన్నడూ అర్థంచేసుకోలేని త్యాగాలుచేసి మౌనంగా వెళ్ళిపోయిన అమ్మగా తోచింది. ప్రశాంతమైన ఆ వేపచెట్లనీడలో శిలువ ముందు పూలగుత్తితో మోకరిల్లాను.



స్టేషన్లోకి రైలు వచ్చింది, ఆగింది.

దిగేవాళ్లని దిగనివ్వకుండ కొందరెక్కారు. ఎక్కేవాళ్లని ఎక్కనివ్వకుండా కొందరు దిగారు.

ఎవరో ముసలమ్మ. మోకాడుకాళ్ల ముసల్ది.

అదుగో, వస్తోంది గబగబ -- రైలెక్కాలని.

విగిల్ కొట్టాడు గార్డు. వూగాడు వచ్చు జెండా.

ఆ—ఆ—ఆ—వచ్చింది—వచ్చేసింది ముసలమ్మ—గబగబ—

రైలు కూసింది, కదిలింది, కదిలేసింది.

ఎక్కూ ఎక్కూ అన్నారు కొందరు.

వద్దూ వద్దూ అన్నారు మరికొందరు.

రైలు కదిలింది. సాగిపోయింది.

అన్నట్టు—ముసలమ్మ?— ముసలమ్మ ఎక్కిందా?—

లేదు, లేదు. ఎక్కబోయి పడింది—కింద. రైలెక్కబోయి కిందపడింది పాపం.

'చెబితే విన్నదా? కావలసిందే శాస్తి' అన్నారు కొందరు.

'అయ్యోపాపం!— రామరామా!!—' అని మరికొందరు.

'అయినా — ఈ వయస్సులో ఇంకా ప్రయాణమేమిటి?'—అని సానుభూతి పరులు.

ఎవరేమనుకున్న ముసలమ్మ ప్రయాణం మటుకు మానలేదు. రైలు ప్రయాణం కాదు.—పెద్దప్రయాణం.....

*   *   *

స్టేషన్‌పక్కనే ప్రసూతి గృహం.

'కేర్ కేర్'మని ఏడుపు.

అప్పుడే పుట్టిందో పాపాయి!—

'అదుగో—ఈ జీవుడు అప్పుడే అక్కడ అవతరించింది' అన్నాడు, ఓ గెడ్డం స్వామీజీ, జ్ఞాన చక్షువు తెరచి. ఈ పరమ రహస్యం వెల్లడించిన ఆ సన్యాసి వెళ్ళిపోయాడు.

*   *   *

కిట కిట కిట కిట.....

ప్రసూతి గృహం నిండ జనం! జనం!!—

డాక్టర్లు, నర్సులు— ఎవరు చెప్పిన కదల్లేదా జనం.

పోలీసులు రాగనే పోపొమ్మంటూ పారిపోయ్యారు.

పత్రికల వాళ్ళొచ్చారు. ఫోటోలు తీసుకున్నారు.

మర్నాడు పేపర్లో వార్త:

'ముసలమ్మ పునర్జన్మ— ప్రత్యక్ష నిదర్శనం— పోలీసు లాటీచార్జి— పదిమంది గాయాలు, ముగ్గురి స్థితి ప్రమాదం—

(మరికొన్ని వివరాలకు 13వ పేజీ చూడుడు).

బాబాయి యెప్పుడే వస్తానని వెళ్ళిన రాత్రి కెళ్ళాడు లాంపులో కిరోసిన్ ఐపోయింది. బాబాయి వచ్చిందాకా ఇలాగే కూర్చో వాలి చీకటిగది బాబు ఏడ్చి ఏడ్చి పడుకున్నాడు గది వూడవలేదు. బాబు చీపురు కట్టకు కట్టిన దారం తెంచేశాడు పుల్లలన్నీ చిందర వందరైనాయి గది యిరుకుగా ఎడారిగా తోచింది. కళ్ళు మూసినా తెరచినా కటిక చీకటిగా వుంది కోరికలు కర్పూరంలా హరించి పోయాయి బ్రతుకు యిబ్బందిగా తెలిసి చేసిన తప్పగా తోచింది ఓక్షణం.

చలివేసింది. బాబు దుప్పటి తన్నేసు కున్నాడు దూరంగా కుక్క లేడుస్తున్నాయి అరుబయట జయకరం బాబాయి దగ్గు విన్పించింది. పక్కింట్లో ఎవరో నీళ్ళు తోడుతున్నారు — క్వార్టర్స్‌లో కట్టేసిన కొళాయిలోంచి సన్నగా నీళ్ళు కారటం జ్ఞాపకం వచ్చింది—అతిదూరంగా ఎక్కడో రైలుకూత. ఓదార్పు వంటి ఈ చీకటి

రేపు వెళ్ళాలని నిశ్చయించుకున్నాను.

ఇంటికి తాళం వేసెయ్యకండా, బాబాయి వాళ్ళకు ఎట్లాగూ వాళ్ళిల్లు సరిపోవటం లేదు కనక యిక్కడికే వచ్చి వుండమన్నాను అమ్మ కోరికగా బాబాయి మళ్ళీ నా పెళ్ళి విషయం జ్ఞాపకం చేశాడు కొద్ది రోజుల్లో నా నిర్ణయం తెలియ చేస్తానని చెప్పాను. •

కన్నీళ్ళతో వీడ్కోలు చెప్పేరు బాబాయి, పిన్ని

రైలు దిగగానే బాబుతోసహా సరాసరి నర్సింగ్‌హోం కెళ్ళాను. అమ్మ మరణం పట్ల డాక్టరుగారు బాధ వ్యక్తం చేశారు వే నడక్కుండానే,

'ఆనందప్రసాద్‌ను డిశ్చార్జ్ చేశాం సుశీలా, నిన్నడిగానని చెప్పమన్నాడు. తన కిక్కడ బావుండటం లేదుట. లాంగ్‌లీవ్ పెట్టి మద్రాసు వెళ్ళాడు. బ్యాంక్‌లో ప్రయత్నించి అక్కడికే ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటాడుట' అన్నారు.

నా కళ్ళకున్న గంతలేవో విప్పేకున్నట్లుగా తోచింది.

బాబును గుండెం కదుముకుని 'ఈ బ్రతు కిలా గడపనీ ప్రభూ!' అనుకున్నాను. ●

చూడొచ్చా!




కె. రామలక్ష్మి

కనిపించిన ప్రతి పత్రికా, పుస్తకం తెచ్చి చర్చించుకోవడం పరిపాటే. వేదు వదవనివద్యం మంచిదేనా? పిల్లలు చాడి ... న్న పుస్తకాలోనూ పత్రికలలోనూ, పోరా ఆవి స్నేహితులు కలుసుకున్నప్పుడు బొమ్మలలోను కూడా పిల్లలు చదవచ్చు,

డాక్టర్ కబుర్లు

మూర్ఛ వచ్చేవారికి హడావుడి ఇష్టం ఉండదు

మూర్ఛ వచ్చేవారు అధికంగా కోరే దేమిటి? తమపట్ల అతిశ్రద్ధ, సానుభూతి ఎవరయినా చూపిస్తే వారికి ఇష్టం ఉండదు తమనీ అందరిలాగే



4.

పరిగణించాలని వారు అంటారు మూర్ఛ వచ్చినవారి వద్దకి వెళ్లి పెద్ద హడావుడి చేస్తే తమని రోగులలాగ చూసి నట్టేకదా అనిపిస్తుందివారికి పిల్లల సంగతీ ఇంతే

ఇంకొక విషయం— మూర్ఛ వచ్చినప్పుడేకాదు మామూలుగా ఉన్నప్పుడయినాసరే అతిశ్రద్ధ వారికి ఇష్టం ఉండదు మూర్ఛ వచ్చిన వారికి బాధ ఉండదు, కిందపడిపోకుండా, పొరపాటున నాలిక కరుచుకోకుండా వారిని కాపాడాలి, అంతే

అవసరమయితే బట్టలు వదులు చెయ్యాలి వెల్లికిల్లా, బోర్లా కాకుండా పక్కగా పడుకో పెట్టాలి అంతకి మించి చికిత్స వేరే అనవసరం కొన్ని నిముషాలలో మూర్ఛ వచ్చిన వ్యక్తి మామూలు మనిషి అయిపోవటం జరుగుతుంది అనవసరంగా విశ్రాంతి తీసుకొమ్మని బలవంతం చెయ్యరాదు మూర్ఛ వచ్చిన వ్యక్తి యధావిధిగా తన పనులు చేసుకోవచ్చు

మూర్ఛ వచ్చేవారు తమ ప్రాణాలకి, ఇతరుల ప్రాణాలకి హాని కలగనిచ్చే వృత్తులు, పనులు చెయ్యకుండా చూడాలి ఇదొక్కటే గమనించవలసిన విషయం

హెచ్ ఎల్. హెర్షెన్ సాన్

(ఇంకావుంది)

చూడొచ్చా కూడదా అన్న జిజ్ఞాస రేకెత్తించేవి చాలానే వస్తున్నాయి. కాని మనచుట్టూ వ్యాపించిఉన్న వాటిప్రభావం నుంచి పిల్లలని ఎలా రక్షించడం? ఎంత కాలం? అన్న ప్రశ్నలు ప్రతి తల్లినీ వేధిస్తాయి. వాటిని చదివీ చూసే పిల్లలు చెడిపోతే? ఎవరు బాధ్యులు అన్నది కూడా తెగని సమస్యే. ఎదిగే పిల్లలకి గంతలు కట్టి తిప్పలేంకదా!

తల్లి తండ్రులిలాంటి విషయాలను గురించి బెంగపడడం సహజమే. కాని ఇంట్లో ఆరోగ్యకరమైన వాతావరణంలో సంతృప్తిగా పెరిగిన పిల్లలని ఈ పైపై విషయాలు ప్రభావితం చేయలేవంటారు.

పిల్లల దృష్టిని ప్రతి విషయం ఆకర్షిస్తుంది. అటువంటప్పుడు అటువంటి ఆకర్షణలతో నిండి ఉన్న పరిసరాలనుంచి వారిని దూరం చేయడం మన తరం కాని పని. కాని మనం చేయకలిగినది ఒకటే. పిల్లలకి మన సంస్కృతిపట్ల మన జీవితపు విలువలపట్ల విజ్ఞానం సమకూర్చడమే అది సరైన దేమిటవి తెలిసి ఉన్న కుర్రాడు ఇటువంటి ఆకర్షణలని చూస్తాడేగాని అంతగా పట్టించుకోడు. పిల్లలు తమ తల్లితండ్రులని నమ్మి నంతగా ఎవరినీ నమ్మరు ఎవరి మాటా విశ్వసించరు తల్లితండ్రులు వారి ప్రశ్నలకు సరైన సమాధానాలు యిచ్చి, వారి ఆలోచనలని సరైనదారికి మళ్ళించి నట్లయితే అసలే బెంగా ఉండదు. జీవిత సత్యాలు వ్యక్తిగత ప్రవర్తన, సరైన విలువలు, భేషజం లేకుండా చర్చించి వివరించినట్లయితే పిల్లలు చక్కని దృక్పథం ఏర్పరచుకుంటారు. అటువంటి పిల్లలని ఈ పై ఆకర్షణలు అంతగా ప్రభావితం చేయవు.

కుటుంబ వాతావరణం ప్రామాణికంగా పిల్లలు పై విషయాలని కొలిచిచూస్తారు. అందుకే ఇంట్లో ఎప్పుడూ 'తక్కువ తనం గాని, మన పిల్లలు నేర్చుకోకూడని ప్రవర్తనగాని ఉండకూడదు అలాంటప్పుడే కుర్రాడు స్కూల్లోగాని స్నేహితులద్వారా గాని విషాదకరమైన జీవిత విధానాలని గురించి సభ్యతకు దూరమైన ప్రవర్తనలను గురించి విన్నా చూసినా భయపడి పోడు వాటిని అనుకరించాలన్న కుతూహలం కూడా ప్రదర్శించడు.

నా స్నేహితురాలొకామె పదిహేన్నండేళ్ళ తన కూతురు చదువుతానంటే ముందు తను చదివి బాగుంటే యిచ్చేది. ఇంకా ఫెరారం-పత్రికలూ, కొన్ని పుస్తకాలూ అట్టలు తీసేసి చూడమని యిచ్చేది. 'ఇదేమిటి' అని అడిగితే అలాంటి చెత్త లాంటి బొమ్మలు అవీ చూస్తే చెడి పోరా?' అని అడిగింది. 'మరి స్కూలుకి వెళ్ళేదారిలో గోడలమీది బొమ్మలు చూడరా మీ పిల్లలు?' అని అడిగేదాకా, యింట్లోనేకాక యితరత్రా కూడా పిల్లల చేతికి మనం వద్దన్నవి అందుబాటులో ఉంటాయని గ్రహించలేకపోయిందా యిల్లాలు. అందుకే పిల్లలకి సరైన విలువలు తెలియచెప్పే బాధ్యత తల్లి వహిస్తే అవుట్‌సైడ్ ప్రభావం అంతగా వారిపై ఉండదనడం ●

వంటలు:

వెజిటబుల్ పులావు

3 గ్లాసుల బియ్యం
చిన్న కాలీఫ్లవరు
రెండు పెద్ద బంగాళాదుంపలు
కప్పు బటాణీలు
రెండు ఉల్లిపాయలు
కొంచెం చిక్కుడు కాయలు
చిన్న అల్లం ముక్క
రెండు ఏలకులు
రెండు లవంగాలు
ఒక చెంచా మిరియాలు
నెయ్యి, ఉప్పు


కూరలన్నీ చిన్నముక్కలుగా తరిగి ఉంచుకోవాలి. బియ్యం కడిగి వార్చాలి. ఉల్లిపాయలు సన్నంగా తరిగి వెడల్పాటి బాణలిలో దోరగా వేయించుకోవాలి కూర ముక్కలు కూడా దోరగా వేయించి అట్టే పెట్టుకోవాలి తరువాత దాల్చిన చెక్క, ఏలకులు, లవంగాలు వేగనిచ్చి వార్చిన బియ్యం వేసి కొంచెంసేపు వేగనివ్వాలి బియ్యం వేగాక మరుగుతున్న నీళ్ళు అత్తెసరుకు సరిపడేలా పోసి ఉప్పువేసి మూతపెట్టాలి నీళ్ళు ఇగిరిపోయాక వేయించిన కూరముక్కలు, ఉల్లిపాయ ముక్కలు వేసి బాగా కలియబెట్టి దింపుకోవాలి. అన్నం చడిలేకుండా పొడిపొడిగా ఉడికేలా చూసుకోవాలి. ఇది ఐదుగురికి సరిపోతుంది. దీనిలో నంచుకుందుకు పుదీనా పచ్చడి రుచిగా ఉంటుంది.

పుదీనా పచ్చడి

రెండు కట్టలు పుదీనా
ఒక ఉల్లిపాయ
పచ్చిమిరపకాయలు రెండు
కొబ్బరికోరు రెండు స్పూన్లు
రెండు చెంచాల వేడిపాలు
అరకప్పు పెరుగు
తగినంత ఉప్పు.

పుదీనా ఆకులు సన్నగా తరిగి కడిగి ఉంచుకోవాలి. పచ్చిమిరపకాయ, ఉల్లిపాయ సన్నగా తరిగి ఉంచాలి. కొబ్బరి కోరు వేడిపాలలో కొంచెం సేపు నాననివ్వాలి. పెరుగు చిలికి తగినంత ఉప్పు వేసి పుదీనా, కొబ్బరి, పచ్చిమిరప అన్నీ ఈ పెరుగులో వేసి కలియ బెట్టాలి. కావలిస్తే పోపు వేసుకోవచ్చు వేయక పోయినా బాగుంటుంది.

— మంత్రవాది వాసంతి ●





కొత్తసీరియల్ ప్రారంభం

సీరియల్

హృదయం చిగిర్చింది

కె. రామలక్ష్మి

కాలేజీ లేడీసు హాస్టలులో పిల్లల జీవిత వేగం చాలా గమ్మత్తుగా ఉంటుంది. విశ్రాంతిగా ఉండి చదువుకుందుకని హాస్టలులో చేరుతారా? అబ్బే! ఒక్కరికి ఓక్షణం తీరిక ఉండదు. పోనీ అని చేద్దామంటే పనీ ఉండదు! అదేగమ్మత్తు! ఒకళ్లరూమునుంచి ఇంకొకళ్లరూముకి తిరుగుతూ పెళ్లివారి హడావిడిలో ఉంటారు అమ్మాయిలు. ఉదయంపూట లేచింది మొదలు—స్నానాల హడావిడి తరవాత టిఫిను హడావిడి. అక్కణ్ణుంచి నెమ్మదిగా ఏం చీరకట్టాలి? ఎవరిది ఎవరు కట్టుకోవాలి? అంటూ తర్జన భర్జనలుచేస్తారు. విగారెక్కడా చూడనిపొత్తు ఇక్కడ కనిపిస్తుంది ఆడవాళ్లమధ్య—తనింకా కట్టి చూడని చీరకూడా స్నేహితురాలికి కట్టపెట్టి ఆనందిస్తుంది. చాకలి బట్టలు తేవడమే తరవాయిగాని మాపడం క్షణం సేపు పట్టదు. అప్పణ్ణుంచీ మొదల్లు—ఈ అమ్మాయి చీర, ఆ అమ్మాయి రవిక తొడగడం. దాన్లో ఓసరదా సన్నిహితం ఉంటాయి. బట్టలు వేసుకుంటూనే క్లాసు పాఠాలకంటే ఆనాటి కార్యక్రమాల వివరణ ఎక్కువగా సాగిపోతుంది. ఆ మధ్యలో ఎవరేనా 'ఈ రోజు ఫిజిక్సు పరీక్ష' అంటే ఆగొంతు కాస్తా నులిమినంతపని చేస్తారు! స్నేహితురాళ్ల కష్టసుఖాలు తమవైనట్టు పంచుకోవడం, ఉన్న నాలుగుడబ్బులూ ఎక్కువ రోజులు ఎలా ఖర్చుపెట్టుకోవడమో నేర్చుకోవడం, ముఖ్యంగా రకరకాల మనస్తత్వాలవారితో కలిసిమెలిసి తిరగడం మూలంగా ఎంతో ఉపయోగం సాధిస్తారు అమ్మాయిలు. నిజానికి కాలేజీలో చెప్పే పాఠాలకంటే యీ సహజీవనం నేర్పే పాఠమే తరువాతి జీవితంలో ఎక్కువ ఉపయోగిస్తుందేమో!

సరళ హాస్టలుకి పాతకాపు. రెండేళ్ళుగా అక్కడే ఉంటూ పరీక్షలురాస్తూ కాలక్షేపం చేస్తున్న కలవారిపిల్ల. అసలు భేషజంలేని మనిషి. ఉదయం టిఫిను ముగించి స్నేహితులతో తీవ్రంగా చర్చిస్తోంది ప్రేమ వివాహాల గురించి, ఆదర్శవరుల గురించి—యింకా ఎన్నిటి గురించో! ఇంతట్లోకే వార్డెను కబురంపింది. డైలాగు ముగించి వార్డెను రూముకి పరుగెత్తింది సరళ.

వార్డెను గదిలో కొత్తవాళ్లెవరో ఇద్దరుండడంతో గుమ్మంలోనే నిలబడి 'పిలిచారా మేడమ్?' అడిగింది.

'రా సరళ, నీ రూములో ఓ ప్లేసు ఖాళీ ఉందిగా—ఈ అమ్మాయిని ఎలాట్ చేస్తున్నాను. కొంచెం అలవాటయేదాకా నీతోనే తిప్పుకో.' అంటూ పక్కకు తిరిగి కొత్తమ్మాయిని పరిచయం చేసింది.

'రమ ఈ ఏడే కాలేజీలో చేరుతోంది. మధ్యలో చదువుమాని తిరిగి మొదలు పెట్టుతోంది. కొంచెం కొత్తగా ఫీలయినా నువ్వే చూసుకోవాలి' అంటూ అప్పగింతలు చదివింది. 'ఈయన ఈమె బావగారు తీసుకువచ్చి దించారు' అంటూ కుర్చీలో కూర్చున్న వ్యక్తిని పరిచయం చేశారు వార్డెను.

కళ్ళు విప్పార్చి చూసింది సరళ. కాలేజీకి కొత్తగా వస్తున్న అమ్మాయి. అందులోకూడా బావ! ఈ వార్త స్నేహితులతో చెప్పాలని తహతహలాడి పోతోంది లోపల.

'నమస్తే' అంటూ సవ్యంగా నమస్కరించింది.

'నువ్వు రమను తీసుకువెళ్ళు, నేను సామానుపంపిస్తాను' అని 'నీపనయింది వెళ్లిపోవచ్చు' అన్నట్టుచెప్పేశారు వార్డెన్.

'కమ్'—అంటూ దారితీసింది సరళ.

'నే ఉంటాను బావా, ఉత్తరాలు రాస్తూండు' అంటూ సరళవెనక నడిచింది రమ. రెండేసి మెట్లు చొప్పున రెండో అంతస్తులోకి ఎక్కేసింది సరళ.

'గుడ్ న్యూస్' అంటూ తన గదిలో వాళ్లందరికీ ఓహెచ్చరిక పారేసింది. గదిలో పోగయిన అయిదారుగురు గుమ్మం ముందుకి వచ్చి నిలబడ్డారు. నెమ్మదిగా గది గుమ్మం దాకా వచ్చి ఆగింది రమ. 'నా కొత్త రూమ్‌మేట్ రమ' అంటూ పరిచయం చేసింది. 'రా లోపలికి' అంటూ గదిలోకి తీసుకువెళ్లి మంచంమీద కూర్చోపెట్టింది. రమ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఈ అమ్మాయి అందరితోటి నేను కలిసి మెలిసి ఎలా ఉండకలను? అని ఆలోచించుకుంటుంది. రమ ఉనికినే మరిచి వదిలేసిన తర్కం తిరిగి ప్రారంభించారు స్నేహితురాళ్లు.

'చూడగానే ప్రేమించాట్ట ఫూలో! ఉత్తరం కూడాను వాడి ముఖానికి!' విప్పలు కక్కింది సరోజ.

'పోనీలేవే పాపం! ఆ మాత్రం ధైర్యం చేసినందుకు రామ్మూర్తికి విక్టోరియా క్రాసు యిచ్చి ఉండొచ్చు' వాచ్చుకుంది సరళ.

'ఆ రోజు కారోజా అలాగే 'నీ ఆదర్శ వరుడెలా ఉండాలి? అంటూ వెధవ ప్రశ్న వేశాడు.'

'నిజమే. తీరా అలాంటి ఆదర్శ పురుషుడొకడు నిన్ను చూస్తే నీవు వాడికాదర్శ ప్రాయం కావాలిగా? అదే బదులు చెప్పవలసింది నువ్వు' అని తనకి తోచింది చెప్పింది నళిని.

'మనకే ఈ కష్టాలు—హాయిగా ఈ రమకి బావ ఉన్నాడు' అంది సరళ.

రమ ఆ మాటకి అదరిపడింది.

మరుక్షణంలో కళ్ళు నీళ్లతో నిండిపోయాయి.

సరళ బిత్తరపడి పోయింది.

'క్షమించు ప్లీజ్, ఏదో నా సరదా ధోరణిలో అనేశాను.' అంటూ ప్రాధేయపడ్డం ప్రారంభించింది. వాతావరణంలో మార్పు గ్రహించిన మిగిలినవాళ్ళు నెమ్మదిగా జారుకున్నారు. సరళ ఎంతో ప్రాధేయపడ్డ మీదట సర్దుకుని కళ్ళు తుడుచుకుంది రమ. ఈ పిల్లల మాటలు చేష్టలు, చిలిపితనం చెలాకీతనం తనకెలా వస్తాయి? అనుకుంది. వీరి మధ్య ఎలా బ్రతుక్కు

రావడం? అనుకుంది.

ఆ రోజు సరళే కూడా ఉండి కాలేజీకి తీసుకు వెళ్ళింది రమని.

తెలుగుకి కొత్త లెక్చరర్ వస్తారట— అప్పటిదాకా తెలుగు క్లాసు ఫ్రీ రూముకి పోవచ్చు' నంటూ వివరించింది

పదిరోజులు హాస్టల్లో గడిచే సరికి రమ మిగిలిన వారితో ఒకటై పోయింది ఆ పదిరోజులలో సరళా రమా చాలా సన్నిహితులై పోయారు ఏకాంతం లభించిన ఆడపిల్లల్లాగే ఒకరి విషయాలొకరు ఒకరు చెప్పుకున్నారు. ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకున్నారు. సరళ రమకి బాడీగార్డులా తయారైంది. రమది అందమైన విగ్రహం హుందాగా నడుస్తుంది. అలాంటి అమ్మాయిని అందరూ చూడక మానరు. అడ్మయిర్ చెయ్యకా మానరు రమ కిదంతా కొత్త అనిపించినా సరళ తేలికగా కొట్టి పారేస్తూ ఏదీ తీవ్రంగా వేధించకుండా చూస్తుండడంతో మరీ అంత బాధ అనిపించడంలేదు. జీవితంలో కొత్త ఉత్సాహం, చురుకు ఏర్పడ్డాయి'

'తెలివైన పిల్ల' అని నలుగురు లెక్చరర్ల చేతా అనిపించుకోవడంతో ఎవరూ లోకువచేసి మాట్లాడే అవకాశం చిక్కలేదు—రమని.

ఆ రోజు కాలేజీలో అడుగెట్టగానే నళిని ఆత్రంగా సరళని పక్కకి పిలిచి 'కొత్త తెలుగు లెక్చరర్ వచ్చేశారు అబ్బ! సూపర్బ్!' అంది

'అలాగా! అయితే ఈ రోజు పాఠం చెప్తారుగా?' ఆ క్లాసు కోసం ఎదురు చూస్తూ అడిగింది సరళ.

'ఓ' అంటూ తన పనైపోయినట్లు వెళ్ళిపోయింది నళిని

రామారావు లెక్చరరుగా రావడం కొత్తే, గాని పాఠాలు చెప్పడంలో కొత్తగా ఫీలవలేదు. ఆ రోజు క్లాసులో పిల్లి అరుపులూ, దరువులూ అన్నీ దాటుకుని రామారావు చెప్పిన పాఠం రక్తి కట్టింది

రమ చాలా కుతూహలంగా పాఠం వింటూంది కాని లెక్చరరుగారు తననే కన్నార్పక చూస్తున్నారన్న సంగతి గ్రహించలేక పోయింది కాని అలాంటి విషయాలు సరళ ఇట్టే గ్రహిస్తుంది! పైకి కనబడకుండా రమని చిన్నగా గిల్లింది క్లాసు అయిపోగానే లెక్చరర్ దగ్గరికి పనికట్టుకుని వెళ్ళింది.

'నిన్న క్లాసులో నా తెలుగు పుస్తకం పోయింది మేష్టారూ, ఎవరేనా చూశారేమో అడుగుతారా?' అడిగింది

క్లాసుని ఆపి రామారావు అదే సంగతి అడిగాడు ఆకతాయి కుర్రాళ్ళో పదిమంది పది పుస్తకాలు ఆఫర్ చేశారు!

రామారావు నవ్వుతూ క్లాసు వదిలేశాడు. పోనీ నాపుస్తకం పట్టుకెళ్ళి చదువుకో— రేపు క్లాసుకి తేడం మరచిపోకు' అంటూ 'ఔను నీ పక్కనున్న అమ్మాయి నీకు తెలుసా?' అప్పటికీ కుతూహలాన్ని అణచులేక రామారావు అడిగేశాడు

'అక్షనుసార్' నారూమ్మేటు, ఫ్రెండు' అంది సరళ.

ఆరోజుమొదలు రామారావు ఎన్నో విధాల రమ దృష్టిని ఆకర్షించాలని చూస్తూనే ఉన్నాడు ఏంప్రశ్న అడిగినా ముభావంగా సమాధానం చెప్తుందే గాని ఎదుట ఒకో మనిషి ఉన్నట్టయినా చూడని రమతో మాట్లాడలేక పోయాడు. పోనుపోను ప్రత్యేకశ్రద్ధతో రమకి నోట్సు తయారుచేసి, పేపరుదిద్ది తప్పులు ప్రత్యేకం పిలిచి చూపించి—తంటాలు పడసాగాడు.

మేష్టారి ధోరణి సరళ కనిపెట్టింది. కాని రమని రక్షించే ప్రయత్నం చెయ్యలేదు సరికదా రమా మేష్టారి వశానికి వెళ్ళిపోయింది ఎంత తప్పించుకు తిరుగుతున్నా ఏదోవంకని రమని పలకరించడం మానలేదు రామారావు ఏ వెయిటింగు రూము దగ్గరో, హాస్టలునుంచి కాలేజికి వస్తున్న దారిలోనో 'హల్లో'అంటూ పలకరించేవాడు

'నమస్కారం మాష్టారూ' అనడానికి మించి ఎప్పుడూ అధికంగా రమ మాటాడలేదు కాలేజీ అమ్మాయిలూ, అబ్బాయిలూ వీరిద్దరిగురించి తాపత్రయం ఓకంట కని పెడుతూనే ఉన్నారు అది వాళ్ళ హాబీ

రామారావు అందంగా ఉండటమే కాక చాలా తెలివైనవాడూ చాలాబాగా లెక్చర్ చేస్తాడన్న పేరు పడిపోయింది—వచ్చిన రెండు రెండున్నర నెలలలోనే

అందుకే సెక్షని కాస్త వెనకాతల గ్

చేసినా బహిరంగంగా అల్లరి పెట్టడాని కింకా పూనుకోలేదు.

రోజూ కాలేజికి రావటం అంటే భయం పట్టుకుంది రమకి.

రాకుండా ఉండలేకుండా ఉంది ఈ సత్యంకూడా సరళ పసికట్టింది

'తెలుగు మేష్టారిపోరు మరి భరింప రానిదిగా ఉందికదూ?' అంది తేలికగా.

'పోరేం కాదుగాని ఆయనది చాలా అమాయకమైన ధోరణిలా ఉంది సరూ, లేకుంటే బాధ్యతగల ఒక లెక్చరరు పదవిలో ఉంటూ అలా కాలేజి విద్యార్థిలా ప్రవర్తిస్తారా?'

తనకు తోచినది అంది రమ.

'అయితే ఆయన అసభ్యంగా ప్రవర్తించడం లేదంటావు?'

'ఛ ఛ ఆయనలా ప్రవర్తించకలరని నేను అనుకోను.' అంది కచ్చితంగా

'అయితే ఇంకనేం? ఆ సంగతి మేష్టారికి నన్ను చెప్పమంటావా? నువ్వే చెప్తావా?'

వెటకారంగా అడిగింది సరళ.

'ఏ సంగతి?'

'మీ ప్రవర్తనకేం అమోఘంగా ఉంది అన్న సంగతి' నవ్వింది సరళ

'నీ కన్నీ వేళాకోళమే ఆయన పాఠం చూడు ఎంత బాగా చెప్తారో! మళ్లీ పుస్తకం చదవనక్కరలేదు.

'అది నీలాంటి ఏకసంతగ్రాహికి. నాలాంటి హోప్‌లెస్ కేసుకి కాదులే

'నువ్వు మటుకు! పోయిన టెస్టులో మంచిమార్కులు రాలేదా?'

'వచ్చాయి అదేనా ఎంతసేపు రుబ్బాక!'

'రామ రామ! నాకీ చదువు ఒంటికి పడదు అలా అంటే మా నాన్నగారికి పడదు!'

తన కష్టాన్ని తలచుకుంటూ ఉసూరు మంటూ మంచంమీద వాలిపోయింది సరళ

సరళ పక్కనే కూర్చుంది రమ.

'ఈమాటు పరీక్షకి మనిద్దరం పోటీ పడి చదువుదాం ఏదే వస్తుంది' అంది ధైర్యం చెపుతున్నట్టు.

'అబ్బే లాభంలేదే చిట్టితల్లీ! నాకు పరీక్షలు పాసవ్వాలని ఉంటేకదా! ఇలాగే ఏ సంవత్సరానికా సంవత్సరం సరదాగా స్నేహితులతో గడిపేస్తూ ఉంటాను. చివరకి నాన్నగారికి ప్రాణం విసిగి ఏ ఇంటి పెళ్ళినోమాసి ఆమూడుముళ్లా వేయించేస్తారు. దాంతో నా జలుబు వదులుతుంది'

'అదీ నిజమేలే చదవాలని లేనివాళ్లకి ఆ బ్రహ్మదేవుడు కూడా పాఠాలు చెప్ప లేడు' అంది రమ.

'అది కాదే రమ. నీ దీక్షలో వందో వంతే నాకుంటే బాగుండునని అప్పుడప్పుడు అనిపిస్తూ ఉంటుంది కాని యేం లాభం? వచ్చి చావదు!' లేచికూర్చుంది సరళ.

'పోనిద్దూ. నాకైతే చదవక తప్పదు. నీకేం ఖర్మ హాయిగా ఉండు' అంటూ పొడుగాటి వాలుజడ విప్పడం ప్రారంభించింది రమ.

'సాయంత్రం బిచికేసి వెళ్లి అలా నడుద్దాం. త్వరగా తెములు' అంది సరళ.

'మరి నోట్సు?'

'అబ్బ, రేపు కాపీ చెయ్యొచ్చులెదూ!' అంటూ విసుక్కుంది.

మళ్లీ మాట్లాడకుండా తల దువ్వుకుని బట్టలు మార్చుకుంది రమ

ఇద్దరూ కిందికిదిగి సాయంత్రం టిఫిను అయిందనిపించి బిచికేసి నడిచారు.

ఏదో లోకాభిరామాయణం మాట్లాడుతూ అలా నీటి అంచున నడుస్తూంటే మనస్సు ఎంతో తేలిక పడట్టనిపించింది రమకి, 'నే నీ సరళంత నిశ్చింతగా జీవితాన్ని తీసుకోకలనా?' అని ప్రశ్నించుకుని 'అసంభవం' అని తనలోనే బదులు చెప్పుకుంది.

సరళ వేసే ప్రశ్నలకి బదులుగాను, తన హృదయంలోని భారం తగ్గిపోవడం కోసం ఎన్నో తన స్వంత విషయాలు, తన మనస్సులోని విషయాలతో కలబోసుకుంది రమ.


'నీ స్తబ్ధత వెనుక ఎంత విషాదం ఉంది రమా. ఇన్నాళ్ళ నిన్ను ఏడిపించుకు తిన్నాను, నన్ను క్షమించు' అంది స్నేహితురాలి భుజంపై చేయి వేస్తూ.

'అలా అనుకోకు సరళా. నువ్వింత సరదా అయినదానివి, సహృదయం కలదానివి నాకు దొరికావు కనుకనే యింకా పారిపోకుండా నిలబడి ఉండకల్గాను' అంది సరళ చేయి నొక్కుతూ.

సరళ తన మనస్సులోని ఏవేవో భావాలని చెప్పకుంది రమకి. 'జీవితం ఎప్పుడూ చీకటిగానే ఉండిపోదు రమా. మనం మనకే అవసరం అయితే చేయూత నిచ్చుకోవాలి' అంటూ రమకి ధైర్యం చెప్పింది.

ఆ రాత్రి కూడ స్నేహితురాళ్లిద్దరూ చాలాసేపు కబుర్లు చెప్పకున్నారు. కాని ఉదయానికల్లా రమకి బాగా రొంప చేసి జ్వరం వచ్చింది. దాంతో రెండు రోజులు కాలేజీకేసి చూడలేదు.

'ఆ రెండు రోజులూ తెలుగు లెక్చరరు గారు రెండు యుగాలుగా గడిపినట్టు గాలి వార్త' అంటూ సరళ న్యూస్ మోసుకు వచ్చి రమకి అందజేసింది నవ్వుతూ.



హృదయం చిగిర్చింది

'నువ్వు అన్నీ తెలిసీ అలాంటి వేళా కోళం చేయకు సరళా' అంది ముఖం కిందికి దించుకుని.

సరళ దగ్గిరికి వచ్చి బలవంతాన రమ ముఖం పైకెత్తింది.

వర్షించడానికి సిద్ధంగా ఉన్నాయి రమ కళ్ళు.

'నువ్వు మరీ యింత టచ్చీగా ఉండ కూడదు రమా, అఫ్టరాల్, నువ్వూ మాలాంటి దానివేనన్న సంగతి మరచి పోతావేం?'

'నేను మీ అంతటి అదృష్టవంతు రాలిని కాదుసుమీ, అందుకే' దుఃఖంతో పూడుకుపోయింది.

'నువ్వెప్పుడూ అలా అనకు నేను ఊరుకోను. నువ్వేం తప్పుచేశావని. ఇలా కృశించి పోయి బ్రతకాలి? రేపు కాలేజీకి రా, నువ్వే చూస్తావు' అంటూ తేలికగా లేచేసి ఊరుకుంది సరళ,

'ఏమిటే చూసేది?'

'రేపు వస్తావుగా నీకే తెలుస్తుంది'

అంతేగాని సరళ మేష్టారు ఓ పదిసార్లైనా రమని గురించి అడిగారన్న సంగతిమటుకు చెప్పలేదు!

పిరికితనంతోటే మరునాటి ఉదయం కాలేజీకి బయలుదేరింది రమ.

* * *

కాలేజీ కాంపౌండులో ఉదయంపూట ఉండే హడావిడి తిరిగి కాలేజీ వదిలాక సాయంత్రంకాని ఉండదు నడిచి వచ్చే వాళ్ళు; సైకిళ్ళమీద వచ్చేవాళ్ళు, కార్ల మీద వచ్చేవాళ్ళు రిక్షాలమీద, సైకిలు రిక్షాలమీద వచ్చి దిగేవాళ్ళు అందరిదీ ఒకటే హడావిడి. ఆ హడావిడిమధ్య స్నేహితులూ పలకరింపులూ, ముఖ్యమైన విషయాలు చెప్పుకోడాలూ జరిగిపోతూ ఉంటాయి.

అమ్మాయిల విశ్రాంతిగది ముందు తచ్చాడుతూ రమ రాకకోసం వేయికళ్ళతో చూస్తున్నాడు రామారావు. గంట కొడుతున్నారు. రమ కాలేజీ గేటు దాటి లోపలికి వచ్చింది,

'మరీ ఇంత లేటుగా వస్తుందేం యీ రమ? కొంచెం ముందుగానే రాకూడదూ' అనుకుంటూ రమకి ఎదురు వెళ్ళాడు.

'గుడ్‌మార్నింగ్ సార్' అంది రమ.

'గుడ్‌మార్నింగ్' ఏమిటి ఇంత ఆలస్యంగా వచ్చావు?' అడిగాడు రామారావు.

'లేదే జస్ట్ ఇప్పుడేకదూ గంట కొడుతున్నారు' అంది, వస్తున్న నవ్వుని ఆపుకొంటూ.

రమ విశాలమైన కళ్ళు ఆ ఆగిపోయిన నవ్వుని ప్రతిబింబించాయి.

'ఓ అరగంట ముందుగా వస్తే కొంచెం వివరించేవాణ్ణిగా రెండురోజులు రాలేదుగా ఇదిగో నీకోసం ఎస్సేలు' అంటూ చేతిలో ఉన్న పుస్తకం అందించాడు

'చాలా థాంక్సు మాష్టారూ, నేనూ సరళా చదువుకుంటాం' అంది రమ.

'రమా.'

'చెప్పండి మేష్టారూ' మాట మధ్యలో ఆగిపోయిన మేష్టారిని హెచ్చరించింది రమ.

అప్పటికే వాళ్ల చుట్టూ అక్కడక్కడ గుంపులుగా స్టూడెంట్లు చేరారు రకరకాలుగా కబుర్లు చెప్పుతున్నారు. దొంగ చూపులు చూస్తున్నారు. వారు మాట్లాడుకునేదేమైనా వినబడుతుందేమో అని చెవులు రిక్కించుకున్నారు ఇక అమ్మాయిలు తమ విశ్రాంతి గది కిటికీల నిండా కళ్ళు పెట్టేశారు !

'నేను రూములోకి వెళ్ళిపోతాను మాష్టారూ,' అని గట్టిగా కూడా అనలేక పోయింది రమ.

'రమా, నీ ఆరోగ్యం ఎలా ఉంది?' ఏమి అడగాలో తెలియనివాడిలా యీ ప్రశ్న వేశాడు రామారావు

'నాకేం బాగానే ఉన్నానే' అంది రమ

'నా కలా కనిపించడంలేదు నువ్వేదో వర్రీ అవుతున్నట్టు, ఎవరికీ చెప్పనట్టు ఊహించుకుని బాధపడుతున్నాను. సాయంత్రం కాంటీనుకి వస్తావా మాట్లాడుకుందాం?' ఆత్రంగా అడిగాడు రామారావు.

'బాగుండదు మేష్టారూ, అయినా సరళని అడుగుతాను' అంటూ గబగబా వైటింగు రూములోకి పరుగెత్తింది రమ.


రామారావోసారి క్రాపింగు సరిచేసుకుని స్టాఫ్ రూములోకి దారితీశాడు. అతని వెనకనే విద్యార్థులు రకరకాలుగా కేరింతలు కొట్టారు. కాని అవేం పట్టించుకునే మనస్థిమితం రామారావుకి లేదు.

వెయిటింగు రూములో సరళ కూర్చుని సీరియస్‌గా ఒట్టియం పడుతోంది ఆ పూట రెస్టుకి. 'వచ్చావా ?' అంటూ కందిన బుగ్గలతో లోపలికి వచ్చిన రమని చూసి రమ ఏం మాట్లాడకుండా పక్కనేఉన్న కుర్చీలో కూలబడింది! ఓ క్షణంలో ఆమెకి ఎక్కడలేని నిస్సత్తువా వచ్చింది

'ఏం జరిగింది రమా? ఏం అలా ఉన్నావు?' ఆత్రంగా అడిగింది సరళ.

'మాష్టారు కనబడ్డారు' అంది రమ.

'దానికేనా ఇంత గొడవ? ఏమైనా, అన్నారా?'



'హిరణ్యత్రితం మనిద్దరినీ కాంటెస్ట్‌కి పిలిచారు' వంటిన ఎల ఎత్తకుండనే సమాధానం చెప్పింది రమ

'ఎఫ్ ఎస్‌గా ఫలహారం ఉన్న మాట. బాగుంది ఈ గుడ్‌న్యూస్ చెప్పడానికింత సేపా?' అంటూ స్నేహితురాలి భుజం తట్టింది సరళ.

సరళది ఎంత తొందర స్వభావమో రమది అంత నిదానమైన ధోరణి సరళ చలాకీతనానికీ రమ సౌమ్యతకీ తలకిందులు అయినా వాళ్లిద్దరూ ప్రాణస్నేహితులు'

'కాదు సరళా నా కెందుకో భయంగా ఉంది' అంది రమ.

'నే వస్తానని కాబోలు' వేళాకోళం చేసింది సరళ

'నీకన్నీ వేళాకోళమే. పిల్లికి చెలగాటం ఎలక్కి ప్రాణసంకటం అన్నట్టుంది నీతో' పుస్తకాలు సర్దుకు లేచి నిలబడింది రమ.

'ఎవరు పిల్లి? ఎవరు ఎలక?. పద పద ముందుగా ఆ ఎలకగారి క్లాసేగా' అంటూ అవతలికి దారితీసింది సరళ— మేష్టార్ని ఆ క్షణంలో ఎలకని చేసేస్తూ రమ బెరుకుగానే సరళ వెనక నడిచింది

ఇంకా లెక్చరరు రాకముందు కాలేజీ పిల్లల క్లాసు ఎలా వుంటుందో ఊహించుకోవచ్చు. ఒకటే రణగుణధ్వని రాళ్లవానగా ఉంది. దరువులు, చప్పట్లు, రాగాలాపనలు, లల్లాయి పదాలూ హోరున సాగుతున్నాయి. వీటన్నిటికీ మధ్య తీవ్రంగా పుస్తకాలు చదివేవారూ ఉన్నారు పాపం! వారికీ కష్టం ఓపట్టాన పోయేదికాదు.

రామారావు క్లాసులో అడుగుపెట్టాడో లేదో 'హుష్ ' అంటూ ఓ నిశ్శబ్దతరంగం కదలి నడచింది, నిశ్శబ్దంగా క్లాసు తయారైంది లెక్చరరుగారితోపాటే అమ్మాయిలు కూడా క్లాసులోకి వచ్చి కూర్చున్నారు

రామారావు సాహితీవేత్త తెలుగు సాహిత్యం క్లాసు తీస్తాడు లిటరేచరంటే లగని యిష్టం ఉన్న రామారావు పాఠం కూడా చాలా బాగా చెప్తాడు అందుకనే ఎంత అల్లరి చేసినా అతని క్లాసులో విద్యార్థులు పాఠం చాలా ఉత్సాహంతో వింటారు.

సాహిత్యంలో రాయబారాల ప్రాముఖ్యతను గురించి వినసొంపుగా రామారావు పాఠం ప్రారంభించాడు. చిలకలూ, హంసలూ,

కొన్ని సందర్భాలలో చేటికా జనం. ఎలా రాయబారాలు నడిపారో పొందికంగా చెప్పాడు.

పాఠం సాగుతూనే ఉంది వెనక బెంచీలలో గుసగుసలు సాగుతూనే ఉన్నాయి

'చేటీ నీవైనా చెప్పవే అంటూ నంగనాచి సంభాషణలు వినిపించకుండా రమ చెవులకి వినిపిస్తూనే ఉన్నాయి. పుస్తకం మీది కళ్లు ఎత్తకుండా కూర్చుంది. పైకి చూస్తే చాలు రామారావు తనవైపే చూస్తూఉంటాడని రమ గ్రహించకపోలేదు. దీనికితోడు పక్కన కూర్చుని సరళ ఒకటే రన్నింగు కామెంటరీ చెపుతోంది.

'పురుషుడు సాగించిన ఏదైనా ఒక రాయబారం చెప్పకలరా?' అంటూ ఉత్సాహంగా క్లాసుని ప్రశ్నించాడు రామారావు

'నలుడూ, నలుడూ,' అంటూ ఓ పాతిక కంఠాలు అరిచాయి.

'అవును తాను ప్రేమించిన స్త్రీ దగ్గిరకి, ఎవరెవరినో వివాహం చేసుకోమని ఒప్పించడానికి నలుడు వెళ్లాడు.

హృదయం విగిప్పింది

అతనెంతటి ఉదాత్తుడో అతని కార్యభారమే నిర్ణయిస్తుంది-అవునా?' అడిగాడు రామారావు.

'అవునూ, కాదు మరీ' అంటూ క్లాసు సమాధానం చెప్పింది

'అయితే అలనేం చెప్పాడో ఒక్కరేనా చెప్పకలరా?' అడిగాడు రామారావు.

'మీరే చెప్పండి సార్, బాగుంటుంది' ఓ పదికంఠాలు ప్రాధేయపడ్డాయి

తన చక్కని వాగ్ధాటిలో రామారావు విద్యార్థులని మైమరపించాడు 'ఆత్మీయులైన వారి నెప్పుడూ చూడకపోయినా మనస్సెప్పట్టు ఆనవాలు పట్టేస్తుంది కాబోలు అందుకే దూతయై వచ్చినా నలుణ్ణి' 'పెక్కు భాషణములేల. నిజము తప్పక చెప్పుము నిషధపతివో?' అని అడిగిందిట నలుని అంతగా ప్రేమించిన దమయంతికి నలుడు దూతగా చెప్పిన మాటలు కంటకప్రాయంగా తోచాయి. అందుకే 'ఆ నలుని పెళ్లి చేసుకోలేకపోతే ఆత్మహత్య చేసుకుంటానంది. దానికి నలుడేమన్నాడు? 'అగ్నిలోపడి ఆత్మహత్య చేసుకోదలిస్తే అగ్నిదేవుని కోరిక తీరుతుంది. నీటిలో పడితే లంబుకేశ్వరునికి పుణ్యం నువ్వెలా ప్రాణం తీసుకున్నా చివరికా వైవస్వతుని కోరిక తీరుతుంది' అన్నాడు 'లేక వద్దంటూ నిగూఢంగా కావాలని చెప్పడంలేదుకదా కొంపతీసి?' అని అడిగాడు. కోపం వచ్చిన దమయంతి చేతనైతే నలుణ్ణి వర్ణించు లేకపోతే దయ చేయి అంది. 'ఎంతైనా ఆడవారి పట్టు మంకుపట్టు!' అంటూ ముగించేసరికి క్లాసు గొల్లుమన్నారు

రమ తలెత్తి చూసింది.

రామారావామెకేసే చూస్తూన్నాడు.

క్లాసు గోలలో కలిసిపోయే గంట మ్రోగింది తన ఫైలుమూసి రామారావు క్లాసు రూము దాటాడు మరు క్షణంలో హాలు దద్దరిల్లేలా అబ్బాయిలంతా 'రమా రామగోవిందహరి!' అంటూ అరిచారు. లెక్చరరు వెనకే క్లాసు వదలివస్తున్న అమ్మాయిలు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ విశ్రాంతి గదివైపు నడిచారు. రమ బిక్కచచ్చిపోయింది. గుండె నిబ్బరించుకుంటూ క్లాసు దగ్గిరనుంచే హాస్టలుకేసి కదకదక నడిచి వెళ్లిపోయింది

సరళ విశ్రాంతి గదిలోకి వెళ్లింది. అక్కడ అమ్మాయిలంతాచేరి లెక్చరర్ చెప్పుకుంటున్నారు. అసలిలాంటి కో-ఎడ్యుకేషన్ కాలేజీలలో అబ్బాయిల గోలేనా భరించవచ్చుగాని అమ్మాయిల కుచ్చితాలు భరించడం కష్టం.

'మరీ మోసం ఈ లెక్చరర్ మరి అంత ఓపెన్ వూయింగా! రమ రాను!' అంటోందో అమ్మాయి.

సరళ ఒంటిమీద తేళ్లూ, జెర్రులూ పాకుతున్నాయి. 'వీళ్లందరికీ బుద్ధి రావాలంటే అసలు మేష్టారి ఉద్దేశ్యం ఏమిటో కనుక్కోవాలి.' అని నిర్ణయించుకుంది.

(ఇంకా ఉంది)

మహీధరోక్తులు

మహీధర నళినీమోహన్‌రావు



సరసునట్లు మూఢు డెరుంగ
నేర్చునే
కావ్యరసములోని కమ్మదనము ?
జలజ వైరిశోభ జాత్యంధు
డెరుగునా ?
హృదయవర్తి యిదా మహీధరోక్తి



మల్లన్నమంత్రి రాజ్యానికి కొంత దూరంలో ఒక షావుకారు ఉన్నాడు ఆ షావుకారు తప్పు లెక్కలు చూపించి తన దగ్గర అప్పు తీసికొన్నవాళ్లను బాధించేవాడు ఆ గ్రామంలోని ప్రజలు మల్లన్న మంత్రివద్దకు వచ్చి ఆ షావుకారుకు తగిన గుణపాఠాన్ని నేర్పవలసినదిగా కోరారు మల్లన్న మంత్రి సరేనని వారితో చెప్పి మారు వేషంలో ఆ గ్రామం బయల్దేరాడు

ఒకనాడు ఆ గ్రామంలోని ఒక రైతు తన గుర్రంమీద షావుకారు కొట్టుకు వచ్చాడు గుర్రాన్ని కొట్టుకు దగ్గరగా ఉన్న ఒక చెట్టుకు కట్టి వేసి ఆ రైతు యెక్కడికో వెళ్లాడు.

సరిగ్గా అదే సమయానికి మల్లన్న మంత్రి మారు వేషంలో షావుకారు వద్దకు వచ్చాడు రైతు అక్కడ కట్టివేసిన గుర్రంవద్దకు వెళ్లి మల్లన్న మంత్రి దానిని పరీక్ష చేశాడు షావు కారు దీనినంతా చూస్తూనే ఉన్నాడు

తరువాత మల్లన్నమంత్రి షావు కారువద్దకు వచ్చి గుర్రాన్ని యెంతకు అమ్ముతావని ప్రశ్నించాడు షావుకారు ఆ మాటకు సమాధానం యివ్వలేదు వెంటనే మల్లన్న మంత్రి తాను ఆ గుర్రాన్ని రెండువేల వరహాలకు కొంటానని అన్నాడు ఆ మాటకు షావుకారు నిర్ఘాంతపోయి, మల్లన్న మంత్రివైపు ఆశ్చర్యంగా చూశాడు రెండువేలు తక్కువ వెల అని షావు కారు అనుకొంటున్నాడని మల్లన్న మంత్రి అనుకొన్నాడు అయితే మూడు వేల వరహాలకు యిస్తావా అని మల్లన్న మంత్రి మళ్లీ అన్నాడు

మూడువేల వరహాలకు గుర్రాన్ని అమ్మడానికి షావుకారు అంగీకరించాడు అయితే గుర్రాన్ని ఆ దినమేకాకుండా, మర్నాడు తీసికొనివెళ్లాలని షరతు పెట్టాడు ఈ లోపున రైతుదగ్గర ఆ గుర్రాన్ని కొని వేయవచ్చు నను కొన్నాడు షావుకారు మల్లన్న మంత్రి ఆ షరతుకు అంగీకరించి యాభై వరహాలు బజానా కూడా యిచ్చాడు మర్నాటి ఉదయమే మిగిలిన డబ్బు యిచ్చి గుర్రాన్ని తీసికొంటానని షావుకారుతో చెప్పి మల్లన్న మంత్రి అక్కడినుంచి వెళ్లిపోయాడు.

తరువాత కొంతసేపటికి రైతు అక్కడకు వచ్చాడు గుర్రాన్ని యెంతకు అమ్ముతావని షావుకారు రైతును అడిగాడు ఆ గుర్రం విలువ నలభై యాభై వరహాల కంటే యెక్కువ ఉండదు అయినా గుర్రాన్ని తాను అమ్మనని జవాబు యిచ్చాడు. రైతు షావుకారు యెన్నో విధాలుగా చెప్పి చివరకు రెండువేల వరహాలకు గుర్రాన్ని రైతువద్ద కొన్నాడు వెయ్యి వరహాలు లాభం వస్తుందని షావు కారు సంతోషించాడు.

మర్నాటి ఉదయం షావుకారు మల్లన్న మంత్రికోసం యెదురు చూశాడు కాని అతను రాలేదు మల్లన్నమంత్రి మారువేషంలో ఉండ డం వలన షావుకారు అతన్ని గుర్తు పట్టలేదు వారం రోజులైనా కూడా మల్లన్న మంత్రి రాలేదు గుర్రం విలువ తెలుసుకొన్నాడు షావుకారు. తాను మోసపోయానని షావుకారు చాలా విచారించాడు

తరువాత రహస్యంగా ఆ గ్రామ ప్రజలు మల్లన్న మంత్రివద్దకు వచ్చారు షావుకారు రైతుకు యిచ్చిన రెండువేల వరహాలను అక్కడకు తీసి కొనివచ్చారు ఆ డబ్బుతో గ్రామం మెత్తానికి పనికివచ్చే పనిని చేయ మని మల్లన్నమంత్రి వారికి చెప్పాడు తనను మోసగించిన వ్యక్తి మల్లన్న మంత్రి అనే సంగతి కొన్ని రోజులు పోయిన తరువాత షావుకారుకు తెలి సింది అప్పటినుంచీ షావుకారు యెవ రినీ మోసం చేయలేదు. ●



పెద్దకథ ప్రారంభం!



గురుద్యోగా(బా)ధ

వేళ్ళపల్లి వెంకటలక్ష్మీనారాయణ

పెరిగిపోయిన ఫైళ్ళు, విరిగిపోతున్న కుర్చీలు, అరిగిపోయిన పెన్సిళ్లు యిలా ఎన్నో వస్తువులు అదొక ఆఫీసు అన్నదానికి సాక్ష్యం యిస్తున్నయ్ 'వీటన్నిటికీ సొంత దారులం, దారులు తెలియని వాళ్ళం మేం' అంటున్నట్టు ఒకళ్ళమీదొకళ్లు కూర్చున్నట్టు కూర్చున్న గుమాస్తాలు వీళ్ల కొంచెం దూరంలో మధ్యే చిన్న అడ్డు పెట్టుకొని ఒక్కడూగా కూర్చున్నాడో వ్యక్తి టేబిలు మీద రెండో మూడో ఫైళ్ళున్నయ్ అంతకుమించి లేవు కానీ అతగాడిబుర్రలోమాత్రం బోల్డు ఫైళ్ళున్న యితగాడో గురుద్యోగి నెలకు అయిదారొందలొస్తయ్ కానీ ఆ వచ్చేదానికయిదింతలు పని; అంతకంటె ఎక్కువ బాధ్యత

అతగాడి పక్కనేవున్న 'ఫోన్' మోగింది యీ పిలుపు గురుద్యోగి పైనుండే గురుద్యోగి దగ్గర్నుంచొచ్చింది యీ గురుద్యోగి ఏదో ఫోన్లో చెపుతున్నాడు ఆ పై వాడికి యితగాడి మొహంలో రంగులు మారినయ్ కొంచెం ఎర్రబడింది, మరి కొంచెం నావిందికూడాను ఆ పైగురుద్యోగి ఫోన్లో మొహంవాచేటట్లు చివాట్లు పెట్టాడు

ఆ పై వాడెప్పుడూ అంతే అందుకో యిందుకో ఫోన్చేస్తాడు గురుద్యోగి ఫోనందుకుని అన్నీ చేతాలెన్నప్పినా వినిపించుకోకుండా ఏమీ కస్సుబుస్సు కాస్సేపు కసురుకుంటాడు కూడాను అసలు ఫోన్లో మాట్లాడే మొదటిమాటె విసురుగా మొదలెడ్తాడు అందుకే గురుద్యోగి ఫోన్చేస్తుకుంటూనే రుమాల్తీస్తాడు జేబులోంచి విసురుకునేందుకూ, చెవట తుడుచుకు ఎందుకు పనికొస్తుందని

'మనం గవర్నమెంటు సొమ్ము తింటున్నాం అందుకని ఏవి జాగత్తగా చెయ్యటం నాకలవాటు' అంటాడు, అది నీకలవాట్లేదనే అర్థంలో.

'యస్ సర్' అంటాడు గుమాస్తా గిరి. మనస్సులో మాత్రం 'నువ్వు గవర్నమెంటు సొమ్ము తింటూవేం ఖర్మ మింగుతున్నావ్, అంతే గాదు యిటు ప్రజల సొమ్ము కూడా మింగుతున్నావ్' అనుకుంటాడు మిగతా గుమాస్తాగుల్తో పోల్చి చూస్తే యీ గుమాస్తాగే ఎక్కువగా పన్చేస్తూ వుంటాడు చేయిస్తూ వుంటాడు యితగాడు రెప్ప వాల్చకుండా పన్చేస్తాడు మిగతావాళ్ళు తలుపుకి బోల్టు పెట్టి, కళ్ళజోడు డ్రాయర్లో పెట్టి, కాళ్ళు టేబిలుమీద పెట్టి మూడింటిదాక నిద్దరోయి, అప్పుడ్లేచి అరాళ వెళ్లాల్సిన కాగితాలమీద సంతకాలు గీసి, వాట్నవతల గిరాటేసి కొలెనుకుని చెక్కేస్తారు కాని ఈ గుమాస్తాగి మాత్రం అప్పి ప్పయంగా చూసుకుంటూ, కిందున్న చిరుద్యోగులు చిరునవ్వుతో పలకరిస్తూ మంచిగా ఎప్పాయించుకొస్తున్నాడు యితగాడ్తో వచ్చిన చిక్కల్లా పక్కసెక్షన్‌మీద ట్పేంటి యింగాడికి తన దోవన తను పోవటం అలవాటు చదుకునే రోజుల్లో రోడ్డు పక్కన స్పేస్‌గా ఓ దోవేసుకుని దానిమీద నడిచేవాణ్ణి ఇప్పుడికి ఆఫీసులో కొచ్చాక్కూడా అదే ఎన్నేస్తున్నాడు తన సెక్షన్ అని చూసుకోటం, అది చేసుకోటం, పైకెళ్లాల్సిన కాగితాల రంగుమారక పూర్వంనే ఏ రోజుకా రోజు పైకి పంపించేస్తూంటాడు అయినా పై ఆఫీసరు 'ఉసురుసు' లాడ్తాడు ఏదో సంపాయిస్తున్నట్టు 'మీ సెక్షన్ కొంచెం యింప్రూవ్ చెయ్యాలి' అంటాడెప్పుడూ మిగతా సెక్షన్లలో యింతవరకూ ఇండి యీ రిపబ్లిక్ అయిన తర్వాతొచ్చిన కాగితాల్ఫ్లేదా అఫీసర్లు వాళ్లిప్పటికీ 'మొన్ననేగా మనకి స్వతంత్రం వచ్చింది స్వతంత్రం వచ్చిన రద్దీలో మా సెక్షనుకి బోల్డు కరస్పాండేన్సొచ్చి పడింది అదింకా వదల్లేదు అంటారు ఆ సెక్షన్లో వున్న ఓ గుమాస్తా మొన్న ఎన్నికల్పుడో నాయకుడి మీటింగుకెళ్లి మాట్నొన్నట్లు ఆ నాయకుడు లరవై నిమిషం ఉపన్యాసం లోనూ ఒ దెబ్బ పెట్లు— 'స్వాతంత్ర్యం వచ్చి యిరవై ఏళ్లవుతోంది మనం ఏం సాధించాం అని గనక ప్రశ్న వేసుకుంటే సమాధానంగా వచ్చేది బిహార్లో కరువు మాత్రమే అరెళ్లు మనం ఏం సాధించలేదని బుజువై పోతోంది కాబట్టి యీ అమూల్యమైన 'అంటూ మాట్లాడు

'ఏవండీ! నిజంగానా?' అన్నాట్ట యీ గుమాస్తా పక్కవాణ్ణి కుదుపుతూ

'వీళ్ల మొహం అండీ ప్రతివాడికి యిదో అలవాటు 'మనం యింత కాలం ఏం చేస్తున్నాం? భోంచేస్తున్నాం అందుకే తిండిగింజలు నిండుకున్నయ్' యిట్లా అంటం సరదా ఏం చేశావో చెయ్యస్తుంది రేపు మా మీటింగుకి రండి మనం ఏం సాధించక పోవటం ఏమిటండీ? మనం ఏం సాధించలేదు చెప్పండి కావాలిస్తే నాగార్జున సాగర్ తీసుకోండి, ఉక్కు కర్మాగారాల్ని తీసుకోండి, అందులో ఉక్కు మనుషుల్లా వున్న కార్మికుల్ని తీసుకోండి లేదా మరింకేదైనా మంచిది తీసుకోండి యివన్నీ మనం సాధించినవి కావుటండీ యిక పోతే,' అంటూ చెప్పుకు పోతున్నాడా నేటి పౌరుడు భావినాయకుడు యితగాడు 'అవి తీసుకోండి, యివి తీసుకోండి' అని చివరికి 'మాకే ఓటేసుకోండి' అంటాడు అట్టా చెప్పుకు పోతున్న అతగాణ్ణాపి

'అది కాదు నాయకుడుగారూ మనకి స్వతంత్రం వచ్చి యిరవయ్యేళ్లయిందా? మరి మా ఆఫీసులో మేం యింకా 'విత్ రిఫరెన్సు యువర్ లెటర్ డేటెడ్ 1947' అనే రాస్తున్నాం అందుకని మాకేం తెలియటల్లేదు' అన్నాడు గుమాస్తా

'పోనీ మీరొచ్చిన యీ సంగతె తీసు



కోండి. యిట్లా మెల్లగా పాసుల్లేసుకోవటం ఓ పెద్ద ఘనకార్యం కాదూ? తెల్లవాడుండగా యిలా మెల్లగా ఎసుల్లేసుకునే స్వతంత్రం వుండేదా మనకి?...' అంటూ చెవుతున్నతన్ని వదిలించుకుని తన స్నేహితుల్తో 'మనకి స్వతంత్రం వచ్చి యిరవయేళ్లయిందన్న సంగతి చెప్పటానికి బయల్దేరాడు చిరుద్యోగి

అలాంటి సెక్షన్ల కాధిపత్యం వహించిన గుమాస్తాగుల్నేమీ అనేవాడు కాదు పై ఆఫీసరు గుమాస్తాగి సెక్షన్నే దృష్టిలో పెట్టుకుని యితగాణ్ణి తిట్టేవాడు. పక్క సెక్షన్ల గుమాస్తాగుల్లో చంచయ్యనే వాడొకడున్నాడు. చంచయ్య లంచాలు మింగుతాడు కొన్నాళ్ల క్రితం వరకూ ఆ సంగతి పుకారుగానే వుండిపోయింది. యీ పుకారేమిటో తెల్సుకుందామని పై ఆఫీసు నుంచొక పెద్దాఫీసరొచ్చాడొకసారి అతగాడికి తెల్సున్నొకతన్ని చంచయ్య దగ్గరికి పంపి అతగాడ్తోత 'అయ్యా! చంచయ్యగారూ! నా అప్లికేషన్ సంగతేమిటి? అదెక్కడుంది? ఎట్టా వుంది? ఎన్నేళ్లయిందో గదా నేను దాన్ని చూసి యిన్నేళ్లు నుంచీ దాని మొహం చూశారా మీరు? దాన్సంగతేమిటి? ఎన్నాళ్లలో పంపిస్తారు?' అని అడిగించాడు. చంచయ్య విలాసంగా నవ్వి—

'నువ్వన్న దేమిటి' 'ఎన్నాళ్లనా?' 'ఎన్నేళ్లనా' అన్నాడు ఆ వచ్చినతను

'ఎన్నేళ్లేమిటండీ? యిప్పటికే ఎన్నేళ్లయింది' అన్నాడు ఏడుస్తూ అతగాడేడుస్తుంటే చంచయ్య నవ్వి—

'భలేవాడివేలే! ఎన్నాళ్లేంటున్నావా?' యిదేంపన్నా రోజుల్లో అయ్యేపనా? వాటి బూజు దులపటానికే కొన్ని నెల్లు పడుతుంది ఈ రోజుల్లో రోజుల్లో అవుతయ్యా పన్లు చూద్దాం'అని మెల్లగా లంచం పుచ్చుకునే చేతిని ముందుకు చాచి 'ఏది? అదేది?' అన్నాడు ఆ వచ్చినతను

'అయ్యా దాన్ని ఆ అప్లికేషన్ని అయిదేళ్ల క్రితమే పంపించానండి' అన్నాడు చంచయ్య మటమటలాడ్తా 'నువ్వీ సంగతే అయిదేళ్లనించీ చెవుతున్నావ్ అందుకనే నీపనట్టా ఆగిపోయింది ఆ కాగితం నానాటికి అణక్కిపోతోంది అక్కడ పుక్కిలిచ్చుకొన్తే అసలు అయిపు లేకుండా పోయినా పోవచ్చు దాన్ని అయిదు

గురుద్యోగ పర్వం

వాళ్ళు తొక్కిపెడుతున్నయ్ వాటిల్లో రెండుబూట్లకాళ్ళు, మూడుచెప్పులకాళ్ళు వున్నయ్ నువ్వే చెప్పు? నువ్వు చేతు లూగించుకుంటూ, జేబులో చెయ్యిపెట్ట కుండా పన్చేయించుకోవాలంటె ఎట్లా? నీకూ నాకూ నేస్తంవుంది కాబట్టి నా బాటుకొాల వేస్తానసుకో, కానీ మిగతా వాళ్ళ సంగతేమిటి? వాళ్ళ సంగతవ్వా చూడొద్దూ? ఊరికే చెయ్యాలంటే కొన్నిలక్షల ఫైళ్ళున్నయ్ అవన్నీ వొదిలేసి నీదెట్లా చూసేది? నీకో సంగతి చెప్తాను మనిద్దరి మధ్యే వుంచు ఈ ఆఫీసులో ఈ ఆఫీసులో ఏమిటి, ప్రతి ఆఫీసులోనూ జరుగుతుంది ప్రతివాడూ తనకొచ్చిన పనికిపోడు కాని పనంటే ఏమిటో తెల్సా? కానీ రానిపనల్లా కావాలనే కాస్ అన్నా రాకపోతే ఆ పనికాదు అతె తెల్సిందా? ఊఁ ఏది? చెప్పు?' అన్నాడు చంచయ్య మళ్ళీ ఆ పచ్చికతనికి జ్ఞానోదయం అయిపోయింది అది పోయేలోగా

'అయ్యో! అదా దాసరయ్యం 'దేది?' అంటే అర్థం అర్థంకాని లంచంగారికి యింతకాలం యీ పరమార్థం తెలుసుకో లేక పోయానుగదా! ఎం చెప్పను మూర్ఖుణ్ణి యిప్పుడు తెలుసుకొలేదు ఏదో ముట్టచెపుతాను పట్టుకోండి' అంటూ అతగాడ్చేతిలో నోట్లకట్ట పెట్టాడు చంచయ్య మొహం కొంచెం విప్పారి మరి కొంచెం వ్యాకోచించింది సంకోచించకుండా ఆ కట్టలెక్కెట్టుకుంటుంటె అప్పుడు వొచ్చిన ఆఫీసరు పక్కగావచ్చి చేతిలోవున్న కెమెరా 'క్లిక్' అనిపించాడు గుట్టు బట్టబయలయింది దాన్ని పట్టుకున్నారని పసిగట్టిన చంచయ్య నోట్లన్నీ నోట్లో పెట్టుకుని గుటుక్కున మింగాడు ఆ వచ్చి నాఫీసరు చంచయ్యని పట్టుకుని గవర్నమెంటాస్పత్రికి లాక్కెళ్ళి 'లంచం మింగాడు ఆపరేషన్ చెయ్యమ'ని చెయిం చాడు. ఆ కేసులోంచెట్లాగో బయట పడ్డాడు చంచయ్య అప్పట్నించి చంచయ్య లంచాలు మింగుతాడనందరికీ తెల్సింది యిందు కతగాడు విచారించాల్సింది పోయి సంతోషపడ్డాడు పైగా 'ఇంతవరకూ వచ్చిన



ప్రతివాడిని 'డబ్బు తెచ్చావా?' అని అడగాల్సొచ్చేది ఇవానింటి అట్టా అడగక్కర్లేదు ఈ కేసుతో ఆ సంగతి అందరికీ తెల్సిపోయింది డబ్బు సంగతి అడగాల్సిన బాధ, బాధ్యత నేను తీసుకో అక్కర్లేదు డబుల్‌ప్రమోషన్ వచ్చేసినావని. 'ఏం జరిగినా మన మంచికే' అంటూ రందు పేగాలొచ్చి' అని చంచయ్య సంతోషించాడు కాని అప్పట్నుంచి చంచయ్య లంచం ఎట్టా విధానంలో వో కొత్త పద్ధతి ప్రవేశపెట్టాడు ఇప్పుడు 'క్లీన్ ఎడ్మినిష్ట్రేషన్' కావాలట అందుకని టేబిలు క్లీనుగా వుంచుకుని యిచ్చిపుచ్చు కోవటాలు టేబిలుమీద కాకుండా టేబిలు కింద జరిగేందుకు వీలుగా చిన్న సొరుగు చెయించాడు ఎవరన్నా ఏకాగితాన్నో చేతు క్కుంటూ వచ్చినప్పుడు యీ సొరుగుని వాడి జేబుదగ్గర కెళ్ళలా తోసేవాడు ఆ వచ్చినవాడు ఇవ్వకోవాలిగ డబ్బుని కవర్లో పెట్టి దాంట్లో పడేసేవాడు అప్పుడు దాన్ని తనముందుకి లాక్కుని లెక్కెట్టుకుని సరిపోతే—

'సరే పోతే మీ పనొకటి కాలేదన్నారు గదూ? రేపు రండి' అంటాడు తక్కువయితే—

'ఏమిటోనండి యిప్పుడు బోల్డు పనొత్తిడిగా వుంది రెండు మూణ్ణెల్లాగి ర్రావాల రండి' అంటాడు దాంతో ఆ వచ్చినతను 'అయ్య బాబోయ్..

చంచయ్యగారూ! అట్లా అనకండి రెండు మూళ్ళు కాదు రెండ్రోజుల్లో కావాలి అని యింకో కవరు సొరుగులో పడేస్తాడు' యిట్లా టేబిలుకింద 'హుండీ' కట్టి ప్రతిరోజు సాయంకాలం లెక్కపెట్టి, దాంట్లో కొంత వేరెపెట్టి మిగతాది పట్టుకుని పై ఆఫీసర్దగ్గర కెళ్ళి—

'అయ్యా యిది యీ రోజు భిక్షం చింది 'రక్షణ నిధికి అంటె మన రహస్యాన్ని రక్షించేందుకు చిరుద్యోగులకిచ్చింది — అను యిది యివాల్టికి తమ కిచ్చుకునే దక్షిణ' అంటూ అటూ యిటూ చూసి టేబిలుమీదున్న ఒక ఫైల్లో పెడ్తాడు పై ఆఫీసరు డబ్బుని టేబిలుమీద పెట్టంగానే ముట్టుకోడు యిచ్చిన వాడెక్కడా దాన్సంగతి చూడ్డు దాన్సంగతి చూడకపోవటంవే కాకండా దాన్సంగతేంవి పట్టనట్టు, పట్టినా ముట్టుకోనట్టు పేపర్లో చూస్తూ

'యిక్కడెక్కడో బ్యాంకుని దోచేయు కున్నార్ట చూశారా?' అంటాడు యిట్టా పట్టించుకోనట్టు గార్చుని అతగాడటు బయట కెళ్ళంగానే ఫైలుతీసి నోట్లు లెక్కెట్టుకుని మడుచుకుని మొహం మొచ్చుకుంటాడు

'ఏవిటలా చేశావ్' అంటాడు మర్నాడతగాణ్ణి పిల్చి

'ఏం చేసేది? ఏవిటో యిస్తేనే కి చస్తున్నారు పైగాను అందులో ఎలక్షన్నాసన్నాయ్ కదా? మరి మండిపడ్తున్నారు, మంటల్లా ఎండకడ్తున్నారు యీ ఎలక్షన్ల సీజన్లో యింతేనండి పెద్దగార్లాగ మనవేదో యీ పన్లన్నీ పూరికె చేస్తానికి కూర్చున్నట్టు చూస్తారు' అంటాడు కానీ ఆ పై ఆఫీసరు విసుక్కోటం మానడు

'ఏవిటో? ఏదేవీ నాకు నచ్చలేదు యింకొంచెం డెబ్బ్లేసి పట్టుకోండి కట్టుకోక చస్తారా? ఎంత ఎలక్షన్ల సీజనయినా కలెక్షన్లు యింత అధ్వాన్నంవా?' అని పంపించేవాడు ఆ పై ఆఫీసరుకి 'దాహం' జాస్తి చిన్నప్పుడు మంచి నీళ్ళు తెగతాగేవాడు యిప్పుడు పచ్చనోట్లు కూడా అట్లానే లాగుతాడు యీ పైకొచ్చేముందు కింద సెక్షన్లన్నింటిలోనూ పనిచేశాడు ఏ సెక్షన్లో ఎంత మందిని పట్టుకోవచ్చు, ఎంత రాబట్టుకోవచ్చో అతగాడికి కంఠతావొచ్చు


'ఫలానా సెక్షన్లోకి అతగాడొచ్చాడా? అదృష్టవంతుడు బాగా రాలే సెక్షనే అది' అంటాడు అందుకే తన కిందున్న సెక్షన్లన్నిటిలోనూ తనకు పాటివాళ్ళనీ, తనలాటివాళ్ళనీ, తనకు వాటా యిచ్చేవాళ్ళనీ వేసుకున్నాడు వీళ్ళందర్నీ విడివిడిగా వారానికోసారి కట్నుకుని ఆ సెక్షన్ల యొక్క డబ్బు రాబట్టే పొటెన్షియాలిటీ గురించి, అవెంత వెనకబడున్నదీ మొదలైన సంగతులన్నీ చెప్పేవాడు మరో రెండువారాల్లో బాగుపడాలనేవాడు కానీ యీ గురుద్యోగిని సెక్షనుకి పై వాళ్ళు పంపించారు గురుద్యోగి పద్ధతేదీ యితగాడికి నచ్చలేదు యిలాటి చిక్కులొచ్చి తనకి డబ్బులేవీ చిక్కవనే అనుమానంతో గురుద్యోగితో మొదట్లోనే యిలా అన్నాడు

'మీకీ ఆఫీసులో వున్న ఆఫీసర్లందరం పూర్తి సహకారం యిస్తాం మీరు కూడా అలానే చెయ్యండి' యిలా అని షేక్ హాండిచ్చి 'మనం యిలా చేతులిచ్చి పుచ్చుకోవటాలు చాలాసార్లు చేద్దాం' అన్నాడు మళ్ళీ యిట్లా అన్నాడు

'పనిలో ఏదన్నా సహాయం కావాలంటె ఫలానా చంచయ్యగార్దగ్గర కెళ్ళండి లేదా లోకేశ్వర్రావుగార్దగ్గరి కెళ్ళండి'

లోకేశ్వర్రావిదే ఆఫీసులో యింకో సెక్షనుకు ఆఫీసరు లోకేశ్వర్రావు లోకం తిరిగినవాడు, లోకజ్ఞానం బోల్డుంది కార్యసాధన ముఖ్యలక్షణం ఘన కార్యాలు కూడా సాధించాడు ప్రపంచ పరిస్థితులు చిన్నప్పుడే అవగాహం చేసుకున్నాడు చిన్నప్పుడు యింటర్మీడియట్ చదివి రెండు తడవ లెప్పాడు రెండోతడవ తప్పటంతో తండ్రి చింత బెత్తం పుచ్చుకున్నాడు దాంతో లోకేశ్వర్రావు పూరొదిలిపెట్టి లోకంమీద పడ్డాడు యితగాడు తిరగనిచోట్లేదు రెండేళ్ళు తిరిగాడు యీ రెండేళ్ళలో యితగాడి తండ్రి రెండుమూడ్సార్లు పేపర్లలో ప్రకటనల్చేశాడు

'నాయనా లోకం! శోకం మంచిదికాదు. మీ అమ్మ శోకంలో వుంది నువ్వెక్కడున్నావు? ఎక్కడున్నాసరే వెంటనే వచ్చెయ్యి. నువ్వు పరీక్ష పేసవ్వనక్కర్లేదు అసలు పరీక్షకే వెళ్ళనక్కర్లేదు పరీక్ష పేసయిన అన్నయ్యేంచేస్తున్నాడు గనక? వాడూ పూరూర వుద్యోగాలకోసం తిరుగుతున్నాడు యిద్దరూ పూళ్ళమీదుంటె ఎట్లా? నువ్వొచ్చెయ్యి యింకోసంగతి చింతబెత్తం ఎప్పుడో పారేశాను చింతచెట్టు కూడా కొట్టించేశాను' అని ప్రకటనల్చేసినా లోకేశ్వర్రావు రాలేదు యీ రెండేళ్ళల్లో ఎంతో మందిని చూశాడు వాళ్ళల్లో ఓ పెద్ద బిజినెస్ మెన్ని పట్టుకున్నాడు ఏవో స్టేషన్లలో రెండు మూడ్తడవలతగాడి పెట్టె బెడ్డింగు మోశాడు



గురుద్యోగ పర్వం

మూడో తడవా వచ్చేసినప్పుడు ఆ బిజినెస్‌మన్ గుర్తుపట్టి 'నా కింత పూర్వం కూడా నువ్వెక్కడో కనిపించావ్ కదూ?' అని అన్ని విషయాలు అడిగి మొదటిగా క్లర్కుగా చేర్చుకుని రెండేళ్ల తర్వాత అతగాడి మెడ్రాసు బ్రాంచికి యితగాణ్ని మేనేజరు చేశాడు కొన్నాళ్లకా బిజినెస్‌మన్ చచ్చిపోటంతో ఆ బిజినెస్ దివాలా తీసింది యిలాలోపలే లోకేశ్వర్రావు బి ఎ అయిందనిపించి ఓ గవర్నమెంటాఫీసులో చేరాడు లోకం జ్ఞానం వున్న లోకేశ్వర్రావు యీ ఆఫీసులో చేరి ఎంతటి వాణ్ణయినా యిట్టే ఆకట్టుకునేవాడు పై ఆఫీసర్లు కొందరు విదిలించుకునేవాళ్లు అయినా యితగాడు జిడ్డులా వదిలేవాడుకాదు అక్కణ్నించి కదిలేవాడుకాదు కొన్నాళ్లకా ఆఫీసర్లే యితగాణ్ని 'నీకు కార్యదీక్షుంది లక్షణంగా పైకొస్తావ్' అని మెచ్చుకొని యితగాడ్దగ్గర వుచ్చుకునేవాళ్లు ఇలా విదిలించుకున్నా వదలకపోవటం యితగాడికి చిన్నప్పట్నించే అలవాటు ఇతగాడికో వేలు విడిచిన మేనమామ వుండేవాడు అతగాణ్ని లోకంలో వంటరివాణ్ని చేసి అతగాడి పెళ్లాం వెళ్లిపోయింది లోకేశ్వర్రావతగాడ్దగ్గిరికెళ్లి 'వేనున్నాగా' అనే వాట్ట చిన్నప్పుడే. వేలువిడిచిన మేనమామ వేలుచ్చుకుని తిరిగేవాట్ట ఆ మేనమామ వేలు వదలించుకుని పోయేవాట్ట అయినా యితగాడతగాడివేలు విడిచి పెట్టలేదు చివరికావేలు విడిచిన మేనమామ కొన్ని వేలితగాడిపేర రాసి యితగాడివేళ్లు, చేతులు పట్టుకుని విడవకుండా చచ్చిపోయాడు యితగాణ్నెవరయినా కసిరికొట్టినా, విసిరి కొట్టినా కూడా, వాళ్ల వంటిపెట్టుకునే తిరిగేవాడు

'తల్లో నాలికలా వుంటాడు' అని అనేవాళ్లు పైవాళ్లంతా తల్లో నాలికలా వున్నాడో లేదోగానీ వాళ్ల చెవిలో మాత్రం ఎప్పుడూ నాలికుంచేవాడు వాళ్లమీద, వీళ్ల మీదనాలుగుచెప్పేవాడు 'తనాఫీసర్లకి దగ్గరగా రావాలంటే తన్దగ్గిరగా వస్తే సరిపోదు మిగతావాళ్లని దూరం చెయ్యాలి' అన్నదే అతగాడి సిద్ధాంతం పై వాళ్లని ఏపుగా మేపుతాడు అంతకంత కిందవాళ్ల దగ్గర్నించి లాగుతాడు అలా లాగటంలో లోకేశ్వర్రావుకో స్పెషల్ పద్ధతుంది నెలకోసారి ఏదో వ్రతం వుందని అందర్నీ పిలుస్తాడు ముఖ్యంగా కిందున్న వాళ్లని పేరు పేర్నా పిలుస్తాడు తప్పకుండా రావాలంటాడు ఓ చిన్న ఆహ్వానపత్రిక ఆఫీసులో పైపు చేయిస్తాడు దానికింద 'ప్రజెంట్సేవీ తీసుకురావద్ద'ని ఎర్రక్షరాల్తో పైపు చేయిస్తాడు ఆ ఎర్రక్షరాల ప్రకారంచేస్తే లోకేశ్వర్రావు కళ్లెర్రబడ్తయ్యని ఆఫీసులో అందరికీ తెల్సు అలా రాయటంలో వుద్దేశ్యం ప్రజెంట్లు తప్పకుండా తెమ్మనమని చెప్పటమే. కొన్నాళ్ల క్రితం యిలాంటాహ్వానం కిందున్న ఓ చిరుద్యోగికొచ్చింది చిరుద్యోగి చిన్నవాడు కాలేజీలోంచి బయటకొచ్చాడప్పుడే ప్రపంచంలోని మనుష్యులందరూ కాలేజీ లెక్చెరర్లమాదిరి అమాయకులనే అతగాడుద్దేశ్యం ఒక మాట కొకర్థమే వుంటుందని అతగాడి నమ్మకం

'వెధవాయ్ ప్రతీమాటకీ నానా అర్థాలుంటయ్. అవి అప్పచెప్పు' అని వ్యాకరణం చెప్పేటప్పుడు తెలుగుమాష్టా రెన్నిసార్లు చెప్పినా యితగాడికి తెల్సేది కాదు అందుకనే ఆహ్వానంలోవున్న ఎర్రక్షరాలు ఏభైతడవ ల్చదువుకుని ఎర్ర సిరాతో అండర్‌లైన్ చేసుకున్నాడు యితగాడిలా అండర్లయిన్చేసుకుంటుంటె తోటి చిరుద్యోగి చూసి 'నాయనా చిన్నబ్బాయ్! ప్రతి విషయం 'ఫేస్‌వేల్యూ'లో తీసుకోగూడదు 'కేస్ వేల్యూ' అని యింకోటుంది ప్రతికేసులోనూ దానర్థం వకటే కాదు వేరవుతుంది యీ లోకేశ్వర్రావు కేసులో మరీను' అన్నాడు అయినా చిరుద్యోగికదేం అర్థం కాలేదు చేతు లూపుకుంటూ ఆ వ్రతానికి లోకేశ్వర్రావింటి కెళ్లాడు లోకేశ్వర్రావు పెళ్లాంతో సహ పీటలమీద కూర్చున్నాడు ఓ కన్ను వాకిలివేపు, అందులోంచొచ్చే మనుష్యులవేపూ వుంచి యింకో కన్ను వాళ్ల చేతులవేపూ వుంచాడు వ్రతం వేపు వొక్క కన్ను కూడా వుంచలేదు చేతులు మాత్రం అక్కడుంచాడు ఆ చేతులు పట్టుకుని పురోహితుడే అన్నీ చేసుకుంటున్నాడు వ్రతం పూర్తయ్యి చదివింపుల సమయం వచ్చింది అదొచ్చే



ముందే చాలమంది పనుందని వెళ్లిపోతుంటే లోకేశ్వర్రావు కోప్పడి 'కూర్చోండయ్యా. యిచ్చుకోకుండను, ప్రసాదం పుచ్చుకోకుండాను ఎక్కడికి పోతారు' అన్నాడు నవ్వుతూ 'చదివింపులు' లని వ్రతం చేసే ఆయన పెద్దపెట్టున అరిచాడు. యితగాడు మంత్రాలన్నీ 'వుసూరు' మంటూ చదివి 'చదివింపులు' అన్నప్పుడు మాత్రం పిసుకుతూ అంటాడు యీ అరుపులని కొత్తగా వచ్చిన చిరుద్యోగికి చెమటలు పోసినయ్ వచ్చిన వాళ్లంతా తెచ్చుకున్న పొట్లాలు విప్పి యిచ్చుకుంటున్నారు పురోహితుడు యిచ్చే వాళ్ల పేర్లు బిగ్గరగా చదువుతుంటె లోకేశ్వర్రావు ఎక్కడో వున్న పొట్టి చేతుల చొక్కా పెద్దమనిషి వాళ్లపేర్లూ, వాళ్లిచ్చినవీ షాపు పేరుతో రాసుకుంటున్నాడు పొట్టిచేతుల పెద్దమనిషి లోకేశ్వర్రావాఫీసులో ప్యూన్ యితగాణ్ణి పని కెప్పుడూ వినియోగించుకుంటాడు లోకేశ్వర్రావు

'యిలా రాసుకుని మళ్లీ వాళ్లిళ్లల్లో కార్యాలొస్తే యింతకింత తీర్చుకోవటంకి. అందుకని గుర్తుకోసం రాసుకోవటం' అంటాడు లోకేశ్వర్రావు కానీ అదెందుకు రాస్తాడో లోకేశ్వర్రావుకీ, ఆఫీసులో అందరికీ తెల్సు ఆ లిస్టులో పేరు లేకపోతే ఏం జరుగుతుందో పేర్లేని వాడికే తెలుస్తుంది

అందరూ అలా చదివిస్తుంటె కొత్త చిరుద్యోగి చెమటలు తుడ్చుకుంటూ కూర్చున్నాడు. చదివింపులన్నీ అయ్యాక

(కొత్త) ప్రసాదం పెట్టేస్తూ లోకేశ్వర్రావు చిరుద్యోగి దగ్గరికొచ్చి 'నువ్వు మొన్ననే కొత్తగా చేరావు కదూ?' అన్నాడు పరామర్శిస్తున్నాడనుకొని చిరుద్యోగి 'అవునండీ' అన్నాడతి వినయంగా

'మరి తొందరగా అన్నీ నేర్చుకో' అని వెళ్ళిపోయాడు లోకేశ్వర్రావు తోటి చిరుద్యోగొచ్చి 'అన్ని నేర్చుకోమంటున్నాడు. విన్నావా? తొందరగా నేర్చుకోమంటున్నాడు అంటె మళ్ళీ వొచ్చే వ్రతం లోపలన్న మాట! తెల్సిందా' అని నవ్వాడు అతగాడెందుకన్నాడో యితగాడెందుకు నవ్వాడో చిరుద్యోగి కర్థం కాలేదు

మర్రోజాఫీసులో కొత్త చిరుద్యోగిని లోకేశ్వర్రావు పిల్చి 'నువ్వు కిందటి వారం వచ్చిన కాగితం సంగతి చూస్తున్నావటగా ఎందుకంత తొందరగా చూస్తున్నావ్? ఏవన్నా యింటరెస్టెడ్ కేసా?' అన్నాడు

'అప్పుడే వారం అయిందిగదా అని చూస్తున్నాను అయినా యిక్కడున్న కాగితాల్ని మనవ్వాల్సినవీ మనం చూడాల్సినవీ గదండీ' అన్నాడు చిరుద్యోగి

'ఎప్పుడేం చెయ్యాలో నా దగ్గర నువ్వు నేర్చుకో నువ్వు నాకు చెప్పక్కర్లేదు అయిదేళ్ళ క్రితం వచ్చిన కాగితాలు బోల్డున్నయ్ ఏభై అయిదులో వచ్చిన కాగితాల్లో ఒక లెటరుంది 'దాని మీద ఏం యాక్షన్ తీసున్నార'ని పై వాళ్ళడుగుతున్నారు ఆ లెటర్ తీసుకుని చూడు. దాంట్లో ఎక్కడన్నా కొంత మొత్తం రూపాయిలు, అణాల్లో రాసుంటాడు ఆ ఎమౌంటుని నయాపైసల్లో రాసి తిరిగి దరఖాస్తు పెట్టుకోమని ఒక లెటర్ రాయి' అని రాశాక పైవాళ్ళకి ఆ లెటర్ మీద తగిన చర్యతీసుకుంటున్నాం అని ఓ లెటర్ రాయి' అని అరిచాడు లోకేశ్వర్రావు


'యస్, సర్ కానీ నా దగ్గర 'నయా పైసల మారక పట్టీ' వుంది నేనే ఆ ఎమౌంటుని మారుస్తాను' అన్నాడు చిరుద్యోగి

లోకేశ్వర్రావు ఉగ్రుడయ్యాడు 'ఉద్ధరించావ్ గానీ నా కెదుర్చెప్పక చెప్పినట్టు చెయ్యి అంతేకాదు మళ్ళీ వాడు నయాపైసల్లో రాసి పంపిస్తే దాన్ని తిప్పి పంపించి ఆ 'నయా పైసల్లో' 'నయా' అన్నది కొట్టేసి మళ్ళీ పంపించమను యిప్పుడు 'నయాపైసల' నగాడద్దు, పైసలనాలి తెల్సా?' అన్నాడు లోకేశ్వర్రావు.

'యస్ సర్ కానీ 'నయా' అన్న సంగతి రాయకూడదని యీ లెటర్లోనే రాసేస్తాను' అంటున్న చిరుద్యోగిని కొట్టొచ్చేట్టు చూసి,

'నా కెదుర్చెప్పక చెప్పినట్టు చెయ్. 'ఫో' అని అరిచాడు లోకేశ్వర్రావు చిరుద్యోగి బయటకొచ్చాడు తోటి చిరుద్యోగొచ్చిలా అన్నాడు 'నాకు తెల్సినట్టు జరుగుతుందని మొన్న వ్రతానికి చేతులు జేబులో పెట్టుకొనొచ్చావ్ యిప్పుడ్చేతులు నెత్తిమీదెట్టుకో. నెలకోసారి లోకేశ్వర్రావు వ్రతం ఎందుకు చేస్తున్నాడు? భక్తికోసవా? అదేం కాదు యిదో వ్యాపారం చదివింపులకొచ్చే వెండి సామానంతా వెండి కొట్లోకి పంపిస్తాడు యితగాడికి తెల్సిన ఓ వెండి కొట్టుందిలే వాడవి తీసుకుని లోకేశ్వర్రావుకి డబ్బులిస్తాడు ఓ రెండొందలు ఖర్చుపెట్టి ఓ ఆరొందలు లాభం మిగుల్చుకుంటాడు యిది యితగాడికొచ్చే పైరాబడి అంతేకాదు, దీంలో యితగాడి పలుకుబడి కూడ పెరుగుతోంది 'ఆహా! లోకేశ్వర్రావెంత భక్తుడు!' అని అంతా—మెచ్చుకోవటవే. కాబట్టి నువ్వు చేసిన యీ అపరాధానికి వచ్చే నెల్లో ఎడ్డీతో సహా చెల్లించుకో అప్పుడ్గాకా అతగాడ్చేత చివాట్లు తప్పవ్ పన్నేస్తే చివాట్లు తప్పతియ్యనకోకు అట్నాడు

కల్యాణ్రావేం చేస్తున్నాడో? అతగాడు ఏణ్ణెల్ల క్రితంవే పెళ్ళి చేసుకున్నాడు. యిపుడు పెళ్ళాని కారొనెల వెళ్ళిచూడు; అతగాడి డ్రాయర్లో అతగాడి పెళ్ళాం ఫోటో లుంటయ్ ఆ టేబిలుమీద పెట్టుకున్నాడే ఫైలు—దాంట్లో పెళ్ళాం రాసిన పుత్తరాలుంటయ్ పెళ్ళాన్ని పుట్టింటికి పంపించాడు రోజూ పుత్తరాలు చదువుకుంటూ గడుపుతున్నాడు రోజూ వచ్చే ఫైళ్ళన్నీ కింద పేరుస్తున్నాడు పెళ్ళాం కడుపుతో వుంటె ఎవడైనా గెడ్డం పెంచుతాడు కానీ యితగాడు ఫైళ్ళని పెంచుతున్నాడు 'కల్యాణ్రావ్? పోనీ నీపెళ్ళాం పుట్టింటి కెళ్ళిందిగదా నువ్వు అత్తారింటికెళ్ళి ఆవిణ్ణి చూసొచ్చి యీ ఫైళ్ళ సంగతి చూడ్రాదూ?' అంటే ఆ పని చెయ్యడు దాని వెనకాలో కథుందిలే ఆ కథ కల్యాణ్రావుకి పెళ్ళయిన కొత్తలో జరిగింది ఓసారి పెళ్ళాన్ని చూసేందుకు కల్యాణ్రావు అత్తారింటికెళ్ళి ఓ రెండ్రోజు లున్నాడు అప్పటికే అతగాడి పాలసీ అత్తారింట్లో మూడ్రోజులకంటె వుండకూడదని 'అత్తారింటో మూణ్ణిద్దర్లు మించి చెయ్యకూడదు అందుకే పెళ్ళవ్వంగానె మూణ్ణిద్దర్లు చేయించి నాలుగోనాడు నాలుగిచ్చి పంపిస్తారు దానర్థం ఎప్పుడైనా సరే అత్తారింట్లో మూణ్ణిద్దర్లు మించి చెయ్యకూడ'దని స్నేహితుల్చెప్పారు అందుకని కల్యాణ్రావు లెక్కేసుకుంటూనే వున్నాడు. రెండ్రోజు



గురుద్యోగ పర్వం

అయ్యాక 'యింకొక్కరోజే వుండేది' అన్నాడు పెళ్ళాంతో ఆమాటత్తగారు విని కత్తిపీట వంటింట్లోంచి పుచ్చుకొచ్చి—

'యింకో రోజేమిటి? భళీవాడివేగానీ బయటికి నడు' అంది.

'అదేమిటి? రెండ్రోజులుగా చేసింది. యింకో నిద్దరుంది' అని మొగుడూ పెళ్ళాం యిద్దరూ అన్నారు

'రెండు నిద్దర్లేమిటి? నిన్న మధ్యాహ్నం భోంచేసి కుంభకర్ణుళ్ళా పొయంకాలంవరకూ నిద్దరోయావుగా? దాంతో కలిపి మూడు నిద్దర్లయినయ్ యిహ నడువ్' అని పెట్టె, పన్నెండు పైసలూ తీసుకొచ్చి బయట పారేసింది' అని ఆగాడు తోటి చిరుద్యోగి

'అదేమిటి? పన్నెండు పైసలెందుకు?' అన్నాడు చిరుద్యోగి

'పన్నెండు పైసలు పారేసిందంటే పన్నెండుపైసలే తీసి బయట పారెయ్యలేదు ఆవిడ పన్నెండుపైసలు కాదుగందా ఒక్క పైసా కూడా పారెయ్యదు 'పెట్టె—పన్నెండుపైసలూ' అంటే ఏమిటంటే 'పెట్టె—బేడా' అన్న సామెతని మార్చానన్న మాట

వయసుపైపడొచ్చి ఎన్నేళ్ళయింది? యింకా 'పెట్టె—బేడా' అంటూ కూర్చుంటే నవ్వుతారని భయంకాదు నవ్వరేమోనని అనుమానం అదీ కల్యాణరావు కథ అందుకని అత్తారింటికే వెళ్ళడు పెళ్ళానికి పురుడొచ్చి ఆవిడిక్కడికొచ్చేదాకా ఆ పైళ్ళని కదిలించనని, వదిలించనని చెప్పేశాడు కానీ నెలనెలా లోకేశ్వరావింట్లో వ్రతానికెళ్ళి, హాజరేయించుకుని, ఓ వెండిగ్లాసు సమర్పించుకుంటాడు కాబట్టి నువ్వు చేసిన తప్పిప్పటికయినా తెల్సిందా' అన్నాడు

'ఊఁ' అన్నాడు చిరుద్యోగి, ఒప్పేసుకున్నానన్నాడు ఆ నెలరోజులు చివాట్లు తింటూ, లోకేశ్వరావు చేసే వ్రతాన్ని గురించి కలలుకంటూ, ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తూ గడిపాడు చివరి కెలాగయితేనేం పాప విముక్తి కలిగించే ఆ రోజొచ్చింది చిరుద్యోగావాడు శుభ్రంగా అభ్యంగనస్నానంచేసి, కొత్తబట్టలు కట్టుకుని ఓ వెండిగ్లాసు, ఓ వెండి అత్తరు బుడ్డి పట్టుకుని, అత్తరుబుడ్డిలో అత్తరు పోయించుకుని లోకేశ్వరావింటి కెళ్ళాడు చదివింపులప్పుడు వెండిగ్లాసు లోకేశ్వరావు చేతిలో పెట్టి, అత్తరుబుడ్డీకూడా లోకేశ్వరావందుకోబోతుంటె వెనక్కి లాక్కుని, దాంట్లో వున్న అత్తరతగాడిమీద చల్లాడు లోకేశ్వరావు చల్లబడ్డాడు అత్తరు బుడ్డి కూడా లోకేశ్వరావు చేతిలో పెట్టాడు ప్రసాదం పెడ్తూ లోకేశ్వరావ్ 'చిరుద్యోగీ! భోంచేసిపోగూడదూ?' అన్నాడు వికసించిన వదనంతో చిరుద్యోగి నమస్కారం పెట్టి ఈ ప్రసాదం చాలు మీ అనుగ్రహం కల్గింది! అదే పదివేలు అది చాలు యింకా నాకు భోజనమెందుకు? ఇవ్వాళింటికెళ్ళి కూడా భోంచెయ్యను, ఆకలిగా లేదు' అన్నాడు

.. అట్లా ఒట్లా లోకేశ్వరావూ, చంచయ్యా కిందివాళ్ళని కొల్లగొట్టి పైవాడికి వెల్లగట్తూ వుంటారు

ఇలాంటి లోకేశ్వరావులూ, చంచయ్యలూ వున్న ఆ ఆఫీసులో నూటిగా పోయే గురుద్యోగంటె పై ఆఫీసరుకి పడదు అందుకే చీటికి మాటికి చీటీ రాసి పిలిపించో, ఫోన్లో పిల్చో మాటి మాటికీ చివాట్లు పెడ్తూవుంటాడు గురుద్యోగిది సున్నితమైన హృదయం ఒకళ్ళచేత ఏవిధమైన సూచనలు చేయించుకునే మనస్తత్వంకాదు అందుకనే ఎప్పుడూ బాధపడ్తూంటాడు తనక్రిందున్న వుద్యోగుల మంచి చెడులు విచారిస్తాడు వాళ్ళకి చెడు జరిగితే విచారిస్తాడు ఇతగాడి మంచితనం కనిపెట్టి చిరుద్యోగులు కూడా తోకలు ఝాడించటం మొదలెట్టారు ఇంట్లో ఎవరికో జబ్బుగా వుందని పనెగ్గొట్టేపోయేవాళ్ళ యింటికెళ్ళి వాళ్ళ పన్లు వాళ్ళు చూసుకుంటుంటే ఆఫీసులో వాళ్ళ పని కూడా గురుద్యోగే చూసుకునేవాడు సెక్షన్ యిన్స్పెక్షన్ సమయం వచ్చేవేళ్టికి చిరుద్యోగులందరూ లీవు పెట్టేసేవాళ్ళు ఆ పనన్నీ రాత్రింబగళ్ళు కూర్చుని తనే చేసుకునేవాడు గురుద్యోగి ఇలా పైవాళ్ళకీ, కిందివాళ్ళకి మధ్య గురుద్యోగి నలిగిపోతున్నాడు

గురుద్యోగి ఆఫీసు వదిలి బయటకొచ్చి రిక్షా ఎక్కి కూర్చుని 'ఉస్సు' రన్నాడు ఆవేళ్టికే పైన వెడ్తున్న పరమేశ్వరుడ్తో పార్వతిలా అంది

'ఇతగాడు చూస్తానికి గురుద్యోగిలా వున్నాడు రిక్షాలో కూడా యెక్కాడు. అయినా యిలా నిట్టూర్చుస్తాడేం ఖర్మ'

'పార్వతీ! యిప్పటికే నీకు బోల్డుసార్లు చెప్పాను పెళ్ళాం ఎప్పుడూ మొగుడిమీదే ఆధారపడకూడదు భూలోకంలో పెళ్ళాలెట్లా వున్నారో చూశావుగా? అందుకని యితగాడి కథ నువ్వే కనుక్కో లేదా ఆ కొట్లో వున్న పత్రిక కొనుక్కో' అన్నాడు పరమేశ్వరుడు పార్వతితగాడి కథ పత్రిక కొనుక్కొని కనుక్కొని,

'పాపం పోనీ యితగాడికి విముక్తి ఎప్పుడు?' అంది

పరమేశ్వరుడు నవ్వి 'అదిగో విముక్తి కలిగించేవాడు కాకాసుర వంశంలో పుట్టి, కొందర్ని పట్టుకుని, మరికొందర్ని కట్టుకుని, అందర్నీ కొట్టుకుతింటూ పెరిగి పెద్దవాడెప్పుడో అయ్యాడు అతగాడికి బోల్డు యుక్తులెత్తుల్సు గురుద్యోగికి విముక్తి మార్గం చూపించాల్సింది ఈతగాడే పేరు ముక్తేశ్వరావ్' అని ఆగాడు పరమేశ్వరుడు

'పాపం గురుద్యోగి చాలా బాధ పడ్తున్నాడు గురుద్యోగిదగ్గరి కితగాణ్ణి తొందరగా పంపిద్దురూ' అంది పార్వతి

'పార్వతీ! తొందరపడితే ఎట్లా? కాలం రావాలి కాలం రావటమే కాకుండా కాలం అదృష్టంతో కల్సిరావాలి గురుద్యోగింకా కొంతకాలం బాధపడాలి అందుకే ముక్తేశ్వరావ్ మూడో కథలో వస్తున్నాడు సరే, మనం యిహ వెడదామా?' అంటూ పరమేశ్వరుడు నడక వేగం హెచ్చించాడు

'అయ్యో ముక్తేశ్వరా వచ్చేది మూడో కథలోనా?. మరి రెండో కథ ఏమిటి?' అన్న పార్వతి మాటలు పరమేశ్వరుడికి వినిపించలేదు

(ఇంకా వుంది)

టార్జీ విట్టాచీ

బీటిల్స్ ఋషీకేశానికి ఎందుకు వెళ్లారు?

బీటిల్స్ భారతదేశంలోని ఋషీకేశానికి తీర్థయాత్ర చేస్తున్నారెందుకు? వాళ్లని వెక్కిరించటం తేలిక కాని నిజం తెలుసుకోవటం కష్టం. బీటిల్స్ ఉన్నా ఏమిటి? మనం 'సాధారణ పరిస్థితి' అనుకునేది నిజానికి గందరగోళం. దానిని తప్పించుకోవాలని బీటిల్స్ కోరికా? టార్జీ విట్టాచి వ్యాసం చదివి చూడండి!

'ఋషీకేశం రోగం' అనేమాట ఇక్కడ పరిపాటి అయిపోయింది. ఎందరో యువతీ యువకులు లక్షాధికారులు మహా ఋషి మహేష్‌యోగి ఆశ్రమానికి వెడుతున్నారు. కొందరు దీనిని విచక్షణలేకుండా తిడుతున్నారు. మరికొందరు విచక్షణలేకుండా పొగడుతున్నారు. 35 ఏళ్ల వయివాళ్లు మొదటితరం వారు, రెండోతెగలో చిన్న వయస్సువారు అధికం. ఏదయినా ఒకమతం వయికి వస్తూ ఉంటే నమ్మేవారూ, నమ్మని వారూ ఉంటారు. వారి వైఖరులు ఇలా బయటపడుతూ ఉంటాయి.

నమ్మనివారి వాదన—

1 బీటిల్స్ బుద్ధి మట్టంగా ఉన్న కుర్రకారు. వారికి అమాంతంగా డబ్బు వచ్చి పడటంతో ఏంచెయ్యాలో తెలియక ఇలా దారి తప్పుతున్నారు. ఎందరినో తప్పిస్తున్నారు.

2 ఈ కొత్తమతం బాధ్యతా రహితం అయినది. స్వార్థంతో కూడినది. మనుష్యులు మానవాభివృద్ధికి తోడ్పడకుండా ఆపి ఆత్మానుశీలనలో ముంచేస్తోంది.

3 ఇప్పుడున్న మతాలకేమి తక్కువని ఈ కుర్రకారిలా వింత మతాల వయిపు మొగ్గు చూపుతోంది?

4 మహర్షి (మహేష్‌యోగి) దొంగ సన్యాసి అని తెలుస్తూనే ఉంది. ఆ వెర్రి నవ్వు చూస్తే డోకొస్తుంది!

5 మహర్షి కలవాడు. అతని ఋషీకేశం ఆశ్రమం పెద్ద భవనం. అతనికి ఎయిర్‌కండిషన్‌డ్ కారు ఉంటుంది అంటారు కొందరు వార్తాహరులు.

ఈ విమర్శ సారాంశం ఏమిటి? దాని ప్రమాణాలు ఎటువంటివి? ఒక్కొక్క విమర్శనా పరిశీలిద్దాము.

ఒకటి—బీటిల్స్‌కి బుద్ధి మట్టమా కాదా చర్చనీయం. ఎవరి అభిప్రాయం వారిది. అసలు తమకితామె తెలివిగలవాళ్లమని చెప్పుకోట లేదుకదా వాళ్లు! అందుకనే అన్వేషణలో పడ్డారు. ఇక వారి ఐశ్వర్యం సంగతా, ఎవరి డబ్బు మట్టుకు పూర్తిగా అర్హతని పట్టివచ్చింది? ఈ యువకులు తమ సంగీతం ద్వారా ఎందరినో ఆకర్షించ గలిగారు. జానపద సంగీతాన్ని పూర్తిగా మార్చేశారు.


వారి అనుచరులంతా అంత విచక్షణలేని వారా అంటె, అదీ చర్చించవలసిన విషయమే. 'అందరూ' అని ఎలా అంటాము? ఈ యువానుచరుల కన్నా వారి పెద్దలేమి మెరుగు? ఎన్ని ప్రపంచయుద్ధాలు, ఎన్ని రాజకీయ మత కలహాలు వారిద్వారా ప్రపంచాన్ని నాశనం చేసాయి!

పెద్దవారి మూఢనమ్మకాలని పిన్నవారి మీద తోస్తానంటే వారెందు కిష్టపడతారు? వారి నమ్మకాలని వారే కల్పించుకుంటానంటే ఎందుకు అడ్డుపడాలి? మనమూ—వాళ్లూ.

రెండు—మహర్షి కొత్తమతం బోధించటం లేదు. యోగశాస్త్రం మతంకాదు. ప్రతి వ్యక్తికీ ఆత్మ పరీక్షకి తోడ్పడే సాధనాల కలయిక. అతని మతం ఏదయినా అవి అడ్డురావు. ఈ సాధనాలు అవసరం లేదనేవారున్నారు. పరలోక సాధనం అవసరం అని నమ్మేవాళ్లూ ఉన్నారు (వేనటువంటివాడిని!) కాని అవి ఎవరికీ అవసరం లేదు అనటం నాన్సెన్స్ అని నా అభిప్రాయం. మహర్షి సాధనాలని పరీక్షించి దానిని పరిశోధించకుండనే వాటిని కొట్టివెయ్యటం అంతకన్నాను.

బీటిల్స్, ఇతరులు రోజుకి 20 నిముషాలు 'అత్యున్నత ధ్యానం' చేసినంత మాత్రాన వారు ఏవిధంగా మానవాభివృద్ధికి తోడ్పడకుండా పోతున్నారు? వారు తమ సాంఘిక బాధ్యతలని ఎలా తప్పించుకుంటున్నారు?

(64 వ పేజీ చూడండి





ఇలా జరుగుతుందనుకోలేదు

• దాస్ బాబు

ఈ సంఘటన జరిగి ఆరునెలలు కావొస్తుంది— కాని మర్చిపోవాలని ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడంలేదు ఈ విషయం గుర్తొచ్చినప్పుడల్లా ఆ దృశ్యం నాకళ్లముందు మెదుల్తుంది నన్ను చిత్రహింస చేస్తుంది.

రాంచినుండి అన్నాయ్ నన్ను రమ్మని ప్రతి శెలవలముందు వ్రాసేవాడు దూరప్రయాణం విసుగని యేదోసాకుచెప్పి తప్పిస్తూ వచ్చాను కాని పోయిన వేసవి శెలవల్లో వెళ్లక తప్పిందికాదు

అసలు అన్నాయే వచ్చాడు—విజయవాడలో తన మిత్రుని పెళ్లివంక మీద. అతను కూడాడాక్టరే

అప్పటికి నా పరీక్షలయ్యాయ్ అమ్మతో చెప్పి ప్రయాణంకట్టాడు

'ఆడపిల్ల అంతదూరం యెందుకని' అమ్మ గొణిగి వూరుకుంది.

'వెళ్ళొస్తుందమ్మా' అని మాత్రం అన్నాడు నాన్న

నాకు మట్టుకు ఆట్టే యిష్టంలేదు అయినా ఒకసారి వదిన్ని, కిట్టిగాన్ని చూడొచ్చు నన్న ఆశకొద్దీ బయలుదేరాను కాని యిలా జరుగుతుందనుకోలేదు.

రెండురోజుల ప్రయాణం.

చాలా చిరాకుగావుంది

మెయిలని పేరేగాని గుర్తొచ్చినప్పుడల్లా ఆగుతూ—పొలాల్ని, జీడిమామిడి తోటల్ని పరామర్శిస్తూ, ఆవలింతలతో ఖరగ్‌పూర్ చేరుకొంది

దీనికితోడు అన్నాయ్ వర్ణన

బీహారులో క్షామపీడితుల యోగ క్షేమాలు !

ఒకరోజంతా వీళ్లనుగురించే పైగా మనం యేంచేద్దాం వీళ్లకోసం అంటాడు

మనం యేం చేస్తాం?

భగవంతుడికే లేని దయా దాక్షిణ్యాలు మరెవరికుంటాయని విస్తుపోతాడు

రెండో రోజంతా తన ఆస్పత్రి గొడవ. రోగుల బాధ దగ్గరనుండి నర్సులు పడే బాధ వరకు వర్ణించాడు

ఈ రెండురోజులు నాకు సరిగ్గా నిద్ర పట్టిందికాదు రాంచి చేరుకొన్నాం

కిట్టి బెంగాలీ వాళ్లతో కలిసి వుంటాడట, నన్ను బెంగాలీలో పలకరించి నవ్వాడు

వదినకు నేనంటే చాలా ప్రేమ అమ్మకంటె ఎక్కువ శ్రద్ధ చూపిస్తుంది

నాలుగురోజులు అక్కడి విషయాలు, ఇక్కడి విషయాలు చెప్పుకొంటూ గడిపాం మరో నాలుగు రోజుల్లో చూడవలసిన స్థలాలన్నీ చూశాం రెండురోజుల పాటు విశ్రాంతి ఆ తర్వాత గంట గడపాలంటే యెంతో కష్టంగా వుండేది అన్నాయ్ పనిచేసే ఆస్పత్రి నాలుగుమైళ్ళదూరం వుంటుంది ఒకటి రెండుసార్లు వెళ్లాను. రోగాలకి అంకితం చేసుకొన్నవాళ్ల నిలయం. తేలికగా యెవరూ బాగుపడరు ఏడాదికెవరైనా బాగుపడి బయటపడినా—చెయ్యడానికేమీ లేదు—తింటానికేమీ దొరకదు. అందుకేనేమో ఆస్పత్రినుండి వెళ్లడానికిష్టపడినట్లు లేరు దరిదాపుల్లో వున్నవాళ్లనంతా జమచేసి వాళ్లతో నానా అవస్థలు పడుతున్నారు ఆస్పత్రివాళ్లు.

మరో రెండురోజులు గడిచాయ్

సాయంత్రం చల్లగాలికి తోటలో కూర్చున్నాం

కిట్టి ప్రైవేటుకెళ్లి వచ్చాడు వదరుబోతు అదేపనిగ వాగేస్తున్నాడు

అంతలో ఆస్పత్రినుండి అన్నాయ్ వచ్చాడు.

వదిన లేచి నిలువబడింది

అన్నాయ్ దగ్గరకొస్తూ అన్నాడు— 'ఓ క్రిష్టియన్ ఫాదర్ నాతో కూడా వచ్చాడు'

వారిని చూట్టానికి లోపలికెళ్లాం.

అన్నాయ్‌కి మత పట్టింపులేవీ లేవ్.

వారు గదిలో కూర్చుని వున్నారు అన్నాయ్ మమ్మల్ని పరిచయం చేశాడు

వారు బీహారు క్షామ పీడితులకు సహాయం చేస్తున్నారట. వదిన లోపల కెళ్లింది

మాటల సందర్భంలో అన్నాను— యింట్లో కూర్చోవడం కష్టంగా వుందని ఫాదర్ నవ్వుకొంటూ అన్నారు—మాతో కలిసి నాలుగురోజులు పని చెయ్యమని. వారికి తెలుగురాదు ఇంగ్లీష్‌లో మాట్లాడారు ఆమాటకొస్తే మాయింట్లో తప్పితే బయట కెక్కడికి వెళ్లినా ఇంగ్లీషులోనే మాట్లాడవల్సొచ్చింది

వదిన కాఫీ తెచ్చింది

అన్నాయ్‌వైపు చూశాను

అన్నాయ్ చెప్పాడు నీ విషయం వదినతో.

ఆమె మామూలు ధోరణిలో అంది— ‚ఎండలో అమ్మాయిని త్రిప్పడం యేం బావుంటుందని'

అయినా నేను వొప్పుకొన్నా కాని.

ఇలా జరుగుతుందనుకో లేదు

ప్రొద్దున్నే మా యింటికి వ్యాన్ వస్తుంది ఫాదర్‌తో బాటు మరో యిద్దరుంటారు అంతాకలిపి దగ్గరున్న పల్లెటూర్లకు వెళ్లి బొత్తిగా యేమీలేని వాళ్లను పరామర్శించాలి. కూడా తీసుకెళ్లిన గోధుమ పిండి యింటికి రెండేసి కిలోలు యివ్వాలి. ఇది అనుకొన్నంత తేలికేమీకాదు ఎవరికేమీవుందో యేమిలేదో ముందు తెలుసుకోవాలి నేనువెళ్లిన ప్రాంతాలన్నీ ఒకటే ఎవరికి యేమిలేదు కనీసం శుభ్రంగా త్రాగడానికి మంచి నీళ్లైనా లేవు అంతా యిండ్లముందు కూర్చొంటారు — పిల్లల్ని ముందేసుకొని ఖాళీ గిన్నెల్నిచూసి పిల్లలు యేడుస్తుంటే వాళ్లను చూసి పెద్దలు యేడుస్తుంటారు. ఎక్కడకెళ్లినా యివే దృశ్యాలు కొంత మందికి మరోవిధంగా సహాయం లభిస్తుంది ఏమీ దొరకని వాళ్ల జాబితా తయారు చెయ్యాలి ముందు ఆ తర్వాత పంపకం. నాకు యిలాంటి జాబితా తయారుచేసే పనిని పెట్టారు

వ్యాన్‌లో వెళ్లడం— వ్యాన్‌లో రావడం.

డ్రైవరు బోసు సహాయంతో ఒగంటలో పేర్లు వ్రాసుకరావడం ఫాదర్‌కు యివ్వడం

మొదటి రెండు రోజులు సరదాగానే గడిచాయ్.

మూడురోజు రాత్రో అవే పల్లెటూరికి వెళ్లాం. మరీ అంత అధ్వాన్నంగా యేమీ-లేదు అక్కడ పరిస్థితి. రెండవసారి తర్శిస్తున్నారట అక్కడ.

ఊరిబయట పెద్దబావి తిస్తున్నారు. తాడునబట్టి బావి యెంత లోతువుంది వూహించుకోనచ్చు ఇంకా లోతుగ త్రవ్వుతున్నారు ఆవూరి వాళ్ల చాలామంది వున్నారక్కడ ఫాదర్‌కు తెలిసిన వాళ్లు వుంటే కొద్దిసేపు ఆగి వాళ్లతో మాట్లాడి వూరిలోకి వెళ్లాం ఓచెట్టు క్రింద వ్యాన్ ఆపుజేసి ఫాదర్ ఒకవైపు, నేను బోసు మరొకవైపు వెళ్లాం

బోసుకు ఓ మాదిరిగ యింగ్లీష్ వొస్తుంది నాతో మాట్లాడాలని అతనికి చాలా యిష్టం. ఏదో వొకటి యెప్పుడు చెప్తూనే వుంటాడు కొన్నిసార్లు తనేమి చెప్పేది నాకర్థమయ్యేదికాదు

ఇంటింటికి తిరిగి పదిపేర్లు వ్రాశాను.

చివరింటికి వచ్చాం.

అతనితో పరిచయం యిక్కడనే జరిగింది.

ఇంటి అరుగుమీద ఒక్కడే కూర్చొని మావైపు చూస్తున్నాడు.

దగ్గర కెళ్లాం.

పల్లగ, చవుడబు పీక్కుపొయ్యి, చిరిగిపోయిన దుప్పటిమీద నేసుకొని వున్నాడు

అతను కళ్లు పెద్దవిచేసి నావైపు అదేపనిగ చూస్తుంటే అదోమాదిరిగ అనిపించింది

అతనలా చూట్టం బోసు కిష్టంలేదు ఆచూపులు మళ్లించడానికి నాలుగైదుసార్లు ప్రయత్నించాడు, యేవో ప్రశ్నలడిగి

కాని రెప్పలైనా వాల్చకుండ వింతగ చూస్తున్నాడు

పేరు వ్రాయక ముందు అడిగే నాలుగు ప్రశ్నలు అడిగాను.

బోసు తర్జుమా చేసి అడిగాడు కోపంగా

కాని అతనేమి జవాబివ్వలేదు.

అలాగే చూస్తున్నాడు నా వైపు వికారంగా.

పేరు అడగమని బోసుతో అన్నాను.

దానికీ జవాబు లేదు.

చాలా కోపమొచ్చింది.

'చావనీయ్' అని వెనక్కు తిరిగాను.

మేమిద్దరం వ్యాన్ దగ్గర కొచ్చాం.

ఫాదర్ నా కోసం యెదురు చూస్తున్నారు,

నా జాబితా యిచ్చాను

ఇంటికి మూడు కిలోల పిండి యివ్వొచ్చునని అంచనా వేశారు ఆ తర్వాత పంపకం జరిగింది.

వ్యాన్‌లో కూర్చోడానికి వెనక్కు తిరిగాను

అతను చెట్టు ప్రక్కగా నిలువబడి నా వైపు చూస్తున్నాడు అవే చూపులు.

ఫాదర్ అతని దగ్గర కెళ్లాడు.

నేను లోపల కూర్చున్నా

కొద్దిసేపట్లో ఫాదర్ నా దగ్గర కొచ్చి— 'నీకేమి అభ్యంతరం లేకపోతే యితన్ని కూర్చోనివ్' అంటూ తలుపు తెరిచి అతన్ని పిలిచాడు

ఫాదర్ వైపు చూశాను, కాని తనేమి పట్టించుకోలేదు అతనొచ్చి నా ప్రక్కలో కూర్చున్నాడు— నా వైపు చూస్తూ. అవే చూపులు.

వ్యాన్ కదిలింది.

ముళ్లకంప మీద కూర్చున్నట్లుంది.

అతనింకా అలాగే చూస్తున్నాడు — దిష్టిబొమ్మలా.

నా పర్సులో నుండి కాడ్‌బరీ చాక్లెట్ తీసుకొని తిన్నాను దానిమీద కాగితం నలిపి కాళ్ల దగ్గర పడేశాను.

అతను దాన్ని పైకితీసి జాగ్రత్తగా మడతలు సరిజేసి జేబులో పెట్టుకొన్నాడు పర్సులో మరో చాక్లెటు వుంది దాన్ని అతని కివ్వబోయాను — కాని మనిషిలో చలనం లేదు కాస్త చెయ్యిచాపి అతనికి దగ్గరగా వుంచాను

అడివి మనిషి, యేమి తెలిసినట్లు లేదు అలాగే చూస్తున్నాడు.

కోపంగా పర్సులో పడేశాను చాక్లెట్టును

నా సహాయానికి నోచుకోలేను.

పైగా నా ప్రక్కలో కూర్చున్నారు

వ్యాన్ మలుపు తిరిగి బావి దగ్గర కొచ్చింది.

ఫాదర్ క్రిందకు దిగాడు

నాకూ దిగాలని పించింది. ఇవతలి తలుపు తెరుచుకొని దిగాను. నా వెనకాలే అతనూ బయట కొచ్చాడు — నా నీడలా, పల్లగా.

— బావిలోనుండి రాళ్ళు, బురద తోడేస్తు

న్నారు.

బావిదగ్గర కెళ్ళాను ఫాదర్ వాళ్ళను పలకరిస్తున్నారు

నాకో ఆలోచన తట్టింది

ఇతనుకూడా వాళ్ళతో పనెందుకు చెయ్యకూడదు?

ఎంత దరిద్రానికి దాసుడైనా సహజంగావుండే బలం వుడిగిపోలేదు

ఫాదర్‌తో నెమ్మదిగా చెప్పాను వుద్దేశం

అతన్ని పిలిచి ఈవిషయం చెప్పాడు. పైగా వేసిచ్చిన సలహాలా చెప్పినట్లుంది అతను నావైపు చూశాడు అదోమాదిరిగ బావివైపు నావైపు చూస్తూ ముందు కెళ్ళాడు.

ఫాదర్ యేమిటో చెప్పాడు అతనితో

నేనొచ్చి వ్యాన్‌లో కూర్చొన్నా చాలా తేలికగా

పీడ వదిలిందనుకొన్నా, కాని

ఇలా జరుగుతుందనుకో లేదు

వ్యాన్ కదిలింది

'అతని పేరు ఉదయభాన్ ఒకప్పుడు పెద్ద రౌడీ చుట్టుప్రక్కల అతనంటే హడల్ పెళ్లిచేసుకొన్న తర్వాత చాలా మారాడు కాని పోయిననెల అతని భార్య చనిపోయింది పాపం ఒంటరిగాడు ఆమె చాలా అందంగా వుండేది' ఫాదర్ చెప్పాడు

నామనసెందుకో బాధపడింది

అతనూ, అతని చూపులు నాకళ్ళ ముందు మెదిలాయ్

నావైపు అలా చూట్టంలో అతని వుద్దేశ్యమేమిటో?

ఆచూపులకేమైనా అర్థముందా?

నన్నెలా వూహించుకొన్నాడో?

ఇవే తలంపులు

వ్యాన్ మాయింటిముందు ఆగింది.

నేను లోపల కెళ్ళాను

స్నానంచేసి భోజనానికి కూర్చున్నా

"ఏమిటి ఈరోజు విశేషాలు?" వదిన అడిగింది.

అతనూ అతని చూపులు నాకళ్ళముందు మెదిలాయ్

'ఈరోజు ఒకవింత మనిషినిచూశాన' నవ్వుకొంటూ అన్నా

'వింతమనిషా? ఎక్కడా?' దీర్ఘంతీస్తూ అంది.

ఇలా జరుగుతుంది...

గట్టిగ నవ్వాను ఆమె బిత్తరపోయింది.

'పిచ్చివదినా' జరిగిందంతా చెప్పాను.

'అదేపనిగ దిష్టిబొమ్మను చూసినట్లు చూస్తే నాకు బలేకోపం వచ్చింది తెలుసా?' అన్నాను

'మరింత అందంగా యేందుకున్నావ్?' వదిన అంది

'ఉంటే?'

వదిన గట్టిగ నవ్వింది.

భోజనాలయ్యాయ్

పేపరు ముందేసుకొని కూర్చొన్నా అతను నా కళ్ళముందు మెదిలాడు

అవే చూపులు

అత నెందుకలా చూస్తుంది ఎంతకీ బోధపడలేదు

పేపరు ప్రక్కగా నెట్టి బలవంతాన నిద్రపోయాను కిట్టి ప్రైవేటు నుండి వచ్చి నన్ను లేపాడు


'వసుంధరా ఆస్పత్రికి వస్తావా?' అంటూ అన్నాయ్‌దగ్గర కొచ్చాడు నా మగతను గమనించి మళ్ళీ అడక్కుండనే వెళ్ళిపోయాడు ఆ సాయంత్రం తోటలోనే గడిపాం.

రాత్రి వదినా నేనూ చదరంగం ఆడి పండుకొన్నాం

అన్నాయ్ చాలా ఆలస్యంగా వచ్చినట్లుంది ప్రొద్దున్నే వెళ్ళిపోయాడు కూడా.

పదిగంటలకల్లా వ్యాన్ వొస్తుంది కాని ఆ రోజు వెళ్ళడానికి సహించలేదు ఫాదర్‌తోచెప్పి అసలు మానుకొందామని వరండాలో కూర్చొన్నాను

పదకొండు దాటింది—వ్యాన్ జాడలేదు



కిట్టికి లెక్కలుచెప్పి భోజనానికి లేచాను ఆరోజు వెళ్ళడం తప్పింది. కాని అతను నా కళ్ళముందు మెదిలాడు

అవే చూపులు

భోజనాలయిన తర్వాత చదరంగం ఆడాం నేను ఓడిపోయాను. వదిన గెలవడం అదే మొదటిసారి అన్నయ్యను నిద్రలేపి మరీచెప్పింది

సాయంత్రం ఆస్పత్రికి వెళ్ళడానికి నిశ్చయించుకొన్నా ఇద్దరం ఆస్పత్రికి వెళ్ళాం.

అన్నాయ్‌దగ్గర కొద్దిసేపుండి వార్డులు చూట్టానికి బయలుదేరాను చాలా పెద్ద ఆస్పత్రి చివరి వార్డుకి వచ్చాను తలుపు ప్రక్కలోవున్న టేబులు దగ్గర కూర్చొని సిస్టర్ రిపోర్టులు వ్రాసుకొంటుంది నే నామెకు తెలియదు పరిచయం చేసుకొన్నా ఆ వార్డులోవున్న రోగుల్ని చూసుకొంటూ చివరి బెడ్‌దగ్గర కొచ్చాను మెడవరకు దుప్పటి కప్పివుంది కళ్ళు మూసుకొని భారంగా శ్వాసిస్తున్నాడు

దగ్గర కెళ్ళాను

అతను ఉదయభాన్ !!

నా గుండె వేగంగా కొట్టుకొంది.

అతనెందుకొచ్చాడు? ఏమైంది?

తల దగ్గరగావెళ్ళి చార్టు చూశాను. నా కర్థంకాలేదు

చార్టు గోడకు తగిలిస్తుంటే జారిపడింది ఆ శబ్దానికి అతను కళ్ళు తెరిచాడు

నావైపు చూశాడు

నన్ను గుర్తుపట్టాడేమో, ఆచూపుల్లో ఓ మూల కాంతి కనిపించింది అతని పరిస్థితి నాకేమి అర్థంకాలేదు అలానే చూస్తూ నిలబడ్డాను అతనూ చూస్తూనే వున్నాడు

నా పర్సులోనుండి చాక్లెట్ తీసి కివ్వబోయాను కాని, తీసుకోలేదు అతను చూసేలా ప్రక్కనున్న బల్లమీద పెట్టాను.

అటు యిటూ మెదిలి 'పానీ' అన్నాడు.

అదే మొదటిసారి అతను మాట్లాడడం.

బల్లప్రక్కగా కూజా, గ్లాసువున్నాయ్. గ్లాసులో నీళ్ళుపోసి అతని దగ్గరకు తీసుకెళ్ళాను

నా వైపు అలాగే చూస్తున్నాడు.

'పానీ' అని నెమ్మదిగా అన్నాను.

అతను నోరు తెరిచాడు

అంటే అతని పుద్దేశం—నేను తాపించా లనా ?

సిస్టర్ పిలిచి గ్లాస్ చేతికిచ్చాను. అప్పుడు చెప్పింది.

విన్న బావి పూడిక తీస్తుంటే పెద్ద రాయి చేతులమీద పడిందట చేతులు నలిగిపోయాయ్. రెండుచేతులు గూడల వరకు తీశేశారు. ఆమె దుప్పటితీసి చూపించింది.

నేనా దృశ్యం చూడలేక పోయాను.

గట్టిగ కళ్ళు మూసుకొన్నా రెండు చేతులతో. భగవంతుడా యేమిటీ ఘోరం?

కళ్ళు తెరిచేటప్పటికి సిస్టర్ అతనికి నీళ్ళు తాపిస్తుంది. ఆమె గుండెమీద అతని తలవుంది. నా వైపు అదో మాదిరిగ చూసింది. నా నోటివెంబడి మాట రాలేదు.

అతనివైపు చూసే ధైర్యంకూడా లేదు వెంటనే యింటికి వచ్చేశాను.

ఇలా జరుగుతుందనుకోలేదు.

ఆరాత్రినేనుపడినబాధభగవంతుడికి తెలును.

అతనలా అవడానికి కారణం నేనుకాదని ఎన్నివిధాల చెప్పుకోవాలని ప్రయత్నించినా నా మనస్సాక్షి ఒప్పుకోలేదు.

కనీసం అతనికి మంచి నీళ్ళైనా యివ్వలేకపోయాను.

ఫాదర్, నేనూ తప్పితే మరెవరూ లేరేమో అతనికి.

చేతులు లేనిమనిషి జీవితం చావుకంటె ఘోరం.

ఏడ్చిఏడ్చి నిద్రపోయాను—ఒక నిశ్చయానికొచ్చి.

ఉదయాన్నే పాలు తీసుకెళ్ళి అతనికివ్వాలి నాచేతులతో తాపిస్తే యింత పువ శాంతైనా కలుగుతుందన్న నమ్మకంతో ప్రొద్దున్నే లేచాను.

అన్నాయ్ వదిన యెవరూ లేవలేదు.

పాలు ఫ్లాస్కులో పోసుకొని, కారు బయటకు తీసుకొని ఆస్పత్రికి వెళ్ళాను.

గబగబా చివరివార్డుకు వెళ్ళాను.

సిస్టర్ వెళ్ళిపోవడానికి సిద్ధపడుతుంది.

నన్ను చూసిందిగాని పలకరించలేదు.

తల దించుకొని చార్టులు పూర్తి చేస్తుంది.

'ఉదయభానుకి పాలు తెచ్చాను' అన్నాను కాని ఆమె జవాబివ్వలేదు.

'అతనికిచ్చేస్తా...' నంటూ రెండడుగులు వేశాను.

నన్ను పిలిచింది.

ఆగి ఆమెవైపు చూశాను.

'నిన్న మిమ్మల్ని నీళ్ళడిగితే కళ్ళు మూసుకొన్నారు... ఇప్పుడు పాలు యివ్వడానికొచ్చారా?' అంది ఎత్తిపొడుస్తూ.

కోపంగా చూశాను.

'మీరు చాలా ఆలస్యంగా వచ్చారు, రాత్రి అతను చనిపోయాడు,'

నాచేతిలో ఫ్లాస్కు జారిపోయింది.

ఒళ్ళంతా కంపించింది.

నాకు తెలియకుండానే అతని మంచం దగ్గర కెళ్ళాను. అతను లేదు.

బల్లమీద రెండు చాక్లెట్లు కాగితాలున్నాయ్.

అతను నా కళ్ళముందు మెదిలాడు.

అవే చూపులు ...

నా హృదయాన్ని దహించి వేస్తున్నాయ్.

ఇలా జరుగుతుందనుకో లేదు. ●

ఎనిమిది నిండుప్రాణాల బలి



వి. యస్. సుక్థాంకర్

అది చిన్న పంకం మూడు అడుగుల ఎత్తు, రెండడుగుల వెడల్పు అది అక్కడ ఎడు దశాబ్దాలుగా ఉంది అక్కడ, అంటే పూనాలోని గవర్నమెంటు భవనం ద్వారానికి 500 గజాల దూరంలో గణేశ్ ఖిండ్ రోడ్డుమీద ఒకచోటు ఆ ఫలకంమీద చెక్కి ఉన్న మాటలు ఒక భయంకరమయిన గాథని గుర్తు చేస్తాయి ఎనిమిది నిండుప్రాణాల బలి గాథ

అది ఒక వెన్నెల రాత్రి గణేశ్ ఖిండ్ ప్రభుత్వ భవనం దీపాలతో మరింత మెరిసి పోతోంది ప్రభుత్వంవారు విక్టోరియా రాణి సింహాసనాధిష్టాన రతోత్సవం చేసు కుంటున్నారు ఒక భవనం, దాని ఆవరణ మాత్రమే కాక చుట్టుపక్కల గుట్టలని కూడా కాంతివంతం చేశారు అక్కడక్కడ పెద్ద మంటలు వెలిగించారు

భవనంముందు అందంగా అలంకరించిన గుర్రపు బండీలు నుంచుని ఉన్నాయి ఒక పక్క బాజా సంగీతం ఉత్సవ వాతావరణాన్ని ఇనుమడింప చెయ్యటానికి ప్రయత్నిస్తోంది

భవనంలోపల బొంబాయి గవర్నర్ శాండ్‌హర్స్ట్ ప్రభువు పెద్ద విందు సన్నాహాలు ప్రారంభించారు

మధ్యరాత్రి సమయం కావస్తోంది.

భవనంముందు ఆపి ఉన్న గుర్రపుబళ్ళు ఒక్కొక్కటే కదలటం ప్రారంభించాయి మొట్టమొదట పూనా కలెక్టరు శ్రీ రాండ్ బండి వదిలింది ఆయనకి మంచి కార్యదక్షత కలవాడనే పేరు ఉండేది

భవనం వదిలి వెడుతున్న రాండ్ మనస్సులోని ఉత్సుకత హఠాత్తుగా మారిపోయింది సంతోషం తగ్గిపోయి ఒక రకమయిన విచారం పొడసూపింది రహదారి మీద వెడుతున్న అతని చూపులు అక్కడే ఉన్న కొన్ని గుడిసెలమీద లగ్నంకావటమే దానికి కారణం అయిఉండాలి గుట్టమీద చతుశ్శృంగి దేవాలయం ఉంది గుట్టకి ఎదురుగా ఉన్నాయి ఈ గుడిసెలు అవి అంత పాతవికావు అతనికిముందే అవసరవసరంగా కట్టినవి వాటి అతుకుల నిర్మాణమే ఆ సంగతిని తెలుపుతోంది. లోపల గుడ్డిగా కొన్ని కిరసనాయిలు దీపాలు వెలుగుతున్నాయి

ఈ గుడిసెలలో ఉండేవారెవరు? రాండ్ ఆలోచనలని చెడగొట్టగలిగిన ఈ గుడిసెల విశేషం ఏమిటి ?

అందులో నివసిస్తున్న జనం పేదజనం కాదు సంపన్నులే! అయితే ఇక్కడ ఉంటున్నారు దేనికి?

పూనా నగరంలో కొంతకాలం ప్లేగు వ్యాధి భీభత్సంగా చెలరేగింది ఇది దేశం మొత్తంమీద తలఎత్తినా, పూనాలో మరింత ఉధృతంగా ఉంది నగరంలో ప్రజలు ప్లేగు [illegible] నగరంలో ఉండటానికి భయపడి కొందరు ధనవంతులు నగరపరిసరాలలో గుడిసెలు కట్టుకుని వాటిలో నివసిస్తున్నారు. (మరికొందరిని ప్రభుత్వాధికారులే ఊరి నుంచి బదిలీచేయిస్తున్నారు) మొత్తానికి ప్రజలంతా భయంతో వణికిపోతున్నారు

ఈ ప్లేగు వ్యాధి భీభత్సాన్ని అరికట్టే బాధ్యత ప్రభుత్వం రాండ్‌కి అప్పగించారు అతను తన శాయశక్తులా కృషి చేస్తున్నాడు కాని తన ప్రయత్నాలు ఏమాత్రం సరిపోవటం లేదేమోనని అనుమానం అతన్ని పీడిస్తోంది

అందుకనే ఆ గుడిసెలని చూడటం తోటే రాండ్ మనసులో కలవరం బయలుదేరింది భవనంలోపలి ఉత్సవం వేడుకల నుంచి భయంకర మృత్యువుమీదకి మళ్ళాయి అతని ఆలోచనలు

పాపం! రాండ్!

ఈ చింతనలో మునిగిఉన్న రాండ్ గుర్రపుబండి దగ్గరగానే ఒక తుపాకి పేలింది. దాని ధ్వనితో ప్రశాంత వాతావరణం దద్దరిల్లిపోయింది. తుపాకి

గుండు అతని మెడలోకి దూసుకు పోయింది. అతను తన వాహనంలో కుప్పగా కూలిపోయాడు ..

అతని బండి వెనుకబండిలో లెఫ్టినెంట్ అయార్స్ట్ అనే అతను తన భార్యతో వస్తున్నాడు రివాల్వరు పేలుడు వారిద్దరినీ అదరగొట్టింది అయార్స్ట్ తనతోటి ఇంగ్లీషువాడయిన రాండ్ సహాయానికి వెడదామనుకుంటూ ఉండగా అతని వెనుక మరొక తుపాకి పేలింది

ఈసారి అయార్స్ట్ తుపాకి గుండుకి బలి అయ్యాడు

రోడ్డుకి ఇరువయిపులా దట్టమయిన పొదలు ఉన్నాయి వీటిలోనుంచి ఒక్కటిగా ఉరికిన ఇద్దరు యువకులె బళ్ళమీదకి ఎక్కి తుపాకులు పేల్చారు ఆ వెను వెంటనే మళ్ళీ చీకటిలోకి అదృశ్యులయారు

ఇంతకిముందే చెప్పినట్లు పూనా ప్రాంతంలో ప్లేగు వ్యాధి బీభత్సం దేశంలో తక్కిన ప్రాంతాలకన్నా తీవ్రంగా ఉంది. రాండ్ ఈ సందర్భంలో ప్రత్యేక కృషి చేస్తున్నాడు అయార్స్ట్ అతనికి సాయం చేస్తున్నాడు. ఇద్దరూ పూనా ప్రజల దైనందిన జీవితంలో పరిశుభ్రత అలవరచి ప్లేగు తీవ్రత తగ్గించటానికి ప్రయత్నించేవారు రోగులని వేరుగా ఉంచటానికి ప్రయత్నించేవారు వారి ప్రయత్నాలకి పూనా నగరవాసుల ఉదాసీనత పెద్ద అవరోధం అయిపోయింది అందుచే కొందరు పుర ప్రముఖుల ఇళ్ళు గాలించి రోగంవచ్చిన వారిని వేరుగా ఉంచటానికి పనిచేస్తున్న బ్రిటిషు సోల్జర్లకి తోడుగా ఉండమని కోరారు రాండ్, అయార్స్ట్‌లు ఈ ఉపాయమూ అంతగా ఫలించలేదు సోల్జర్లకి భారతదేశ సమాజంలోని వివిధ నిర్బంధాలూ కట్టుబాట్లూ-వీటిని గురించి అంతగా తెలియదు మరి దేశాల లోకి కూడా చొచ్చుకొస్తున్నారని కొందరు గోల పెట్టేవారు ఇక పురప్రముఖుల దండు ఎంతో సానుభూతి చూపేగి మొత్తానికి రాండ్ కృషిని మెచ్చుకునేవారు ఎక్కువమంది లేకపోయారు

అగ్గిమీద ఆజ్యంపోసినట్లు కొందరు బ్రిటిషు సైనికులు ఎవరో ఒకరి ఇళ్ళవారిపట్ల అసభ్యంగా ప్రవర్తించారు....

— దామోదర్, బాలకృష్ణ — వాసుదేవ్ చాఫేకర్లు సోదరులు, ఉడుకురక్తం కల యువకులు బ్రిటిష్ పరిపాలకుల 'కళ్ళు తెరిపించా'లనుకున్నారు మరికొందరు యువకులతో కలిసి ఒక పథకం వేశారు

ఆ పథకం ఫలితమే రాండ్, అయార్స్ట్‌ల హత్య

రాండ్‌ని దామోదర్ (27 సం వయస్సు) చంపాడు, అయార్స్ట్‌ని బాలకృష్ణ (24) కాల్చి చంపాడు (వాసుదేవ్ వయస్సు 18 మాత్రమే)

ఈ సంఘటన జరిగిన వెంటనే అన్నదమ్ములు ముగ్గురూ మాయమయ్యారు

ప్రభుత్వంవారు 20,000 రూపాయల బహుమానం ఇస్తానన్నది వారిని పట్టి ఇచ్చిన వారికి

ఈ ఎర పనిచేసింది

ద్రావిడ్ సోదరులనేవారు ఇద్దరు చాఫేకర్ల ఆచూకీ అధికారులకి తెలియజేశారు

దామోదర్‌ని బొంబాయిలో అరెస్టు చేశారు బాలకృష్ణ నయిజాముకి పారిపోతే అక్కడనుంచి వెతికి పట్టుకు వచ్చారు

హత్యకేసు విచారణ ప్రారంభం అయింది

ఇంతలో వాసుదేవ్ తన మిత్రుడు రానడే సహాయాన్ని అర్థించాడు

ఇద్దరూ ఒకనాడు న్యాయస్థానం ప్రవేశించారు

ఆ సమయంలో ద్రావిడ్ సోదరులు సాక్ష్యం ఇవ్వటానికి అక్కడికివచ్చి ఉన్నారు

వాసుదేవ్ చాఫేకర్, రానడేలు తమ జేబుల్లో దాచిన రివాల్వర్లని బయటికి తీశారు

ద్రావిడ్ సోదరులు వారి తుపాకులకి అక్కడే, న్యాయస్థానంలోనే, ఆహుతి అయ్యారు

దామోదర్ బాలకృష్ణలకి మరణ దండన విధించారు—రాండ్, అయార్స్ట్‌ల హత్యకోసం

ద్రావిడ్ సోదరులని చంపినందుకు వాసుదేవ్, రానడేలని ఉరితీశారు

గణేశ్ ఖిండ్ రోడ్డుమీద ఆ ఫలకం ఈ విషాదగాథకి ఒక స్మృతిచిహ్నం ఎనిమిది నిండు ప్రాణాలని బలిగొన్న భయంకర కథకి స్మృతిచిహ్నం. ఆ ఫలకం ఇంకా అక్కడే ఉంది. ●

రచయితలకు మనవి

కథలు, వ్యాసాలు

ప్రచురణకి స్వీకరించబడని తమ వ్రాతప్రతులని తిప్పిపంపగోరే రచయితలు వ్రాతప్రతులతోబాటే తగుమాత్రం తపాలాబిళ్ళలు అతికించిన, స్వంత చిరునామాగల కవరు కూడా పంపాలి స్టాంపులు మాత్రం పంపరాదు స్టాంపులు మాత్రం పంపించినట్లయితే వ్రాతప్రతులు తిప్పిపంపబడవు వ్రాతప్రతులతో గాక విడిగా స్వంత చిరునామా, తగుమాత్రం పోస్టేజికల కవర్లు పంపినా వ్రాతప్రతులు తిప్పిపంపబడవు

ప్రచురణకి స్వీకరించబడని వ్రాతప్రతుల విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు

నవలలు

ప్రచురణకి స్వీకరించబడని నవలల వ్రాతప్రతులు మేమే తిప్పి పంపిస్తాము వ్రాతప్రతులతో స్వంత చిరునామాగల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు పంపనవసరం లేదు 100 ఆరఠావు పేజీలవరకు ఉన్న వ్రాతప్రతులే నవలలకింద పరిగణింపబడుతాయి

కార్టూన్లు

ప్రచురణకి స్వీకరించబడని కార్టూన్‌లు తిప్పి పంపగోరేవారు కార్టూన్లతో స్వంత చిరునామాగల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు జతపరచి పంపాలి స్టాంపులు మాత్రం పంపరాదు

షరా వ్రాతప్రతులనీ, కార్టూన్లనీ వీలయినంత భద్రంగా తిప్పిపంపే ప్రయత్నాలు చేస్తాము కాని, వాటి విషయమైన ఎటువంటి బాధ్యతనీ స్వీకరించలేము ఈ షరతుని గమనించి రచయితలు తమ రచనలు, కార్టూన్‌లు పంపగలరు

సంపాదకుడు
ఆంధ్రసచిత్రవారపత్రిక



'తిక్క శంకరయ్య'లో రామారావు, కృష్ణకుమారి.

చిత్రసమీక్ష

తిక్క శంకరయ్య

మనకి కేవలం హాస్యరసం ప్రధానంగా గల చిత్రాలు చాలా తక్కువ. హాస్యం ప్రధాన లక్ష్యంగా వుంచుకుని సకలరస భరితంగా నిర్మించే చిత్రాలు మరీ తక్కువ ప్రేక్షకులకి కావలసిన వినోదాన్ని మన నిర్మాతలు ఎంతవరకు అందిస్తున్నారు? అనే ప్రశ్నకి డి. వి. యస్. ప్రొడక్షన్స్‌వారి తిక్క శంకరయ్య చక్కని సమాధానం చెబుతాడు!

రాణిని చూడ్డానికి వెళ్ళిన మోహన్ సుశీలను చూస్తాడు. ఆమెనే పెళ్ళిచేసుకుంటానంటాడు. అందుకు సిద్ధమై వచ్చినరోజున సుశీలకి లింగరాజుతో పెళ్ళయిపోయిందని వింటాడు. పెళ్ళి కాలేదనే యదార్థం తెలిసేటప్పటికి సుశీల దూరమైపోతుంది అతను ఆమెని వెదుకుతూ శంకరయ్య స్థానంలో పిచ్చాసుపత్రికి వెళ్ళవలసివస్తుంది తిక్కశంకరయ్య తప్పించుకుని రాణితో ప్రేమకలాపాలు సాగిస్తాడు అతని తిక్క కుదిరేవరకు; మోహన్ [illegible]వరకు ప్రేక్షకులకి పుష్కలంగా వినోదం లభిస్తుంది! మోహన్, శంకరయ్యలకు సంబంధించిన జన్మ రహస్యాలేమీ వుండవు గనక కథ కట్టుకథలా తోచదు. ఇద్దరి పెళ్ళిళ్ళతోనూ కథ సుఖాంతమవుతుంది!

అగ్రతారాబలం కంటికింపుగా వుండడం వల్ల కథలో కట్టుదిట్టాల గురించిన ప్రసక్తి అట్టే వుండదు చిత్రం ఆద్యంతమూ రసవత్తరంగా వుండటానికి కారణం/ చిత్రీకరణలో తీసుకున్న జాగ్రత్త హాస్యానికి శృంగారం జోడించినందువల్ల చిత్రం మరింత ఆహ్లాదంగా తయారయింది. ప్రేక్షకుల్ని ఖుషీగా పంపించాలన్న నిర్మాతల లక్ష్యం నెరవేరింది!

శంకరయ్య, మోహన్‌ల పోలికలతో తేడా లేకపోయినా పాత్రలలో వైవిధ్యం బాగా కనిపిస్తుంది రెండు పాత్రల్ని పోషించడంలో యన్. టి రామారావు ప్రతిభా విశేషాలు ప్రస్ఫుటంగా తెలుస్తాయి మోహన్ పాత్రలో పద్మశ్రీ కనిపిస్తే, శంకరయ్యలో నటరత్న కనిపిస్తారు కృష్ణకుమారి, జయలలితల నటనతో చిత్రం సర్వాలంకార సంశోభితమైంది సుశీలగా కృష్ణకుమారి, రాణిగా జయలలిత పాత్రలకి నిండుజీవం పోశారు మరో చెప్పతగినపాత్ర నాగభూషణంది అక్కడక్కడ ఎబ్బెట్టుగా కనిపించినా అలాంటి మనుషులూ వుండకపోరు అనిపిస్తుంది పద్మనాభం అందించిన హాస్యం చక్కిలిగింతలు పెడుతుంది. ఒక మంచిపాత్రను హాస్యయుతంగా పోషించి అల్లు రామలింగయ్య రక్తి కట్టించారు. తదితర ముఖ్యపాత్రలని సూర్యకాంతం, పద్మశ్రీ నాగయ్య, బాలకృష్ణ, శివరామకృష్ణయ్య, హేమలత, రేలంగి, రాజబాల, రాజ్‌బాబు, రావికొండలరావు పోషించి చిత్రాన్ని సర్వాంగసుందరం చేశారు.

గంటవుండే పెళ్ళికొడుకు పెట్టే బేడా తెచ్చుకుంటాడా? లింగరాజులాంటి మనుషులుంటారా? ఒక సేవకుడితో హీరో అంతతీవ్రంగా పోరాడాలా? దేవయ్య కారును ఎలా నడపగలిగాడు? అనే ప్రశ్నలు ఉదయిస్తాయిగాని — ఇవి కథా సంవిధానంలో మరుగుపడడానికి అవకాశం లేకపోలేదు!

పాత్రకి తగిన నేపథ్య సంగీతం వివి

పించడం చిత్రంలో ఒక ప్రత్యేకత. పిచ్చాసుపత్రిలో నాటకం మరో ఆకర్షణ.

చిత్రం చివరివరకు హృద్యంగమంగా వుందీ అంటే అందుకు కారణం రచన. డి. వి. నరసరాజా ప్రశంసార్హులు అలాగే కెమెరా వర్కు కూడా పకడ్బందీగా జరిగింది కన్నుల పండువగావున్న చిత్రీకరణకి సంగీతం వీనుల విందుచేసింది డి యోగానంద్ దర్శకత్వము, టి. వి. రాజా సంగీతమూ చిత్రం విలువని పెంచాయి.

అబాలగోపాలానికీ ఆనందం పంచి ఇవ్వగల ఈ చిత్రం మనకి వినోదచిత్రాలు లేనిలోటును తీరుస్తుంది నేటి ప్రజా జీవితానికి వ్యంగ్యప్రతిబింబంగా 'తిక్క శంకరయ్య'ను సృష్టించిన నిర్మాత డి. వి. యస్. రాజా అభినందనీయులు.

—సికరాజు ●



'నిలువుదోపిడి'లో జయలలిత.

మదరాసులో బస్సు-కళాశాలల తగాదాలు

ఒక సోమవారం సూర్యాస్తమయంతో మద్రాసులో కోలాహలం ఆరంభమయ్యిందది 'బస్సు వారి సమ్మెట' అన్నారు కొందరు ఏదో విద్యార్థులకూ వారికీ తగు వచ్చిందన్నారు అయితే మంగళవారం సూర్యోదయానికి యీ 'తగువు' ఆ స్థితిని దాటింది మంగళవారం మధ్యాహ్నమయ్యే సరికల్లా మద్రాసు లాటీ చార్జీలతోనూ, భాష్పవాయు ప్రయోగాలతోనూ కాల్పులతోనూ దద్దరిల్లి పోయింది ప్రాణ భయంతో జనం అల్లల్లాడి పోయారు. దెబ్బలు తగిలి, ప్రమాద పరిస్థితిలో ఆసుపత్రిలో చేర్చబడిన వారిసంఖ్య నూటముప్ఫయి దాటిందన్నారు. మద్రాసు 'లా' కాలేజి విద్యార్థులు కొంతమంది కీల్‌పాక్ ఆసుపత్రిలో చేర్చబడ్డారనీ, వారి పరిస్థితి క్లిష్టంగా వుందనీ అన్నారు ఒక విద్యార్థి కాలు తీసెయ్యాలని డాక్టర్లు తెలియజేశారు

లా కాలేజి హాస్టలు భవనాన్ని మద్రాసు స్టేట్ ట్రాన్స్‌పోర్టు పనివారు సోమవారం రాత్రి 11 30 గంటలకు చుట్టు ముట్టారని, చుట్టుముట్టి, కర్ణకఠోరమైన భాషలో తిట్టారనీ అన్నార సయ్యద్ ఉమర్ అనే డ్రయివరుకి విద్యార్థులకి జరిగిన ఘర్షణలో ఉమర్ చనిపోయాడట దాంతో తిక్కరేగిన ట్రాన్స్‌పోర్టు పనివారు విజృంభించి, కాలేజి హాస్టళ్ళన్నీ చుట్టుముట్టారు విద్యార్థి అని అనుమానం వచ్చిన వారిని చితక్కొట్టారు మద్రాసు మెడికల్ కాలేజి హాస్టలు భవనంలోకి యీ పనివారు ప్రవేశించి, భవనం క్రిందిభాగంలో వున్న గదుల్లోకి జొరపడి, అందిన విద్యార్థులను కర్రలతోనూ, రాళ్లతోనూ క్షమా, ధర్మం లేకుండా కొట్టి, వారి పుస్తకాలు, రికార్డులు, రేడియోలు, ట్రాన్సిస్టర్లు, మంచాలూ, కుర్చీలూ అన్నీ సర్వనాశనం చేసి, హాస్టలు లాండ్రికి, క్షౌరశాలకి నిప్పంటించారట కరంటు ట్రాన్స్‌ఫార్మర్‌కి కూడా నిప్పంటించ ప్రయత్నించారట

ఒక యం బి బి యస్ విద్యార్థిని రోడ్డు లాంతరు స్తంభానికి కట్టి కొట్టారట ఆ దారిన పోయే పాల లారీని ఆపి, ఆ పాలన్నీ నేలమీద పారపోసి, సీసాలన్నీ పగలకొట్టారట ఈ దురంతాన్ని నిగ్రహించలేని విద్యార్థులు ఎదురుతిరిగి సోడాబుడ్డ తోనూ, రాళ్ళతోనూ వాళ్ళని కొట్టారట ప్రభుత్వపు బస్సులను తమ యిష్టానుసారంగా యీ పనికి— ట్రాన్స్‌పోర్టువారు వాడుకున్నారట. కర్రలను, రాళ్ళను బస్సుల్లో పోసుకుని, హాస్టళ్ళ వైపు పరుగులెత్తారట ఈ రెండు పక్షాలకూ చెందని వారిని కూడా ట్రాన్స్‌పోర్టువారు చావ తన్నారుట. కొన్ని స్కూటర్లు, కార్లూ తగలేశారు.


సోమవారం రాత్రి 10—30 ప్రాంతంలో సుమారో రెండు వందలమంది పనివారు దుర్భాషలాడుతూ కుర్రాళ్లమీద విరుచుకుపడ్డారనీ, అంతలో మరో నాలుగు బస్సుల పనివాళ్ళు వచ్చి చేరారనీ, పోలీసులు మధ్యన నిలిచి తన్నులాట కాకుండా చాలాసేపు వారించారట కానీ, ఒకరు యిద్దరు పనివారు పోలీసువారిని ఏమార్చి హాస్టల్లోకి జొరపడ్డారట వారిద్దర్నీ విద్యార్థుల తన్నారట ఒకతను చావు తన్నులతో కాస్సేపటికి బయటికి వచ్చాడట మరొకతను రానేలేదట ఆ తరువాత స్పృహపోయిన అతన్ని ఆసుపత్రిలో చేరుస్తే— చనిపోయాడట.

అసలీ రభస ఎలా వచ్చిందంటే అందరూ తలొకమాదిరీ చెప్తున్నారు 7—సి బస్సులో కండక్టరు సీటులో వో విద్యార్థి కూర్చున్నాడట. కండక్టరు అతన్ని లేవమన్నాడట విద్యార్థి తనకు ఆరోగ్యం సరిగా లేదని లేవడానికి నిరాకరించాడట. ఒక స్త్రీ కోసం ఆ సీటు ఖాళీ చెయ్యమన్న కండక్టరు కోపంతో అతన్ని తన్నాడన్నారు కొందరు లేదు విద్యార్థే తన్నాడన్నారు మరికొందరు. మొత్తానికి తన్నులాట జరిగింది.

ఇలా ప్రారంభమయిన యీ రభసలో వూరంతా సర్వనాశనమై కళావిహీనంగా తయారయ్యింది. ఏది ఏమైనా తమ పనులకోసం, పగలకోసం ప్రభుత్వపు బస్సులు తీసుకుని విద్యార్థుల హాస్టళ్ళకు వెళ్ళడం అనేది అంత సమంజసం కాదు. ప్రభుత్వం యింకా తన నిర్ణయాన్ని బయట పెట్టలేదు.

ఒక అమాయక విద్యార్థిని చంపి ట్రాన్స్‌పోర్టువారు ప్యారిసు ప్రాంతంలో నడి రోడ్డుమీద పడేశారనీ, ప్రతీకారంగా విద్యార్థులు ఒక కండక్టర్ని చంపి, లా కాలేజీ ప్రాంతంలో చెట్టుకు వ్రేలాడదీశారనీ కొందరు చెప్పారు. ఏదిసత్యం, ఏదసత్యం ?

—ఫాలాక్షుడు ●



వాణిశ్రీ

వినుకొండ లేటి రాణి, వలమవేరు

హల్లో వాణిశ్రీగారూ, అందమైన హీరోయిన్లు ఎప్పుడు అందంగా కనబడతారండీ?

మీరు వేసినది ప్రశ్నా — జవాబా!

ఎం. అచ్యుత రామయ్య, ఎలమంచిలి

మీ అభిమాన ప్రేక్షకుల్లో నేనొక్కడిని. మీ నటన అంటే నాకు చాలా యిష్టం... మీకు నచ్చిన పాత్ర ఏమిటో తెలుపుతారా?

మీకు వచ్చినవన్నీ (పాత్రలు) నాకు నచ్చినట్లే భావిస్తాను.

పి. సుబ్రహ్మణ్యం, చిప్పేలి

మీకు ఎన్ని భాషలు వచ్చు?

పంచ భాషలు వచ్చు.

వచ్చిసీలం రామారావు, కాకినాడ

వాణిశ్రీగారూ! సినిమాలో పాటను వ్రాసిన రచయిత గొప్ప? లేక ఆ పాటను సరిఅయిన పద్ధతిలో పాడిన గాయకుడు గొప్ప? లేక ఆ పాటకు అనుగుణంగా నటించిన నటుడు గొప్ప?

ముగ్గురూ గొప్పగా వున్నప్పుడే వుంది మజా.

వి. ఆర్. ప్రసాదరావు, పాలకొల్లు

వాణిశ్రీగారు, ఇది రహస్యం. మా వీధిలో ఒక అమ్మాయి నన్ను తదేకంగా చూస్తూ వుంటుంది. ఆమెకు 'లెటరు' వ్రాయాలని వుంది మీ సలహా?

దేహశుద్ధికి ప్రిపేరయ్యి వ్రాయండి.

పి. రాంబాబు, మాచర్ల

ఏమండీ, మిమ్మల్ని ఎవరయినా ఏదైన పిక్చర్‌లో ఏదైనా పాత్రకు బుక్‌చేస్తే, మీరు ఆ పాత్రని బట్టి యాక్టు చేస్తారా, లేక ఆ పాత్ర ఎటువంటిదయినా యాక్టు చేయటానికి అంగీకరిస్తారా?

పాత్రను తీసుకున్నతర్వాత, అది ఏదైనాసరే తప్పకుండా బాగా చేస్తాను.

> నటి వాణిశ్రీ కోరికపై 'లేఖా వాణి' శీర్షికలో అత్యుత్తమమైన ప్రశ్నకు రు.10లు బహుమతి యివ్వడానికి నిర్ణయించడమైనది.
>
> —సం॥

కె. జయ, పాలకొల్లు

అక్కయ్యా, నీలాగే నేనూ ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకుంటున్నా. అంటే నువ్వు సినిమాల్లో! కానీ ... నేను నిజ జీవితంలో...ఏమంటావు?

సినిమా జీవితాన్ని మీ నిజ జీవితంతో పోల్చవద్దు. ఆపైన మీ యిష్టం.

ఎస్. టి. వి. ఖర్గపూర్

కార్డుల ధర పెరుగుతున్నట్లుంది. ఈలోగానే మీకొక పది కార్డుల నిండా ప్రశ్నలు పంపివేస్తే మాకు నష్టముండదు. ఏమంటారు?

ఎందుకండీ అంత బిగపట్టి వ్రాయడం!

పి. మురళీమోహనకృష్ణ, మాచర్ల

ఏమండీ మేము నల్గురం ఫ్రెండ్స్. నల్గురిలో ఒకడు మిమ్మల్ని బాగా గౌరవిస్తాడు. ఒకడు పూజిస్తాడు. ఒకడు తిడతాడు. ఒకడు అసలు ఏమీ పట్టించుకోడు వీరిలో ఎవరి మనస్తత్వము మీకు బాగా నచ్చిందో చెప్తారా?

ఎవరిపిచ్చి వారికి ఆనందం — అన్నారు పెద్దలు.

టి. ఎస్. ఎస్. ప్రసాద్, రాజమండ్రి

మీ ప్రక్కన హీరోగా వెయ్యాలని వుంది. నా కోరిక తీరుతుందంటారా? మీరంటే నాకు చాలయిష్టం. సినిమాలో మీరు ఏడుస్తుంటే నాకు ఏడుపు వస్తుంది. మీకు పెళ్లిఅయిందా? సమాధానం యిస్తారు కదూ! మర్చిపోయాను, మీరు ఎంతవరకు చదువుకున్నారు?

మీరు హీరోగా వచ్చినతర్వాత, మీరడిగిన ప్రశ్నలకు సమాధానం దానంతటదే దొరుకుతుంది.

బత్తిన కృష్ణ, ఖమ్మం

నాయిక పాత్రలను పోషించగల సమర్థత మీకున్నప్పుడు, మీరు చిన్న పాత్రలు ధరించి అసభ్యకరమయిన పన్ని వేశాల్లో నటించుటెందుకు?

మన సరుకును గుర్తించేవరకూ చెయ్యాక తప్పదు.

బి. గీతారాణి, హైదరాబాదు

మీరు ఎప్పుడు వివాహం చేసుకుంటారో

బహుమతిపొందిన ప్రశ్న

కె. మాధురీదేవి, ఏలూరు

నేను నటిని కావాలనుకుంటున్నాను. మీ సలహా ఏమిటి? అంటే నటికి కావలసినది?



నేను యింకా సలహాలిచ్చే స్థితికి రాలేదమ్మా, మాధురమ్మా.

తెల్పగలరా? ఎందుకో తెలుసా, మీ కాబోయే భర్తను 'బావ' అని పిలవాలని వుంది. జవాబిస్తారా?

చేసుకున్న తర్వాత కబురు పంపిస్తా. అప్పుడు పిలుద్దురుగానీ.

గీతాకుమారి, సికింద్రాబాద్

నాకు ఒక సినీతార అంటే యిష్టమండి. ఆయిష్టాన్ని పోగొట్టుకోవాలంటే ఏం చెయ్యాలి అక్కయ్యా?

ఆమె ఎవరో సెలవిస్తే, ఆతర్వాత మీరేం చెయ్యాలో చెబుతా.

ఎన్. అనసూయాశంకర్, బి.ఎస్.సి, కడప.

సినిమాలో చేరాలంటే, అదృష్టం కావాలా లేక కృషికావాలా?

రెండూవుంటేనే పైకి రాగలం.

ఎల్ గ్లాడిస్టన్, భీమవరం

మొట్టమొదటిసారిగా తప్పుచేసినప్పుడు గుండె వేగముగా కొట్టుకుంటుందెందుకండి?

అది తప్పు అని తెలిసికూడ చెయ్యడంవల్ల.

సినిమా

ప్రముఖ రచయిత శ్రీ ఆత్రేయ తన చిత్రం యొక్క షూటింగును నెల్లూరికి పన్నెండు మైళ్ల దూరంలోగల బుచ్చిరెడ్డిపాళెం గ్రామంలో ఒక నెల రోజులపాటు జరపటానికి నిశ్చయించారు. ఔట్ డోర్ వర్కు అంతా యిక్కడే జరుగుతుంది ఆ పని పూర్తికాగానే హైదరాబాదులో ఇన్ డోర్ వర్కు ప్రారంభమవుతుంది. మే ఆఖరుకు చిత్రం విడుదలవుతుందని యిటీవల ఆయన యూనిట్‌కు సంబంధించిన ఒక వ్యక్తి వెల్లడించారు. చిత్రంలోని ప్రధాన పాత్రలను శ్రీ నాగభూషణం, శ్రీమతి అంజలీదేవి నటిస్తున్నారు. శ్రీ పెండ్యాల నాగేశ్వరరావు ఈ చిత్రానికి సంగీతాన్ని నిర్వహిస్తున్నారు.

ఉండమ్మా బొట్టుపెడతా!

బాబూమూవీస్ నిర్మిస్తున్న 'ఉండమ్మా బొట్టుపెడతా' చిత్రంలో శ్రీమతి జమునతో శ్రీమతి షావుకారుజానకి నటిస్తోంది. కృష్ణతో శ్రీయుతులు నాగభూషణం, ధూళిపాళ, నాగయ్య నటిస్తున్నారు. శ్రీ సుందరం, ఆదుర్తిలకు స్వంతమయిన యీ సంస్థద్వారా రానున్న యీ సాంఘిక చిత్రాన్ని శ్రీ కె. విశ్వనాథ్ డైరెక్టు చేస్తున్నారు. శ్రీ కె. వి. మహాదేవన్ 'మూగమనసులు'లో మనకు కల్గించిన అనుభూతిని యీ చిత్రంలో జ్ఞాపకపర్చాలనే పట్టుదలతో ఏసందయిన ట్యూన్స్‌ను నిర్వహిస్తున్నారు. శ్రీ నంది సంభాషణలు వ్రాసారు. షూటింగు మద్రాసులోనే జరుగుతూ వుంది. ఈ చిత్రం కాగానే పద్మశ్రీ నాగేశ్వరరావుతో. ఆదుర్తి దర్శకత్వంలో 'అగ్నిపుత్రి' హైదరాబాదులో ప్రారంభమౌతుందని శ్రీ సుందరం వ్యక్తపర్చారు.

సెక్సును తగ్గించాలి!

నాగేశ్వరరావు ఈ మధ్య మద్రాసులో సతీ సమేతంగా నాల్గురోజులు వున్నారు. ఈ నాల్గురోజులూ, అభిమానులు, నిర్మా



'మంచి కుటుంబం'లో కాంచన, నాగేశ్వరరావు.

తలు, దర్శకులు, ప్రేక్షకులు ఆయన్ను చుట్టుముట్టేసి, తమ కంగ్రాచ్యులేషన్స్‌ను తెలియచేసుకున్నారు. ముఖ్యంగా మద్రాసు పాత్రికేయులసమాఖ్య యేర్పాటు చేసిన సన్మానసభలో పాల్గొనేందుకై అక్కినేని యిక్కడికి వచ్చినట్లు చెప్పారు. 'మంచి కుటుంబం'లో మీరు వయసు మళ్లిన పాత్రను ధరించారుగదా ? మరి జనం రిసీవ్‌చేసారా' అని ప్రశ్నించాము. దానికాయన నవ్వి—'ఆ చిత్రంలో నావేషాన్ని జనం బ్రహ్మాండంగా రిసీవ్ చేసుకున్నా' రని చెప్తూ, యీ క్రెడిట్ అంతా మధుసూదనరావు గారిది అని ఆయన్ను సూచించారు. మొదట్లో ఆ పాత్రను ధరించడానికి కాస్త భయపడ్డాను. దానికి కారణం లేకపోలేదు. మామూలుగా జనం నన్ను యిలాంటి పాత్రల్లో చూసివుండలేదు; మరి చిత్రం దెబ్బతింటే — దానికి బాధ్యుణ్ని నేనే అవుతాను. కానీ, దర్శకులు వి. మధుసూదనరావు నాకు నూతనోత్సాహాన్నిచ్చి, ఆ పాత్ర పోషణకు ప్రోత్సహించారు నాకు మనస్సుకు తృప్తికల్గించిన పాత్రల్లో యీ పాత్ర ఒకటి అని చెప్తూ మనచిత్రాల్లో సెక్సును తగ్గించడానికి మా ప్రయత్నాలు మేము చేసినా, మీలాంటి పాత్రికేయులు ప్రచారమూలకంగా జనానికి తెలియపర్చడం మీ ధర్మం అన్నారు.

* * *

'కంచుకోట' లాంటి మంచి జానపద చిత్రాన్ని నిర్మించిన శ్రీ యు. విశ్వేశ్వరరావు యీసారి 'కంచుకాగడ' పేరుతో మరియొక జానపద చిత్రాన్ని నిర్మించనున్నట్లు, శ్రీ సి. ఎస్. రావ్, మహదేవన్, మహారథుల కాంబినేషన్‌లో పద్మశ్రీ రామారావు, కాంతారావులు గాక మరి ముగ్గురు కథానాయకులు, నల్గురు నాయికలు, ముగ్గురు విలన్లు, నల్గురు వ్యాంప్‌లు వుంటారని మొన్న వారి ఆఫీసులో వెల్లడించారు.

ఇప్పుడిప్పుడే స్వస్థతకు వస్తూన్న విశ్వేశ్వరరావుకు మూడుమాసాల విశ్రాంతి అవసరమని వైద్యులు సలహా యివ్వడం చేత, యీ చిత్ర నిర్మాణ కార్యక్రమం జూన్ నెలాఖరునుండి మొదలిడతామని విశ్వేశ్వరరావు వెల్లడించారు.

* * *

శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు గంభీరమయిన పాత్రలకు పెట్టిందిపేరు, తేనె పూసిన కత్తిగా అద్భుతంగా నటిస్తారు సాత్వికపాత్ర నిర్వహణలో వారికివారే సాటి.



'పాపకోసం'లో దేవిక.

అలాంటి గుమ్మడిని నవభారత్ ఫిలింస్‌లో మాంత్రికుడిగా చూడగలరు నిజమయిన మాంత్రికుడు వాడుసుమా! రాజ్యాధిపతి అయిన గుమ్మడికి ఆ రాజ్యంలోనే వున్న రాజనాల (మాంత్రికుడు) కన్న మిన్నగా వుండాలనే కోరిక యేర్పడి, రాజ్యాన్ని అమాత్యునికి వదిలి వెళ్ళిపోతాడు ఈ అవకాశాన్ని మంత్రి తన స్వప్రయోజనానికి ఎలా వుపయోగించుకుంటాడో చూడండి

మంత్రి: ఈ హారం, ఉత్తరీయం మహారాజుగారివి, ఎక్కడ దొరికాయి నీకు?

గొల్లవాడు: జలపాతం దగ్గరండి

మంత్రి: మహారాణి ఆ జలపాతంలోనే ఆత్మహత్య చేసుకునిందని మహారాజు చెప్తూండేవారు అందుకే, మహారాజు కూడ యిక్కడే ఆత్మహత్య చేసుకున్నారు.

విదూషకుడు: అయితే, పాపం మహారాజుగారు ఆత్మహత్యే చేసుకున్నారంటారా?

మంత్రి: ఈ విషయం బయటకి పొక్కితే నీ తల తీయిస్తా

కుమారుడు: మరి ఈ విషయం వీరేంద్రకు తెలిస్తే

మంత్రి: వాడి మోహం — వాడికేం తెలుస్తుంది. వాడే ఈ హత్య చేసాడని ఈ వస్తువుల ఆధారంగా నిరూపిస్తాం,

సినిమా డైరీ

- మోహినీ ప్రొడక్షన్స్ నిర్మించిన "బ్లాక్‌మార్కెట్టు" చిత్రానికి మైసూరు ప్రభుత్వం 50 వేల రుపాయల నిధిని సమర్పించింది
- హాలివుడ్ చిత్రాని 'కదానికి పద్మశ్రీ శంకర్— జైకిషన్‌లు సంగీత నిర్దేశకత్వాన్ని నిర్వహిస్తారు
- హిందీ వ్యతిరేకోద్యమ కారణంగా నిలిపి వేయబడిన హిందీ చిత్రాలు మరలా ఆంధ్రప్రదేశ్ అంతటా ప్రదర్శింపబడుతున్నాయి.
- సత్యామువీస్ నిర్మించిన "కన్నన్— ఎన్— కాదలన్" చిత్రం మద్రాసులో తమిళ సంవత్సరాదికి విడుదలౌతుంది
- గౌరి ప్రొడక్షన్స్ నిర్మించిన "సర్కార్ ఎక్స్‌ప్రెస్" ఏప్రిల్ 5 వ విడుదలౌతుంది.
- మాధవి పిక్చర్స్ నిర్మిస్తున్న చిత్రంలో పద్మశ్రీ అక్కినేనితో కుమారి కాంచన కథానాయికగా నటిస్తుంది.
- ఆర్ వి ఆర్ పిక్చర్స్‌లో వాణిశ్రీ, శోభన్‌బాబులు నాయికా, నాయకులుగా నటిస్తున్నారు.
- కేం దమంతి, శ్రీ కె కె షా ఆధ్వర్యంలో హిందీ చిత్ర నిర్మాతలు మరియు పంపిణీదారులు, ఎగ్జిబిటర్లు కలసి ఒక సమావేశంలో సంప్రదించిన పిదప యిరు వర్గాలకు సామరస్యం యేర్పడిన ఫలితంగా మార్చి 31 నుండి హిందీ చిత్ర నిర్మాణాన్ని ఆపివేయదల్చుకున్న నిర్ణయాన్ని మానుకోవడం జరిగిందని విశ్వాసనీయంగా తెలియవచ్చింది మరలా యథాప్రకారంగా హిందీచిత్రాల షూటింగ్స్ పునః ప్రారంభింపబడ్డాయి

కొండి— అనడంతో డైరెక్టరు విశ్వనాథం 'కట్' అన్నారు. ఈ దుష్ట పన్నాగం నవభారత్ ఫిలింస్ నిర్మించే జానపదంలో మీరు చూడగలరు. ఈ సన్నివేశంలో దుష్టమంత్రిగా ధూళిపాళ, దుష్ట బుద్ధిగల కుమారుడిగా సత్యనారాయణ, విదూషకుడుగా రాజబాబు నటించారు. శ్రీ వేణు కెమెరాను కదిపారు. శ్రీ పూర్ణచంద్రరావు నిర్మించే ఈ చిత్రంలో మూడు తలల మనిషితో పోట్లాట, రబ్బరు డాన్సు ప్రత్యేక ఆకర్షణలుగా వుండగలవు.

నిన్నే పెండ్లాడుతా !

ప్రముఖ దర్శక నిర్మాత శ్రీ విఠలాచార్య నిర్మించనున్న సాంఘిక చిత్రానికి 'నిన్నే-పెండ్లాడుతా' అని పేరు పెట్టారు. ఏప్రిల్‌నుండి షూటింగు ప్రారంభం కాగల ఈ హాస్య చిత్రంలో పద్మశ్రీ రామారావు, రేలంగి, రమణారెడ్డి, బాలకృష్ణ, రావి కొండలరావు, కాకరాల, గణేష్, భారతి, విజయలలిత, సూర్యకాంతం ముఖ్య పాత్రలను ధరిస్తున్నారు. శ్రీ సి. నారాయణరెడ్డి వ్రాసిన ఆరు పాటలకు విజయకృష్ణ మధురమయిన బాణీలను కూర్చి రెడీ చేసి వుంచారు. శ్రీ విఠలాచార్య దర్శకత్వంలో



'ప్రేమకథ'లో సచ్చు, కె.ఆర్. విజయ.



ఈ చిత్రం సర్వాంగ సుందరంగా నిర్మింపబడుతుంది.

కీలుగుర్రం పునర్నిర్మాణం

తెలుగు చలనచిత్ర ప్రారంభానికి కారకులయిన వారిలో శ్రీమతి కృష్ణవేణి, శ్రీ మీర్జాపురంరాజా ముఖ్యులు. శోభనాచల స్టుడియో అధినేతలయిన యీ ఆదర్శ దంపతులు ఎం: ఆర్. ఏ. ప్రొడక్షన్స్‌ను స్థాపించి లోగడ తాము నిర్మించిన 'కీలుగుర్రం' చిత్రాన్ని ఈస్టుమన్ కలర్‌లో నిర్మించడానికి నిశ్చయించారు. పద్మశ్రీ నాగేశ్వరరావు, అంజలీదేవినటించిన భూమికల్ని యిపుడు పద్మశ్రీ రామారావు, విజయలలితలు ధరిస్తారు. శ్రీ ఎం. ఏ. రహమాన్ ఛాయాగ్రహణాన్ని నిర్వహిస్తారు. శ్రీ విఠలాచార్యగానీ, యోగానందగానీ యీ చిత్రాన్ని డైరెక్టు చెయ్యొచ్చు.

* *

సినిమా

శ్రీ యోగానంద్ దర్శకత్వంలో 'తిక్కశంకరయ్య' ప్రేక్షక జనరంజకంగా నిర్మింపబడింది. శ్రీ డి. వి: ఎస్. రాజు నిర్మించిన యీ చిత్రంలో పద్మశ్రీ రామారావు ద్విపాత్రాభినయం చేశారు. ఈ చిత్రంలోని అన్ని పాటలు పాప్యులర్ అయ్యే విధంగా టి. వి. రాజు స్వర కల్పన చేశారు.

'వగకాడ బిగువేలరా!

సొగసైన చినదాని బిగి కౌగిలి చేర!'

అని జయలలిత పద్మశ్రీ రామారావును చూచి పాడుతూ ఆమెలోని యౌవ్వనపు కోరికల్ని ప్రదర్శిస్తూవుంటే, పండు వృద్ధుడు కూడ జీల్ అయిపోతాడు.

ఇలాంటి సన్నివేశాలు కో-కొల్లలుగా వున్న 'తిక్కశంకరయ్య' చిత్రంలో కృష్ణకుమారి, పద్మనాభం, రేలంగి, నాగభూషణం, నాగయ్య, రాజనాల, అల్లు రామలింగయ్య, సూర్యకాంతం, రాజ్‌బాబు, రావి కొండలరావు, హేమలతలు గాక పద్మశ్రీ రామారావు, జయలలిత నాయకా నాయికలుగా నటించారు.



'రాము'లో మాస్టర్ రాము.

సాహసోద్యమం

'దేవదాసు', 'కన్యాశుల్కం' లాంటి ఉత్తమ చిత్రాలను నిర్మించిన శ్రీ డి. ఎల్. నారాయణ మరలా సాహసంతోకూడిన వుద్యమానికి పూనుకున్నారు. అదేమిటో తెలుసా? శ్రీ విశ్వనాథ సత్యనారాయణ విరచితంబయిన 'ఏకవీర'ను వెండితెరకెక్కించడానికి నిశ్చయించారు. ఈ చిత్రంలో పద్మశ్రీ నాగేశ్వరరావు, శ్రీమతి జమున, విజయ, టి. ఎల్. కాంతారావు ప్రధాన పాత్రలను పోషిస్తారు. శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి, ఆత్రేయ, డా॥ నారాయణరెడ్డి పాటలకు శ్రీ రాజేశ్వరరావు స్వరకర్తగా వుండగలరు. శ్రీ డి. ఎల్. నారాయణ మొట్టమొదటిసారిగా దర్శకత్వం నిర్వహించే యీ చిత్రాన్ని పద్మశ్రీఫిలింస్ హైదరాబాదులో నిర్మిస్తారు. శ్రీ పి. చెంగయ్య కథాగమనాన్ని చక్కగా తయారుచేసి వుంచారు. పద్మశ్రీ కాల్‌షీట్లు ఎప్పుడు వీలుపడ్తాయో, దాని ప్రకారం షెడ్యూలు ప్రారంభించబడుతుంది.

హిందీ సినిమాలు

కొంతకాలం కింద ఎ. వి. య్యప్పన్‌మె ఒక 'మంచి హిందీ సినిమా'కి సుమారు కోటి రూపాయలు రావచ్చుననీ, అందులో 17.5 శాతం బొంబాయి సర్క్యూట్‌దిగా ఉంటుందనీ అన్నారు.

ఇటీవలే 'టయిమ్స్ ఆఫ్ ఇండియా' పత్రికలో రాహుర్‌సింగ్ అనే ఆయన మరికొన్ని వివరాలు చెప్పారు.

1. బొంబాయిలో ఒక సినిమా హాలుని మద్దుగా తీసుకుంటే, ఆ హాలులో ఒక వారం అన్ని సీట్లూ నిండితే అక్కడ మొత్తం కలెక్షన్లు రు 60,000 ఉంటాయట. ఇందులో 27.000 వినోదపు పన్ను ఉంటుందిట. ఇక సినిమాహాలు అద్దె సుమారు 21,000 (కాని ఇందులో 30శాతం 'నల్ల డబ్బు' గా ఉంటుంది-ట!) ప్రచారం ఖర్చులు పోను నిర్మాతకి సుమారు 7,600 మిగలవచ్చుట. అంటే, నూటికి 12 లాభం అన్నమాట. ఇది పెట్టుబడికి తగిన లాభమా? అని కొందరు అడుగుతారు.

2. నటులు, నటీమణులు ఏ మాత్రం పుచ్చుకుంటారు. కొందరు 10 నుంచి 15 లక్షల రూపాయల దాకా (ఒక సినిమాకి) అని శ్రీ సింగ్ అంటారు. మళ్లీ ఇందులో 80 శాతం 'నల్ల మొత్త'మేట.

3. అమెరికాలో తారాగణంమీద 20– 30 శాతం ఖర్చు అయితే భారతదేశంలో 60 శాతందాకా అవుతుందిట.

4. మంచి సంగీత దర్శకులకి సినిమాకి 3 లక్షలదాకా (ఎక్కువ భాగం నల్ల మొత్తం) ఇస్తారుట.

ఇదంతా చూస్తే, నిర్మాతలు క్రమంగా సినిమా ఖర్చులు పెంచేసుకుని ఫ్లాపుల ధాటికి తట్టుకోలేక కొన్ని సంస్కరణలు కోరుతున్నారనే అనుమానం కలుగుతుంది!

—ఆర్. జి

మీకు తెలుసా?

శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు, డా. సి. నారాయణరెడ్డి హోసూరు తెలుగు జ్ఞానసమితి వార్షికోత్సవంలో పాల్గొన్నారు.

వాణిశ్రీకి ఉదయంపూట టీవ త్రాగటం అలవాటు.

రాజశ్రీకి కొంగ్రొత్త ఆల్సేషన్ కుక్కల్ని కొనడం అలవాటు.

శోభన్‌బాబు 1967 సంవత్సరపు ఉత్తమ సహాయనటుడిగా 5 ఫిలిం బ్యాలట్స్‌లో ఎన్నికయ్యారు.

సునందిని పిక్చర్స్‌కు కోదండపాణి సంగీత దర్శకుడిగా నియమింపబడ్డారు.

సుజాతా సినీ ఆర్ట్స్ చిత్రం యొక్క ఔట్‌డోర్ షూటింగు హైద్రాబాదులో జరిగింది. శ్రీ శివాజి గణేశన్, శ్రీమతి సరోజాదేవిలు పాల్గొన్నారు.

దేవర్ ఫిలింస్ నిర్మిస్తున్న సాంఘిక చిత్రంలో వాణిశ్రీ గుర్రపు స్వారీ చేస్తుంది.

పద్మనాభం చిత్రసీమకు రాకుండా వుండినట్లయితే కరణీకం చేసేవారు.

దేవికకు కోడికూర అంటే చాలా యిష్టం.

'ఒక రూపానికి రావడానికి కనీసం 3 మాసాలవుతుంది'

హైద్రాబాదంటే జ్ఞాపకం వచ్చింది. శ్రీమతి అంజలీదేవి, శ్రీ ఆదినారాయణరావులు తమ 'కుంకుమభరిణె' చిత్రం యొక్క ఔట్‌డోర్ షూటింగును మెదక్, నిర్మల్, నాగార్జునసాగర్, హైద్రాబాదు నగరంలోనూ జరిపేందుకు నిర్ణయించి మార్చి 24 న భాగ్యనగరానికి వెళ్ళారు. మీనంబాకం విమానాశ్రయంలో ముచ్చటిస్తూ, శ్రీ ఆదినారాయణరావు 'మహాకవి క్షేత్రయ్య' షూటింగును అక్టోబరులో ప్రారంభించదల్చినట్లు వెల్లడించారు. 'ఏమిటండీ, చాల లేటు అయ్యేట్లుందే' అని ప్రశ్నించాను. దానికి కారణం లేకపోలేదు. 'క్షేత్రయ్య' పదాలను (అన్నింటిని) మా చిత్రంలో పెట్టదల్చుకున్నాం. అదీ గాక, ఆంధ్రప్రదేశ్, మద్రాసు ప్రభుత్వాల పర్మిషన్ కావాల్సివుంది. తంజావూరులో ముఖ్య సన్నివేశాల చిత్రీకరణ చెయ్యాల్సివుంది. ఈ కార్యక్రమం అంతా ఒక రూపానికి వచ్చేందుకు కనీసం మూడు మాసాలవుతుంది. స్క్రిప్టు చాల చక్కగా వచ్చింది. ఈ చిత్రాన్ని ఒక ప్రెస్టేజ్ పిక్చర్‌గా ఆంధ్ర ప్రేక్షకులకు సమర్పించదలిచాను. అందుకే సబ్జెక్టుమీద నా మనస్సునంతా కేంద్రీకరింప చేస్తున్నాను. మన లోపం లేకుండా మనం ప్రయత్నించామంటే, ఆపైన 'వాడి' భారం, అన్నారు సంగీత సారథి శ్రీ ఆదినారాయణరావు.

ఆంధ్రప్రభుత్వ అవార్డులు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంయొక్క బంగారు నంది ని చక్రవర్తి చిత్ర 'సుడిగుండాలు' యీ సంవత్సరపు ఉత్తమ చిత్రానికి కేటాయించబడిన ప్రథమ బహుమతి నందుకుంది. పద్మశ్రీ నాగేశ్వరరావు, ఆదుర్తి సుబ్బారావులు యీ చిత్రాన్ని వ్యాపారదృష్ట్యా నిర్మించలేదు. ఈ చిత్రం ద్వారా ప్రేక్షకులకు పుత్తమ లక్ష్యాన్ని యేరుకపర్చాలనే ధ్యేయంతో, కళాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రాన్ని అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ కమిటీవారు కూడ వీక్షించేందుకై ఒక ప్రింటును తెప్పించి చూసారు.

వెండినంది శ్రీ ఎస్. వి. రంగారావు దర్శకత్వం వహించిన 'చదరంగం' చిత్రానికి వచ్చింది. శ్రీ రంగారావు మహానటుడు మాత్రమేకాదు; ఒక ఉత్తమ దర్శకుడు



'భార్య'లో నాగభూషణం, [illegible]లక్ష్మి.

అని నిరూపించిన చిత్రం 'చదరంగం'. ఈ చిత్రానికి ఫిలింఫేర్ అవార్డు కూడ వచ్చింది.

కాంస్యనంది ఎ. వి. ఎం. సంస్థ ఈస్టుమన్ కలర్‌లో నిర్మించిన 'భక్త ప్రహ్లాద'కు దక్కింది. శ్రీ చిత్రపు నారాయణమూర్తి దర్శకత్వంలో తయారయిన యీ చిత్రంలో కూడ శ్రీ రంగారావే నాయకుడు.

పై మూడు చిత్రాల నిర్మాణానికి సంబంధించిన ప్రముఖులు ఉగాది పర్వదినాన మన రాజధాని నగరంలో బహుమతులందుకున్నారు.

* * *

వాహిని రికార్డింగ్ థియేటరులో సౌండు ఇంజనీరు శ్రీ వి. శివరాం, సంగీత నిర్దేశకుడు చలపతిరావు ఆర్కెస్ట్రాకు లాస్టు మినిట్ రిహార్సల్సు యిస్తూవుంటే, నిర్మాత శ్రీ డూండేశ్వరరావు ఓ. కే. టేక్ చెయ్యండి అని అనడమే తరువాయి శ్రీమతి ఎస్. జానకి:

'పిలిచా నిన్నే—తలచా నిన్నే
ఇలారా—ఇలారా—ఇదుగో మాట;

— పాడడం ప్రారంభించింది. ఫస్ట్ టేక్ బెస్టుగా వుండడంతో ఓ. కే. అన్నారు చలపతిరావు. ఈపాట ఎందులోనిదో మీకు తెలుసా? శ్రీ జయలక్ష్మి పిక్చర్స్ నిర్మిస్తున్న 'తంగై' చిత్రంలో విజయలలిత ద్వారా వింటారు. కృష్ణ, చంద్రకళ, రాంమోహన్, ముక్కామల, రాజబాబు, విజయలలిత ప్రధానపాత్రలను పోషిస్తున్న యీ చిత్రానికి అప్పలాచార్య సంభాషణలను వ్రాసారు.

* * *

సినిమా

రికార్డింగ్ సరిగ్గా 12-10 గంటలకు ముగియడంలో వాహినిలోని రెండవ ఫ్లోర్‌లో నవజ్యోతివారి 'నడమంత్రపు సిరి' షూటింగుకేసి వెళ్ళాను. సెట్టు లోపల విజయలలిత, రాజబాబులు తమ డైలాగ్సును రిహార్సు చేస్తూవుండే సమయంలో రాజనాల కూడ వారిలో చేరుకున్నారు. శ్రీ తాతినేని రామారావు దర్శకత్వంలో విజయలలితను ప్రశంసిస్తూ రాజబాబు నటించిన సన్నివేశాన్ని చిత్రీకరించారు.

శ్రీ వందనం, సాంబశివరావులు నిర్మిస్తున్న ఈ సాంఘిక చిత్రంలో హరనాథ్, విజయనిర్మల, రాజనాల, సత్యనారాయణ, రాజబాబు, విజయలలిత ముఖ్య భూమికల్ని ధరిస్తున్నారు. శ్రీ చలపతి రావు మృదుమధురమయిన సంగీతపు బాణీలను విన్పిస్తున్నారు. కెమెరా స్వామి నిర్వహిస్తున్నారు.

ఏప్రిల్ రెండో వారం రెండు చిత్రాల ప్రారంభం

నవజ్యోతి షూటింగు చూచి తిరిగి వచ్చేప్పుడు నిర్మాత రామానాయుడు కన్పడి 'పాపకోసం' చిత్రాన్ని తమిళంలో నిర్మించదల్చినట్లు చెప్తూ, తమిళ చిత్ర నిర్మాణానికి సపరేట్ యూనిట్‌ను పెట్టదల్చుకున్నట్లు వెల్లడించారు. తమిళ వర్షన్‌కు మాధవన్ దర్శకులుగా వుంటారు. పద్మశ్రీ శివాజీ గణేశన్ అతిధిగా నటించేందుకు ప్రయత్నాలు జరుపుతున్నట్లు వ్యక్తపర్చారు. తమిళ 'పాసంకోసం' షూటింగుతోపాటు తెలుగు చిత్రాన్ని కూడ ప్రారంభించ దల్చినట్లు చెప్పారు. రెండు చిత్రాల షూటింగు వాహినీలోనే జరుగుతుంది. ఏప్రిల్ రెండవ వారంలో రెండు చిత్రాల షూటింగు ప్రారంభమవుతుందని శ్రీ నాయుడు వివరిస్తూ, తెలుగు 'పాపకోసం' చిత్రాన్ని హైదరాబాదులో పోలీసు కుటుంబాల సహాయ నిధికి శ్రీ పి. తిమ్మారెడ్డి అధ్వర్యంలో ప్రదర్శన యిచ్చి 30 వేల రూపాయలు వసూలుచేసి యిచ్చినట్లు ఉద్ఘాటించారు.



'అత్తగారూ - కొత్త కోడలు'లో రమాప్రభ.

* * *

వాహిని నుండి భరణికి వచ్చాము. అక్కడ చంద్రలోకం సెట్టులో శ్రీమతి దేవిక, శోభన్‌బాబులు యేదో తియ్యని వూహాల్లో యీ లోకాన్నే మైమరచి, మధురాతి మధురమయిన స్మృతుల్లో సౌఖ్యాన్ని తనివితీరా అస్వాదిస్తూ, ఆనంద పారవశ్యంలో తియ్యటి పాటను పాడడం ప్రారంభిస్తారు. ఈ రసవత్తరమయిన సన్నివేశం రామకృష్ణా పిక్చర్స్ నిర్మిస్తున్న 'తారాశశాంకం' చిత్రంలోనిది. ఈ చిత్రంలో తారా, చంద్రులుగా దేవిక, శోభన్‌బాబులు నటించారు. చంద్రుడికి (శోభన్‌బాబు) ఘంటసాల పాడారు; తారకు (దేవిక) సుశీల పాడింది. ఈ పాటను స్వర్గీయ సముద్రాల రాఘవాచార్య వ్రాసారు:'

చంద్రుడు: ఊ అంది అందాలతార
ఏమంది వ్రాసేమతార;
తార: మినుమిన్నుల లేనవ్వుల
విను కనుసన్నచేసి రమ్మంది.



8—3—68 తారీకున హైదరాబాదు బసంత్ టాకీసులో పూలరంగడు చిత్రం శతదినోత్సవ సందర్భమున తీసిన ఫోటో. కుడి నుండి కొండా లక్ష్మణ బాపూజీ, శ్రీనివాసరావు (నవయుగ) అక్కినేని నాగేశ్వరరావు, రాజేంద్రకుమార్, దుక్కిపాటి మదుసూధనరావు. (ఫోటో: ఎం. ఎ. మోహనరావు)



'తల్లిప్రేమ'లో రామ్మోహన్, కాంచన. ఈ చిత్రానికి శ్రీ మానాపురం అప్పారావు దర్శకులు. దీని షూటింగు 13 రీళ్లకు పైగా తయారైంది.

ఉండమ్మా — బొట్టెడుతా

భరణి నుండి వాసూ స్టుడియోలోకి అడుగుపెట్టాను. అక్కడ బాబా మూవీస్ నిర్మిస్తున్న 'ఉండమ్మా — బొట్టెడుతా' షూటింగు జరుగుతూవుండింది. మొదటి రోజు షెడ్యూలులో శ్రీ ధూళిపాల, శ్రీమతి జమున పాల్గొన్నారు. హరిదాసు వేషంలో ధూళిపాళ పాట పాడుకుంటూ వీధివెంబడి వస్తూవుంటే, లక్ష్మీదేవిలా శ్రీమతి జమున యెదురేగుతుంది.

శ్రీ కె. విశ్వనాథ్ దర్శకత్వంలో నిర్మితమవుతున్న ఈ సాంఘిక చిత్రాన్ని శ్రీ సుందరం, అదుర్తి సుబ్బారావులు నిర్మిస్తున్నారు.

* * *

పద్మశ్రీ పిక్చర్సు సారథీ స్టుడియోలో నిర్మిస్తున్న 'వింత కాపురం' చిత్రానికి మరి రెండు పాటల రికార్డింగ్ జరిగింది. శ్రీవేణు సంగీత దర్శకత్వంలో శ్రీ పిఠాపురం, స్వర్ణలత, సుశీల, ఈశ్వరి పాడిన పాటల్ని శ్రీ కొసరాజు వ్రాశారు. ఒక పాటను పద్మనాభం, రమాప్రభలపైన, మరియొక పాటను కాంచన, రమాప్రభలపైన చిత్రీకరణ జరుగుతుంది. శ్రీ వి. వి. సుబ్బారావు దర్శకత్వంలో సర్వాంగసుందరంగా తయారవుతున్న యీ చిత్రంలో కాంచన, కృష్ణ, రేలంగి, పద్మనాభం, సూర్యకాంతం, జయంతి, రమాప్రభ, విజయలలిత, అల్లు రామలింగయ్య, ప్రభాకరరెడ్డి, రాధాకుమారి, రావి కొండలరావు ముఖ్య భూమికల్ని ధరిస్తున్నారు. ఈ చిత్రకథను, సంభాషణలను భమిడిపాటి రాధాకృష్ణ వ్రాసారు. పాటల్ని శ్రీయుతులు నారాయణరెడ్డి, ఆరుద్ర, కొసరాజు, దాశరథి వ్రాసారు. శ్రీ కృష్ణారావు కళాదర్శకత్వాన్ని నిర్వహిస్తే, సెల్వరాజ్ ఛాయాగ్రహణాన్ని గమనిస్తున్నారు.

—శ్రీనివాస్

ఆటలు

ప్రేక్షకుల బాధ్యత?



మద్రాసు ఫుట్‌బాల్ అసోసియేషన్ లీగ్ ఛాంపియన్‌షిప్ సీనియర్ విభాగం పోటీలు రెండు వారాల్లో రెండుసార్లు మధ్యలో ఆగిపోయాయి. అలా జరిగింది వర్షం రావడంవల్లో, చీకటి పడటంవల్లో కాదు. ప్రేక్షకులు ఆటస్థలంలోకి లంఘించి రెఫరీపై చెయి చేసుకోడమేకాకుండా ఆస్తి నష్టాన్ని కూడా కలిగించడం దానికి కారణం.

ఇలాంటి జుగుప్సాకరమైన సంఘటనలు కలకత్తా మైదానంలో జరగడం సర్వసాధారణం. ఫుట్‌బాల్ ఆటకి పేరు పొందిన ఆంధ్రప్రదేశ్‌లోకూడా నాకు తెలిసినంతవరకూ యిలాంటివి జరగలేదు.

ఇటీవలి సంవత్సరాల్లో యిది కలకత్తానుంచి మద్రాసుకు పాకి ఆకర్షణీయమైన క్రీడారంగాన్ని అసహ్యకరంగా రూపొందిస్తున్నది. పోటీ నిర్ణయించడంలో ముఖ్యపాత్ర వహించే 'పెనాల్టీ కిక్స్' వెయ్యడం, వెయ్యకపోవడం అన్న దానిపై గొడవ ప్రారంభం అవుతుంది. అనుభవజ్ఞులైన రెఫరీలు మంచి దక్షతనే ప్రదర్శిస్తారు. ప్రేక్షకుల్లో ఎవరైనా తనకి అభిమానపాత్రమైన బృందం వోడిపోయే పరిస్థితి ఏర్పడేప్పుడు మరి కొందర్ని కూడగట్టుకుని ఆటకి అంతరాయం కలిగిస్తారు. అలాంటి సందర్భాలలో ఆ రెఫరీ మళ్లీ ఏ ఆటలో మధ్యవర్తిత్వాన్ని నెరపడానికి సాహసించకపోవచ్చు కూడా.

ఇది ఆటకీ, ఆటగాళ్లకీ ఆరోగ్యకరమైనది కాదు. తప్పు చేయడం మానవసహజం. రెఫరీ పొరపాట్లు చేసినప్పుడు అతన్ని ఆ విధంగా ఎదుర్కోడం సమంజసం కాదు. ఒక పక్షానికి జయాన్నో, అపజయాన్నో కలిగించడానికి బహిరంగంగా నిర్ణయాలు తీసుకున్న వ్యక్తి శిక్షార్హుడే. కానీ ప్రేక్షకులు ఆ అధికారాన్ని తమ చేతులలోకి తీసుకోరాదు. మిగతావారికంటే ప్రేక్షకులే ఆట నిర్విఘ్నంగా కొనసాగటానికి తమని తాము అదుపులో పెట్టుకోవాలి.

* • *

గతంలో అనేకసార్లు విజయాన్ని సాధించిన సాటిస్‌ని మార్చి 24న జరిగిన ఆటలో తేలికగా ఓడించి 'స్పోర్ట్ అండ్ పాస్‌టయిమ్' ట్రోఫీని ఇండియా పిమెంట్స్ గెలుచుకున్నది. క్రికెట్ అభివృద్ధికీ, ఆటగాళ్లకి సంస్థలలో ఉద్యోగావకాశాలను కల్పించడానికి ఏర్పాటు చేసిన ఈ పోటీ బహుళ ప్రచారాన్ని పొందింది.

—కె. ఎస్. నరసింహన్

మనం ఇలా ఉంటే మన మానవ సేవ కూడా అంతమాత్రమే ఉంటుంది. అందుకని ఎవరయినా తనని తానే తెలుసుకుని బాగుపడాలనుకుంటే అంతమేరకి తన మానవసేవ కూడా పెరుగుతుంది. ఇటువంటి వారి సేవ ఆత్మవిశ్వాసం అధికంగా ఉండేవారి సేవకన్నా మంచిదిగా కూడా ఉంటుందేమో!

మహర్షి అంటాడు— ఏ మనిషయినా సరే ధ్యానం ద్వారా తన వృత్తి వ్యాపారంలో పయికి రాగలడు. అతను లేక ఆమె ఎకవుంటెంటయినా సరే, సంగీతం పాడే వ్యక్తి అయినా సరే.

మూడు—ఇప్పుడు చలామణి అవుతున్న మతాల స్థాపకులు ప్రపంచానికి తిరిగి వస్తే—మోసెస్, బుద్ధుడు, ఏసుక్రీస్తు, మహమ్మదు అందరూ— తమ అనుచరుల నడవడిని చూసి హడలి పోవచ్చు. బోధించే దానిలో సాధారణంగా ఏమీ లోపం ఉండదు,

ఉత్తరాలు రాసేవారికి మనవి: ఉత్తరాలు వీలయినంత చిన్నవిగా ఉండాలి! కాగితానికి ఒకవయిపుననే రాసి ఉండాలి. రాసినవారి పేరు, చిరునామా తెలుగు అక్షరాలలోనే రాయాలి. వీలయినంత దాకా ఇంగ్లీషు, ఇతర భాషల అక్షరాలు వాడవద్దని లేఖకులకు మనవి చేసుకుంటున్నాము. (సం)

బీటిల్స్ ఋషికేశానికి..

(47వ పేజీ తరువాయి)

అమలు పరిచే వారిలోనే ఉంటుంది...

మనం నమ్మేది 'మతం'లో, వాళ్ళు నమ్మేది 'మూఢాచారం.'

నాలుగు— ఒక మతగురువు దొంగ గురువో కాదో తెలుసుకోగలిగింది అతని అనుచరులు, అతని మతాన్ని అనుసరించేవారూ. కేవలం అతని ఆకారాన్నిపట్టి నిజాయితీని అంచనా వెయ్యలేము.

ఒకసారి ఏసుక్రీస్తు అన్నాడుట—జాన్ (దిబాప్టిస్ట్) తోలుబట్టలుధరించి అడవి—తేనె తిని జీవించినప్పుడు అతన్ని జనం 'దొంగ సన్యాసి' అన్నారు, తను 'సాధారణంగా' ప్రవర్తించినప్పుడు 'పాపులతోనూ, ఇతర బహిరంగ వ్యక్తులతోనూ' సావాసం చేస్తున్నాడని విమర్శించారు...

కొన్ని అభిప్రాయాలని మార్చటం కష్టం. మతగురువులు నవ్వుతూ, ఉల్లాసంగా ఉండరాదా? ప్రతి ఋషీ గంభీరంగా ఉండితీరాలిసిందేనా? బుద్ధుడు తన శిష్యులతో పరిహాసాలు ఆడుతూనే ఉండేవాడు. ఏసుక్రీస్తు వ్యంగ్యంగా మాట్లాడేవాడు. తమ భక్తిని చాటుకునేవారంటే అతనికి అంత ఇష్టం ఉండేదికాదు. మానవుడికోసం 'శాబత్' కాని 'శాబత్' కోసం మానవుడు కాదని అతను గ్రహించాడు.

త్యాగం అంటే

అయిదు— తాము సుఖంగా జీవించేవారు మతగురువులు సుఖంగా జీవించరాదని కొందరంటారు. ఎందుకో నాకు తెలీదు. సన్యాసం, నిషేధాలు, పేదరికం మనకి ఇష్టం లేకపోయినప్పుడు తక్కినవారిమీద ఎందుకు రుద్దాలి? ఏమయినా నిష్ఠ ఒక సాధనంకాని దానంతట అది సుగుణం కాదు. మనం నేర్చుకోవటానికి వెళ్ళి మనమే శాసిస్తే ఎలాగు?

ప్రపంచ మంతటా—కనీసం పాశ్చాత్య దేశాలలో— ఉన్న పరిస్థితులపట్ల అసంతృప్తి పెరిగింది. దీనికి కారణం కొంతవరకూ టెలివిషన్ అనుకుంటాను. పాత పద్ధతిలో పెద్దవారు చిన్నవారికి నేర్పేవారు. ఇప్పుడు పిల్లలు టెలివిషన్ చూసి అన్నీ నేర్చుకుంటున్నారు. కాని, ఇంకా పెద్ద కారణాలు ఉన్నాయి. నేటి యువప్రపంచం అన్నీ స్వానుభవంమీద తెలుసుకుందా మనుకుంటోంది.

'పక్కవారిని ప్రేమించు, అని బయిబిలు చెప్తోంది. పక్కవారెవరో మనకి తెలీదు. అందరినీ ద్వేషించటమే మనకి తెలుస్తోంది.' అన్నాడు (బీటిల్) జార్జి హారిసన్.

'రెండో చెంప చూపించే వారేరీ?' అని అడిగింది నేను వింటూండగా ఒక అమ్మాయి హాలీవుడ్‌లో.

జపానులో సోక్కగాక్కై అనే వీర బౌద్ధ మతం తెగ ఉంది. 'బౌద్ధ మతంలో వీరగుణానికి ఏమి స్థానం ఉంది? బుద్ధుడే పోరాడే వీరుడయితే రాజుగానే ఉండిపోయేవాడు' అన్నాడొక జపాన్ యువకుడు.

చవక యాత్రలు

ఇంతమంది అమెరికన్‌లు యూజిన్ మెక్కార్తీకి వోట్లు వేస్తున్నారెందుకు? అధ్యక్షుడు జాన్సన్‌పట్ల నమ్మకంతగ్గింది కాబట్టి. ఇలాగే ఇతరదేశాలలోనూ.

ప్రపంచంలో ఎక్కడ చూసినా శుష్క బోధనలూ, మిధ్య ధర్మాలూ, అర్థంలేని మాటలూ ఎదురవుతున్నాయి యువప్రపంచానికి. మన వాతావరణాన్ని సాంకేతిక సాధనాలవల్ల మార్చి త్వరలో చంద్రమండలానికి వెడుతున్నామంటారు. చంద్రలోక యాత్రలు త్వరలో అందరికీ వీలవుతాయంటారు. ఈ చవక యాత్రలు సాధారణుల అందుబాటులో లేవని జనానికి తెలుసు. అందుచేత మరోక రకం యాత్రలు చేస్తారు యువజనం—ఈ యాత్రలు అంతరంగిక యాత్రలు; భంగు మత్తుమందుల సాయంతో చేసే కాల్పనిక యాత్రలు. ఇవి అధర్మమయినవా? కావచ్చు. కాని, అవి నమ్మకానికి విరుద్ధమయిన యాత్రలు కావు. అయితే మత్తుమందుల యాత్రలు వ్యర్థమయినవని బీటిల్స్ తెలుసుకున్నారు. మరొక రకం కోసం వెతుకుతున్నారు. అన్వేషణ అనేది ఒకటి ఉంది. అదే చాలు.

(పో. వ. ఫి.)

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.


కింగ్-సైజు
పొదుపైనది
No 1
గులాబీల సువాసన
మీ ప్రపంచాన్ని
గులాబీలమయము
చేసుకోండి...
గోద్రెజ్ నెం. 1
సబ్బు తాజాదైన
గులాబీల ఘాటైన
సువాసనను
కలిగి ఉంది
గోద్రెజ్ వారి
నెం. 1
బ్యూటీ సోప్